శనివారం
3•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 265
• పేజీలు : 16 + 4 పేజీల ప్రత్యేక అనుబంధం + (20/16)

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# మెట్టు దిగిన ఏపీ

## కృష్ణా జలాలను అధికంగా వాడుకున్నట్టు ఒప్పుకోలు

- ఎండీడీఎల్ దిగువన వాడకానికి అనుమతించాలని వినతి
- అభ్యంతరం వ్యక్తంచేసిన తెలంగాణ
- రిజర్వు నిల్వల వినియోగానికి బోర్డు సమ్మతి
- శ్రీశైలం, సాగర్‌లో ఎండీడీఎల్ ఎగువన 33 టీఎంసీల నీళ్లు
- అందులో తెలంగాణకు 24, ఏపీకి 9.3 టీఎంసీల వాటా
- త్రిసభ్య కమిటీ భేటీలో తేల్చిన కృష్ణాబోర్డు
- ఎండీడీఎల్ దిగువనున్న నీటి వాడకంపై 20 తర్వాత భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కృష్ణా జలాల్లో తమ వాటా ఇంకా అయిపోలేదని, తెలంగాణ లెక్కల ఆధారంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని నిన్నటిదాకా ప్రశ్నించిన ఆంధ్రప్రదేశ్ ఎట్టకేలకు దిగొచ్చింది. అధిక నీటి వినియోగాన్ని అంగీకరించింది. అయినా పంటల కోసం ఇంకా నీళ్లు కావాలని, తమ అధికనీటి వినియోగాన్ని తదుపరి లెక్కల్లో సర్దుబాటు చేసుకోవాలని కోరింది. కృష్ణాపై ఉన్న రెండు ప్రధాన జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన ప్రస్తుతం 33.77 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని, ఇందులో తెలంగాణ 24.46, ఆంధ్రప్రదేశ్ 9.3 టీఎంసీల వాటాను వినియోగించుకోవచ్చునని కృష్ణాబోర్డు తెలిపింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి కృష్ణాజలాల వినియోగంపై గతంలో నిర్ణయించిన వాటాల్లో ఏపీ తన వాటాకు మించి అధికంగా నీటిని వాడుకున్నది. దాంతో ఏపీకి నీటి విడుదలను నిలిపివేయాలని కృష్ణాబోర్డు ఆదేశించింది. ఆ ప్రకారం సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను తెలంగాణ అధికారులు నిలిపివేశారు. అయినా నీటి విడుదల కొనసాగించాలంటూ ఏపీ సర్కారు

మిగతా 2వ పేజీలో


శుక్రవారం కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని పోగాకు బోర్డు మైదానంలో దిగుతున్న మావోయిస్టు మృతదేహాలతో వచ్చిన హెలికాప్టర్

### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

# పది మంది నక్సల్స్ హతం


ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ (ఫైల్)

- మృతుల్లో ఆరుగురు మహిళా నక్సల్స్
- ఎన్‌కౌంటర్‌లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి
- ఒక ఏకే 47 సహా పది తుపాకులు స్వాధీనం
- మృతుల్లో అగ్రనేతలు హరిభూషణ్, దామోదర్?
- తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న హరిభూషణ్
- జేఎండబ్ల్యూపీ కార్యదర్శిగా పనిచేస్తున్న దామోదర్
- మృతదేహాలను ఇంకా గుర్తించలేదన్న ఖమ్మం ఎస్పీ
- కాల్పుల నుంచి తప్పించుకున్న పార్టీ కీలక నేతలు!
- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

**జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని దట్టమైన అడవిలో శుక్రవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూసుగుప్ప పోలీసుస్టేషన్ పరిధిలోని తడపల-పుజారీకాంకేర్ అటవీప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనాస్థలం భద్రాది జిల్లా చర్ల మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మహిళా నక్సల్స్ సహా పదిమంది మావోయిస్టులు మృతిచెందారు. నక్సల్స్‌ను ఎదుర్కొనే క్రమంలో తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ కూడా చనిపోయారు. చనిపోయినవారిలో సీపీఐ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ అలియాస్ లక్మా దాదా, అలియాస్ జగన్, ఆయన భార్య సమ్మక్క అలియాస్ శారద, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, భద్రాద్రి కొత్తగూడెం-తూర్పుగోదావరి

మిగతా 2వ పేజీలో



## పసుపుపంట కోసం ప్రత్యేక స్పైసెస్ పార్క్ 3

మంత్రి కేటీఆర్ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు

## అద్భుత ఆవిష్కరణల వేదిక టీ హబ్ 2

భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ కితాబు



# ఉన్నమాటంటే ఉలుకెందుకు?



- విపక్షాలకు పాలుపోకే విమర్శలు
- ఇంకోసారి 'బచ్చా' అంటే ఏ సమాధానం చెప్తానో చూడండి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలతో మమేకమయ్యేందుకు చేస్తున్న జిల్లాల పర్యటనతో.. విపక్షాలకు ఏమిచెయ్యాలో తోచడం లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు వ్యాఖ్యానించారు. అందుకే విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు. సచివాలయంలో శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఇన్ని రోజులూ ఇదే విపక్షనేతలు ముఖ్యమంత్రి జిల్లాలు తిరుగడం లేదన్నారు. ఇప్పుడు సీఎం జిల్లాల పర్యటనలు చేస్తుంటే ఏమిచేయాలో వారికి అర్థంకావడం లేదు. అందుకే విమర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు. 'విపక్షనేతలు ఎన్నికల వాతావరణంలోకి వెళ్లారు. మేమూ అదే ధోరణిలో ఉంటే తప్పా?' అని మంత్రి కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. 'సూట్ వేసుకుంటే అమెరికా భాషంటారు. ప్రజల భాషలో మాట్లాడితే తప్పంటున్నారు. కాంగ్రెస్ నేతల గురించి నేను పూర్తి వాస్తవాలే మాట్లాడాను. ఉన్నమాటే అంటే అంత ఉలుకెందుకు? ఇంకోమారు 'బచ్చా' అంటే ఏ సమాధానం చెప్తానో చూడండి' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.



• జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ తార



## అరుణారెడ్డికి ఘనస్వాగతం

శంషాబాద్ నుంచి అత్తాపూర్ వరకు భారీ ర్యాలీ
వెల్లువెత్తిన క్రీడాభిమానులు
దారిపొడవునా జయజయధ్వానాలు

వివరాలు ఆటలో

## నేడు టీఆర్ఎస్ ఎంపీల భేటీ

- పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- పార్లమెంటరీ పార్టీ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్న సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రగతిభవన్‌లో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగనుంది. సోమవారం నుంచి

మిగతా 2వ పేజీలో




**ప్రత్యేక అనుబంధం**

క్రెడాయ్ ప్రాపర్టీ షో సందర్భంగా 'నమస్తే తెలంగాణ' సంపద అందిస్తున్న ప్రత్యేక అనుబంధం

# పొతంగల్ అభివృద్ధికి 'సన్' చేయూత



శుక్రవారం ఎంపీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిసిన సన్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావేరి. చిత్రంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్‌అహ్మద్, సన్‌గ్రూపు సంస్థల ప్రతినిధి కిరణ్ ఉన్నారు.

- నిజామాబాద్ ఎంపీ కవితతో ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావేరి భేటీ
- సీఎం కేసీఆర్, ఎంపీ కవితపై ప్రశంసలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని పొతంగల్ గ్రామాన్ని అభివృద్ధిచేయడానికి.. సామాజిక బాధ్యతలో భాగంగా సన్ ఫౌండేషన్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, యువకులకు పలు కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు సంస్థ చైర్‌పర్సన్ కావేరి శుక్రవారం నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి తమ సమ్మతిని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ చేపట్టనున్న కార్యక్రమ వివరాలను ఎంపీ కవిత మీడియాకు వివరించారు. పొతంగల్ గ్రామంలో ఈ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు, యువకులకు ప్రత్యేకంగా భవనాలు నిర్మిస్తారని.. వారి అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు. డిజిటల్ లిటరసీతోపాటుగా మరికొన్ని ఇతర కార్యక్రమాలు చేపడుతారన్నారు. సన్‌ఫౌండేషన్ సంస్థ ఇప్పటికే యూనిసెఫ్ లాంటి అంతర్జాతీయస్థాయి సంస్థలతో కలిసి పనిచేస్తున్నందున.. ఆ సంస్థ చేపట్టే కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో జీవనప్రమాణాలు పెంచే విధంగా దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా సన్‌ఫౌండేషన్ సంస్థకు, చైర్మన్‌కు ఎంపీ కవిత ధన్యవాదాలు తెలిపారు. తమ సంస్థ ఇప్పటికే సామాజిక బాధ్యత కింద తమిళనాడు, కర్ణాటకల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నదని, తెలంగాణలో తొలిసారిగా నిజామాబాద్ జిల్లా పొతంగల్‌లో చేపడుతున్నామని సంస్థ చైర్‌పర్సన్ కావేరి తెలిపారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు.. ఎంపీ కవిత దూరదృష్టిని ప్రశంసించారు. పొతంగల్‌లో ఇంటర్నెట్ సెంటర్, పిల్లలు, యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్‌అహ్మద్, సన్‌గ్రూపు సంస్థల ప్రతినిధి కిరణ్ పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లోని టీ హబ్‌ను సందర్శించిన అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్. చిత్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, యూఎస్ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా, సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ఉన్నారు.

# అద్భుత ఆవిష్కరణల వేదిక.. టీ హబ్

- భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ కితాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన టీ హబ్ అద్భుత ఆవిష్కరణకు కేంద్రమని భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ ప్రశంసించారు. ఐటీలోని నూతన ఆవిష్కరణలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సహా పలు నూతన పోకడలపై టీ హబ్‌లో జరుగుతున్న ఆవిష్కరణలు గొప్ప మలుపునకు శ్రీకారం చుడుతాయని ఆకాంక్షించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చిన జస్టర్ శుక్రవారం టీ హబ్‌ను సందర్శించి టీ హబ్ ప్రతినిధులతో ముచ్చటించారు. గొప్ప ఆవిష్కరణలకు వేదికగా టీ హబ్ నిలిచిందని కొనియాడారు. టీ బ్రిడ్జ్ పేరుతో అమెరికా సిలికాన్ వ్యాలీలోని ఆవిష్కర్తలను కూడా ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, యూఎస్ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా, సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



## నేడు పాలమూరులో సర్పంచ్‌ల సమ్మేళనం

- ప్రారంభించనున్న మంత్రి జూపల్లి
- ఎల్లుండి నిజామాబాద్‌లో నిర్వహణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్రంలో సర్పంచ్‌ల సమ్మేళనాలను నిర్వహిస్తున్నది. తొలుత మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సర్పంచ్‌ల సమ్మేళనాన్ని ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అప్పన్నపల్లి వైట్‌హౌస్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచ్‌లు పాల్గొననున్నారు. ఈ నెల 5న నిజామాబాద్‌లో.. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని నిర్వహిస్తామని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్), యాదాద్రి భువనగిరి జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని ఈ నెల రెండోవారంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమ్మేళనానికి ప్రతి జిల్లా నుంచి 100 మంది సర్పంచ్‌లను ఆహ్వానిస్తున్నారు. వీరికి జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపుపొందిన గ్రామ సర్పంచ్‌లతో తమ అనుభవాలను పంచుకొనేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, వందశాతం పన్నుల వసూలు, ఎల్‌ఈడీ లైట్ల వినియోగం, నీటి సంరక్షణ, ఉపాధి హామీ వంటి కార్యక్రమాల్లో తాము ఎలా ముందుకు వెళ్లింది వారు వివరించనున్నారు.

# దేశవ్యాప్తంగా మెడికల్ పీజీలో అవకాశం

- నేషనల్ పూల్‌లో రాష్ట్రం నుంచి 8 వేల మంది విద్యార్థులకు అవకాశం
- నీట్ పీజీ పరీక్షపై మంత్రి లక్ష్మారెడ్డి సమీక్ష
- జడ్చర్లలో వంద పడకల దవాఖాన డిజైన్ల పరిశీలన

**హైదరాబాద్/జడ్చర్ల, నమస్తే తెలంగాణ:**



శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జడ్చర్ల వంద పడకల దవాఖాన నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

తెలంగాణ రాష్ట్రం మొదటిసారి నేషనల్ పూల్‌లో చేరిన కారణంగా ఇక్కడి విద్యార్థులకు దేశవ్యాప్తంగా మెడికల్ పీజీలో ప్రవేశ అవకాశాలు దక్కనున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న నీట్ మెడికల్ పీజీ ప్రవేశాలపై కుటుంబ సంక్షేమం జాతీయ శిక్షణా సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేషనల్ పూల్‌లో మన రాష్ట్రం చేరినందున పీజీ అడ్మిషన్ల ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు ఈసారి నీట్ నిబంధనల ప్రకారం జరుగనున్నాయని చెప్పారు. నేషనల్ పూల్‌లో చేరినందున 50 శాతం సీట్లను జాతీయస్థాయి భర్తీకి వదలాల్సి ఉందన్నారు. అదేవిధంగా మన రాష్ట్ర విద్యార్థులు దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోనూ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఏర్పడిందని మంత్రి అన్నారు. ఇందుకుగాను తెలంగాణకు చెందినవారికి 8 వేల మందికి పీజీలో ప్రవేశార్హత దక్కనుందని వివరించారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి, అడిషనల్ సెక్రటరీ సోనీబాలదేవి, జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ సునితాదేవి, హెల్త్‌యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ లలితకుమారి, నిమ్స్ డైరెక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.20 కోట్లతో జడ్చర్లలో పనులు**

జడ్చర్ల నియోజకవర్గ ప్రజల అవసరాల దృష్ట్యా 30 పడకల దవాఖానను వంద పడకలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టామని వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో భవన నిర్మాణ నమూనాలను పరిశీలించారు. రూ.20 కోట్ల వ్యయంతో వంద పడకల దవాఖాన నిర్మించనున్నామని తెలిపారు. నిర్మాణం చేపట్టిన ఏడాదిలోపు భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వైద్యశాల నిర్మాణంతో జడ్చర్ల నియోజకవర్గ ప్రజలకు ఆధునిక, అత్యవసర స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## మెట్టు దిగిన ఏపీ


మొదటిపేజీ తరువాయి...


పోలీసులను పంపించి జల దౌర్జన్యానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కృష్ణాబోర్డు శుక్రవారం త్రిసభ్య కమిటీ భేటీ నిర్వహించింది. జలసౌధలో బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ, ఏపీ జల వనరులశాఖ ఈఎన్సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వరరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశం మూడు గంటలకు పైగా సుదీర్ఘంగా జరిగింది. నీటి పంపిణీకి సంబంధించి గత నెల 8న భేటీలో నిర్ణయించిన మేరకు ఏపీ వాటా 60 టీఎంసీల వినియోగం పూర్తయిందని బోర్డు స్పష్టం చేసింది. ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు దీనిని అంగీకరించక తప్పలేదు. అయినా కుడికాల్వ కింద పంటలను కాపాడుకునేందుకు తమకు సాగునీటి అవసరం ఉందని, ప్రస్తుతానికి నీటి విడుదల కొనసాగించి, ఆ మేరకు వినియోగాన్ని తదుపరి లెక్కల్లో సర్దుబాటు చేయాలని అభ్యర్థించారు. అవసరమైతే తదుపరి తమ వాటాకుగాను రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటి విడుదలకు అనుమతించాలని కోరారు. దీనిపై తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. సాగర్ ఎడమకాల్వకు సాగునీటి విడుదల దృష్ట్యా ఈనెల 20వ తేదీ వరకు కచ్చితంగా సాగర్‌లో 520 అడుగుల నీటిమట్టం ఉండాల్సిందేనన్నారు. ఏపీకి తక్షణ నీటి అవసరం దృష్ట్యా ప్రస్తుతం ఎండీడీఎల్ ఎగువన నీటి లభ్యతను వాడుకునేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. దీంతో రిజర్వులో ఉంచిన నీటిని వాడుకోవాలని బోర్డు చెప్పింది. గత నెల 8న జరిగిన బోర్డు సమావేశంలో రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన ఉన్న నీటిలో సుమారు 23 టీఎంసీలను రిజర్వులో ఉంచారు. ప్రస్తుతం ఏపీ అవసరాలు తీర్చడానికి ఆ నీటిని కూడా వాడుకునేందుకు బోర్డు అనుమతించింది. గత నెల 28వ తేదీ వరకు ఎండీడీఎల్ ఎగువన శ్రీశైలంలో 10.819 టీఎంసీలు, సాగర్‌లో 22.95 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నట్లు బోర్డు లెక్కగట్టింది. రెండింటిలో కలిపి 33.77 టీఎంసీల్లో తెలంగాణకు 24.46, ఏపీకి 9.3 టీఎంసీల వాటా ఉన్నదని బోర్డు తేల్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ కానున్నాయి. అయితే రెండు రాష్ట్రాలు నీటిని వాడుకునేందుకు వీలుగా శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల చేయాలని తెలిపింది. తెలంగాణ డిమాండు మేరకు ఈనెల 20వ తేదీ వరకు మాత్రం సాగర్‌లో 520 అడుగుల ఎగువన మాత్రమే నీటిని వాడుకోవాలని, ఈనెల చివరినాటికి 515 అడుగుల నీటిమట్టం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా, ఈ ఏడాది ఆగస్టు వరకు తాగునీటితోపాటు ఇతర అవసరాలకు 46 టీఎంసీల నీళ్లు కావాలని సమావేశంలో తెలంగాణ స్పష్టం చేసింది. ఈ ఏడాది మే వరకు 30 టీఎంసీలు, అందులో 26 టీఎంసీలు ఈ మార్చి నెలలోనే కావాలని ఏపీ కోరింది. ఇప్పటికి ఎండీడీఎల్ ఎగువన తేల్చిన వాటాను ఈనెల 20వ తేదీ వరకు వాడుకోవాలని, 20వ తేదీ తర్వాత మరోసారి బోర్డు విస్తృతస్థాయి భేటీ ఏర్పాటు చేసుకుని అప్పటి పరిస్థితులపై చర్చిద్దామని బోర్డు సభ్యకార్యదర్శి రెండు రాష్ట్రాలకు సూచించారు. ఎడమకాల్వ నుంచి నీటి సరఫరా, ఆవిరి నష్టాలు, శ్రీశైలం అవుట్‌ఫ్లో, నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లోల మధ్య 44 టీఎంసీల నీటి వ్యత్యాసం, టెలిమెట్రీ వంటి అంశాలు ఈ భేటీలో చర్చకు రాలేదు.

**2017-18 నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాల కృష్ణాజలాల వినియోగం వివరాలు:**

బేసిన్‌లో (పట్టిసీమ, మైనర్ ఇరిగేషన్ వినియోగాలను మినహాయించి) మొత్తం 470.798 టీఎంసీల్లో ఏపీ 326.662 టీఎంసీలు (69.385 శాతం), తెలంగాణ -144.137 టీఎంసీలు (30.615 శాతం). శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి వాడకంలో మొత్తం 325.088 టీఎంసీల్లో ఏపీ 237.047 టీఎంసీలు (72.918 శాతం), తెలంగాణ 88.041 టీఎంసీలు (27.082 శాతం). శ్రీశైలం, సాగర్‌ల్లో ఎండీడీఎల్ ఎగువన రెండు రాష్ట్రాలకు మిగిలిన వాటా మొత్తం 33.770 టీఎంసీలు. అందులో ఏపీకి 9.303 టీఎంసీలు, తెలంగాణకు 24.467 టీఎంసీలు.

## నేడు టీఆర్‌ఎస్ ఎంపీల భేటీ


మొదటిపేజీ తరువాయి...


ప్రారంభమయ్యే పార్లమెంట్ బడ్జెట్ రెండో విడుత సమావేశాల్లో టీఆర్‌ఎస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, వ్యవహరించాల్సిన తీరుపై చర్చిస్తారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సీఎం కేసీఆర్ ఎంపీలకు దిశానిర్దేశం చేస్తారు. సమావేశానికి హాజరుకావాలని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానం అందింది.

## ప్రాంతీయ భాషల్లోనూ రైల్వే సమాచారం

- తాజాగా కన్నడ భాషలో టికెట్ల ముద్రణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాంతీయ భాషల్లో టికెట్ల జారీతోపాటు రైళ్ల సమాచారాన్ని ప్రయాణికులకు ఇండియన్ రైల్వేస్ అందించనున్నది. తాజాగా కర్ణాటకలోని అన్ని రైల్వేస్టేషన్లలో గురువారం నుంచి కన్నడ భాషల్లో టికెట్ల జారీ, ఇతర సమాచారాన్ని ప్రయాణికులకు అందించింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలుగులో త్వరలో సేవలందించేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లిష్‌లో మాత్రమే రైల్వేసేవలు కొనసాగుతున్నాయి.

### ముహూర్తం



సూర్యోదయం: 6.37 గంటలకు



సూర్యాస్తమయం: 6.19 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం పాడ్యమి తె. 4.07 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తర రాత్రి 8.55 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.05 నుంచి 3.41 వరకు, రాహుకాలం: ఉదయం 9.32 నుంచి 11.00 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.37 నుంచి 8.10 వరకు, వర్జ్యం: లేదు.

### లోకం పోకడ




వాళ్ల కొంపలు మునిగాయని మన కొంపలమీద వడ్డీ వసూలు చేస్తారట!

# పది మంది నక్సల్స్ హతం



కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా





మావోయిస్టుల మృతదేహాలు


మొదటిపేజీ తరువాయి...


డివిజన్ కమిటీ కార్యదర్శి కొయ్యడ సాంబయ్య అలియాస్ గోపన్న, మరో నేత సాగర్ ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఏ ఒక్క మృతదేహాన్ని కూడా ఇంకా గుర్తించలేదని రాష్ట్ర పోలీసులు స్పష్టంచేశారు. మరోవైపు మృతుల్లో హరిభూషణ్ అంగరక్షకులు డిప్యూటీ కమాండర్ సంజీవ్, పెద్ద బుద్రి అనే మహిళ ఉన్నట్టు దక్షిణ బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్‌రాజ్ పీటీఐ వార్తాసంస్థకు చెప్పారు.

**తారసపడింది ప్రైమరీఫోర్స్!**

రెండ్రోజులుగా మావోయిస్టుల ప్లీనం జరుగుతున్నదన్న సమాచారం అందుకున్న తెలంగాణ గ్రేహౌండ్స్ దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో కూంబింగ్ మొదలుపెట్టినట్టు తెలుస్తున్నది. శుక్రవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. అయితే, పోలీసులకు తారసపడింది మావోయిస్టు ప్రైమరీ ఫోర్స్ అని సమాచారం. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించేందుకు మావోయిస్టు ముఖ్య నేతలు ఈ ప్రాంతంలో సమావేశమయ్యారని తెలుస్తున్నది. ఇటువంటి సమావేశాలు జరిగినప్పుడు ఆ పరిసరాల్లో 60 నుంచి 70మంది సాయుధ మావోయిస్టులతోకూడిన ప్రైమరీ ఫోర్స్ పహారా కాస్తుంటుంది. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ దళమే సీఆర్పీఎఫ్, గ్రేహౌండ్స్ దళాలకు ఎదురుపడిందని చెప్తున్నారు. ఎన్‌కౌంటర్ అనంతరం మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకున్నారు. వీరిలో పలువురు అగ్రనేతలు ఉన్నట్టు తెలిసింది. తప్పించుకున్న మావోయిస్టుల్లో కొందరు గాయపడినట్టు సమాచారం. వారికోసం ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసులు కూంబింగ్ కొనసాగిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో పోలీసులు అలర్ట్ అయ్యారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**మృతదేహాలను ఇంకా గుర్తించలేదు: అంబర్‌కిశోర్‌ఝా**

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పదిమంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ చనిపోయినట్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం భద్రాచలంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా పుజారీ కాంకేర్ అటవీ ప్రాంతంలో రెండు రాష్ట్రాల పోలీసులు కూంబింగ్ చేస్తుండగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని, మృతిచెందిన మావోయిస్టుల్లో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. సంఘటనాస్థలంలో ఒక ఏకే 47 రైఫిల్, ఐదు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, రెండు సింగిల్ బోర్ రైఫిళ్లు, ఒక 303 రైఫిల్, పిస్టల్, రేడియో, రూ.41 వేల నగదు, మూడు క్లెమోర్‌మైన్లు, ఆరు రాకెట్‌బాంబులు, రెండు సోలార్ ప్లేట్లు, పార్టీ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఘటనాస్థలం నుంచి తొలుత హెలికాప్టర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహాన్ని భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించామని, మిగిలిన ఎనిమిది మృతదేహాలను శనివారంనాటికి తరలించేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని తెలిపారు. హైకోర్టు ఆదేశాలమేరకు మావోయిస్టుల మృతదేహాలకు ప్రత్యేక వైద్యబృందంతో పోస్టుమార్టం నిర్వహిస్తామని, మహిళా మావోయిస్టుల మృతదేహాలను మహిళా వైద్యులతో పోస్టుమార్టం చేయిస్తామని చెప్పారు.

**చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

ఈ ఘటనపై భద్రాద్రి జిల్లా చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్టు జిల్లా ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా చెప్పారు. ఘటనాస్థలం ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నందున బీజాపూర్ జిల్లా పరిధిలోని ఊసూరు పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీచేస్తామని తెలిపారు. కూంబింగ్ ఇంకా కొనసాగుతున్నందున మృతదేహాల తరలింపులో జాప్యం జరిగిందని చెప్పారు. విలేకరుల సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్, ఏటూరునాగారం ఏఎస్పీ రాహుల్ హెగ్డే, భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్, కొత్తగూడెం ఓఎస్డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**కానిస్టేబుల్ మృతిపై మంత్రుల దిగ్భ్రాంతి**

**నవాబుపేట:** ఎన్‌కౌంటర్‌లో కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతి చెందడంపై హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి శుక్రవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### చనిపోయినట్టు ప్రచారం జరుగుతున్న వారి వివరాలు..



హరిభూషణ్

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు ప్రచారం జరుగుతున్న మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌ది మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని మాడగూడెం. జిల్లాల పునర్విభజన తర్వాత సీపీఐ(మావోయిస్టు) పార్టీ సంస్థాగత మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర కమిటీ తొలి కార్యదర్శిగా హరిభూషణ్ నియమితులయ్యారు. హరిభూషణ్ భార్య శారద స్వగ్రామం గంగారం మండల కేంద్రం. ఆమె మావోయిస్టు పార్టీలో ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కొత్తగా ఆవిర్భవించిన జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీకి తొలి కార్యదర్శిగా దామోదర్ బాధ్యతలు చేపట్టారు. నాలుగు జిల్లాల్లో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి. ఈయన గతంలో కరీంనగర్, ఖమ్మం, వరంగల్ (కేకేడబ్ల్యూ) డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ గోపన్న స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం. విద్యార్థి దశలోనే ఈయన అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. గతంలో మావోయిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శిగా పనిచేసిన గోపన్న సంస్థాగత మార్పుల తర్వాత భద్రాద్రి కొత్తగూడెం-తూర్పుగోదావరి డివిజన్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు.



శారద



దామోదర్




గోపన్న

### మేకవనంపల్లిలో విషాదం

**మోమిన్‌పేట/న్యాల్‌కల్:** బోపనిపల్లి సుశీల్‌కుమార్(32) ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడన్న వార్తతో అతని స్వగ్రామమైన మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా ఉండే సుశీల్‌కుమార్ లేడనే వార్తతో గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అతని స్నేహితులు సుశీల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయ్‌కుమార్, శారద ఇతని తల్లిదండ్రులు. తల్లి శారద మోమిన్‌పేట్ మండలంలో ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. దాంతో వారి కుటుంబం మేకవనంపల్లిలో నివాసం ఏర్పరుచుకుంది. మేకవనంపల్లికి చెందిన కొనింటి సామేల్ కుమార్తె సుష్మను సుశీల్ వివాహం చేసుకున్నారు. వీరికి రెండున్నరేండ్ల కూతురు(సుశీక) ఉంది. ఇతని కుటుంబం ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో నివాసం ఉంటున్నది. శనివారం బీదర్‌లో సుశీల్‌కుమార్ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డీఎస్పీ నల్లమల్ల రవి తెలిపారు.

**సుశీల్‌కుమార్‌కు నివాళి**

ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహానికి భద్రాచలం ప్రభుత్వ ఏరియా దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. తరువాత సుశీల్‌కుమార్ మృతదేహంపై జిల్లా ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా జాతీయజెండాను కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్‌తోపాటు భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు అధికారిక లాంఛనాలతో ప్రత్యేక వాహనంలో భద్రాచలం హాస్పిటల్‌నుంచి ఊరేగింపుగా సుశీల్‌కుమార్ మృతదేహాన్ని వికారాబాద్‌కు పంపారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం మేకవనంపల్లికి చెందిన సుశీల్‌కుమార్ 2004లో సైబరాబాద్ సివిల్ కానిస్టేబుల్‌గా పోలీసు ఉద్యోగంలో చేరారు. డిప్యుటేషన్‌పై 2010లో గ్రేహౌండ్స్‌కు వెళ్లారు.



భద్రాచలం ఏరియా దవాఖానలో సుశీల్‌కుమార్ మృతదేహం

**కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకోవాలి**

ఎన్‌కౌంటర్‌లో అమరుడైన సుశీల్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ పోలీసు అధికారుల సంఘం శుక్రవారం ప్రభుత్వాన్ని కోరింది. అతడి కుటుంబానికి రూ.40 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు సత్వరచర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు వై గోపిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సుశీల్‌కుమార్ మృతి పట్ల ఆయన ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. తెలంగాణలో 330 మందికి పైగా పోలీసులు నక్సల్స్ చేతిలో హతమయ్యారని తెలిపారు. వందలసంఖ్యలో పౌరులు, నాయకులు కూడా మరణించారని గుర్తుచేశారు. ప్రజల కోసం పాటుపడుతున్నట్టు చెప్పే మావోయిస్టులు ప్రజల్లో ఉండి ప్రజాస్వామ్యయుతంగా పోరాడాలని సూచించారు. పౌరహక్కుల సంఘాల వైఖరి మారాలని ఆయన అన్నారు.

### మృతుల్లో అగ్రనేత!

మృతుల వివరాలను పోలీసులు వెల్లడించకపోయినప్పటికీ ఘటనాస్థలంలో దొరికిన ఆయుధాల్లో ఏకే 47 తుపాకి ఉండటంతో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ కూడా చనిపోయి ఉండొచ్చని ప్రచారం జరిగింది. దీంతో హరిభూషణ్ సోదరుడు అశోక్, సోదరి భద్రాచలం ప్రభుత్వ దవాఖాన వద్దకు వచ్చారు. మావోయిస్టు పార్టీలో సాధారణంగా పైస్థాయి నాయకులు మాత్రమే ఏకే 47వంటి అధునాతన ఆయుధాన్ని ఉపయోగిస్తారు. ఇదిలావుంటే.. ఎన్‌కౌంటర్ జరిగిన తీరుపై అనుమానాలు ఉన్నాయని పౌరహక్కుల సంఘాల నేతలు, విప్లవకవి వరవరరావు పేర్కొన్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటరని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ హైకోర్టులో పౌర హక్కుల సంఘం తరఫున అత్యవసర పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై లంచ్‌మోషన్‌లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. మృతదేహాల పోస్టుమార్టం ప్రక్రియను వీడియోలో రికార్డ్‌చేయాలని పోలీసులను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించిన మృతదేహాలకు ఫోరెన్సిక్ డాక్టర్‌తో పోస్టుమార్టం జరిపించాలని, అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగించాలని స్పష్టంచేసింది.

### తెలంగాణలో ప్రశాంతత భగ్నానికి కుట్ర!

- ఆదివాసీల మధ్య చిచ్చుకు మావోయిస్టుల విఫలయత్నం
- గిరిజన రిజర్వేషన్ల విషయంలో రెచ్చగొట్టుడు వైఖరి
- పన్నాగం ఫలించక నక్సల్ నేతలు చేతులెత్తేశారన్న పోలీసులు

**ఖమ్మం ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక అలజడులు సృష్టించిన మావోయిస్టులు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలతో ఇతర రాష్ట్రాల్లో కార్యకలాపాలకు పరిమితమయ్యారని పోలీసులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత తెలంగాణను భగ్నం చేసేందుకు కొంతకాలంగా మావోయిస్టులు కుట్రలు పన్నుతూనే ఉన్నారని, ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు విస్తరించి ఉన్న గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఎంచుకున్న మావోయిస్టులు.. అక్కడక్కడ తమ ఉనికిని తెలిపేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆదివాసీలు నివసించే ప్రాంతాలను ఎంపిక చేసుకోవటాన్ని గమనించిన పోలీసులు వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేయడంతో మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లారని.. అక్కడినుంచి కుట్రలు చేస్తూ ఇక్కడ అలజడి రేపేందుకు పథకం రచించారని పోలీసు అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఎస్టీలు అధికంగా ఉన్న జిల్లాల్లో ఆదివాసీల మధ్య మావోయిస్టు పార్టీ చిచ్చుపెట్టిందని వారు ఆరోపిస్తున్నారు. ఎస్టీ రిజర్వేషన్‌ను లంబాడీలు అత్యధికంగా ఉపయోగించుకుంటున్నారని, ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలిగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలను మావోయిస్టు పార్టీ రెచ్చగొట్టిందని అంటున్నారు. ఆదిలాబాద్‌లాంటి జిల్లాల్లో ఆ పార్టీ బహిరంగ లేఖలుసైతం విడుదలచేసింది. దీంతో మావోయిస్టులు ఏదో ఒక విధంగా రాష్ట్రంలో అలజడులు సృష్టించే అవకాశం ఉందని గ్రహించి, వారి కదలికలపై నిఘావేయడంతో రాష్ట్ర సరిహద్దులు దాటిపోయారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే తాజా ఎన్‌కౌంటర్ జరిగిందని వ్యాఖ్యానిస్తున్నారు.

# ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధి

- భూపాలపల్లి జిల్లాలో ప్రకృతి అందాల వీక్షణకు అటవీశాఖ పర్యాటక కార్యక్రమాలు
- అడవులు, జలాశయాల వద్ద బస, క్యాంప్‌ఫైర్, ఎడ్లబండ్లపై విహారం, లేక్ వ్యూ సఫారీ, సాహసక్రీడలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భూపాలపల్లి జిల్లాలో పర్యావరణ సహిత పర్యాటకకేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర అటవీశాఖ పలు చర్యలు తీసుకుంటున్నది. ఈ జిల్లాలో అందమైన కొండలు, కోనలు, జలపాతాలు, వాగులు, వంకలు, దట్టమైన అడవులు, పచ్చనిచెట్లు, ప్రకృతి రమణీయతకు నెలవైన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని తిలకించేందుకు అనువైన వ్యూపాయింట్లను గుర్తించి ఎకో టూరిజం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేస్తున్నట్లు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్ కుమార్‌ఝా తెలిపారు. పర్యాటకులు అడవి ఒడిలోనే బసచేసి ప్రకృతి అందాలు ఆస్వాదించడానికి వీలుగా మూడు ప్యాకేజీలను రూపొందించారు. ఏటూరునాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రంతోపాటు లక్నవరం సరస్సు, బొగత వాటర్ ఫాల్స్, మేడారం, కాళేశ్వరంగుడి, ప్రతాపగిరి కోట లాంటి ప్రాంతాల సందర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పర్యాటకులు రెండురోజులపాటు అడవిలోనే గడిపేందుకు వీలుగా తాడ్వాయి వద్ద ఆకర్షణీయంగా గుడిసెల మాదిరిగా నివాసాలను (హట్స్) నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన హట్స్‌కు మంచి స్పందన వస్తున్నది. దాంతో మరిన్ని హట్స్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల సైక్లింగ్, ట్రెక్కింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఎకోసెంటర్, ఆదిమానవుల గుహలు, బ్లాక్‌బెర్రీ ద్వీపం, కొండేటి వ్యూపాయింట్ తదితర ప్రాంతాల సందర్శనను ఒక ప్యాకేజీలో చేర్చారు. ఇందుకోసం ఒక్కో పర్యాటకుడు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. లక్నవరం సందర్శనకు మరో ప్యాకేజీ ఉంది. ఈ ప్యాకేజీ కింద లక్నవరంలో రాత్రిపూట టెంట్లలో బస, క్యాంప్ ఫైర్, బోటింగ్, ద్వీపం సందర్శన అడవిలో ట్రెక్కింగ్, ఎడ్లబండిపై విహారం, లేక్ వ్యూ సఫారీ సందర్శన చేయవచ్చు. ఇక పాండవుల గుట్ట సందర్శన ప్యాకేజీలో రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, బౌల్డరింగ్ వంటి క్రీడలుంటాయి. నిపుణులైన పర్యవేక్షకుల సహకారంతో పర్యాటకులు ఈ సాహస క్రీడలను ఆస్వాదించవచ్చు. వివరాలకు7382619363లో సంప్రదించవచ్చు.



భూపాలపల్లి జిల్లాలో పర్యాటకశాఖ హట్స్




రాష్ట్ర అటవీశాఖ మూడు ప్యాకేజీలతో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్

## పసుపుపంట కోసం ప్రత్యేక స్పైసెస్ పార్క్

- మంత్రి కేటీఆర్ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు

**హైదరాబాద్, నమస్తే తెలంగా:** రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే ట్రేడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీం (టైస్) కింద పసుపు కోసం ప్రత్యేక స్పైసెస్ పార్క్ నెలకొల్పుతామని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు హామీ ఇచ్చారు. పసుపుబోర్డు ఏర్పాటుకు దీనిని ప్రత్యామ్నాయంగా ఆయన సూచించారు. స్పైసెస్ బోర్డులో తెలంగాణ కోసం ప్రత్యేకసెల్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని కొద్దికాలం క్రితం రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు రాసిన లేఖకు సురేశ్‌ప్రభు శుక్రవారం జవాబు రాశారు. పసుపుపంటకు స్పెసెస్ బోర్డు కార్యాలయంలో తెలంగాణ కోసం ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మార్కెటింగ్ రిసెర్చ్ ద్వారా పసుపుపంటను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర వ్యవసాయశాఖలపై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్పైసెస్ బోర్డు పసుపుతోపాటు ఇతర స్పైసెస్ ఎగుమతులు, నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ నిర్వహిస్తున్నదని అన్నారు.



# విభజన హామీలపై నిలదీస్తాం



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కవిత

- రాష్ట్రానికి రావాల్సిన నిధులపై గళమెత్తుతాం
- ప్రధానిని కించపరిచే ఉద్దేశం సీఎం కేసీఆర్‌కు లేదు
- అనుకోని పొరపాటుపై బీజేపీ రాద్ధాంతం తగదు
- రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసే విధానాలేవీ?
- మీడియాతో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత
- నేడు టీఆర్‌ఎస్ పీపీ సమావేశం.. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలుచేయాలని పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. ప్రధానమంత్రిని కించపరిచే ఉద్దేశం సీఎం కేసీఆర్‌కు లేదని, కరీంనగర్‌లో గంటన్నరకుపైగా సాగిన ముఖ్యమంత్రి ప్రసంగంలో అనుకోకుండా పొరపాటు జరిగిందే తప్ప, కావాలని అనలేదని ఆమె స్పష్టంచేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం నుంచి పార్లమెంట్‌లో ప్రారంభమయ్యే బడ్జెట్ రెండోవిడుత సమావేశాల్లో ప్రతిశాఖకు సంబంధించిన కేటాయింపులపై చర్చిస్తామని, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై గళమెత్తుతామని పేర్కొన్నారు. ఇప్పటికే విభజన హామీలపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, తమ వాదన వినిపించామని గుర్తుచేశారు. తెలంగాణకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందేమీ లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని ప్రధాని చెప్తున్నారుకానీ, ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని విమర్శించారు. వ్యవసాయానికి ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టామని చెప్పుకున్నా... గత సంవత్సరం కంటే కేటాయింపులు ఏ మాత్రం పెరుగలేదన్నారు. కేంద్రం అమలుచేస్తున్న పంట బీమా పథకంతో రైతులకు మేలు జరుగడంలేదని, రైతు యూనిట్‌గా పంట బీమాను అమలుచేస్తే లబ్ధిచేకూరుతుందని చెప్పారు. గిరిజన, ఉద్యాన యూనివర్సిటీలకు ఒక్కొక్కదానికి రూ.10కోట్ల చొప్పున బడ్జెట్‌లో కేటాయించారని, ఉద్యాన యూనివర్సిటీకి రూ.వందకోట్లు కావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని గుర్తుచేశారు. విభజన చట్టంలోని హామీలను అమలుచేయాలని 2014 నుంచి తాము కోరుతున్నామని.. ఏపీ విషయంలోనూ అదే చెబుతున్నామని స్పష్టంచేశారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రధాన హామీలైన హైకోర్టు విభజనపై ఏపీ ప్రభుత్వం కూడా ఒప్పుకున్నందున ఆ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు.

**సంకుచిత ధోరణితో కాదు**

ప్రధానమంత్రిని అవమానించాలనే సంకుచిత ధోరణి సీఎం కేసీఆర్‌కు లేదని, ఎప్పుడూ ఉండదని ఎంపీ కవిత స్పష్టంచేశారు. దేశ ప్రధానిని అవమానపరిస్తే దేశాన్ని అవమానించినట్టుగానే భావిస్తామని, అలాంటిది ప్రధానిని ఏ విధంగా వ్యక్తిగతంగా విమర్శిస్తారని అనుకుంటున్నారని అన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకులు ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారని, అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య వేదికలో ఆరువందల కోట్ల ప్రజలు తనకు ఓటువేసినట్టు పేర్కొన్నారని, కానీ భారతదేశ జనాభానే 130 కోట్లు అనే విషయాన్ని తాము ఎక్కడా ప్రస్తావించలేదని, దాన్ని తాము తప్పు పట్టలేదన్నారు. ఇలాంటి చిన్న పొరపాట్లు జరుగుతూనే ఉంటాయని, అంత మాత్రాన రాద్ధాంతం చేయడం తగదని హితవుచెప్పారు. పేద ప్రజలకు, రైతాంగానికి బీజేపీ, కాంగ్రెస్ ఏమీచేయలేదని చెప్పడమే సీఎం కేసీఆర్ ఉద్దేశమని కవిత పేర్కొన్నారు. వారు ఏమీచేయలేదు కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికలను రూపొందించాల్సి వస్తున్నదన్న ఆవేదనతోనే సీఎం కొంత కటువుగా మాట్లాడారని తెలిపారు. బీజేపీ నాయకులు కోడిగుడ్డు మీద ఈకలు పీకకుండా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని ఆమె హితవు పలికారు.

# ప్రజల్లో ఉన్నదే కేటీఆర్ చెప్పారు

- కాంగ్రెస్‌కు వచ్చేఎన్నికల్లో ఒక్కసీటు రాదు
- సొంతపార్టీ నేతలే జానారెడ్డిని గౌరవిస్తలేరు
- సీఎం కేసీఆర్‌కంటే మిమ్మలను ఎక్కువగా గౌరవించింది ఎవరు?
- సీఎం ఫ్లోలో అన్న మాటలకు దురుద్దేశాలు అంటగట్టడం సరికాదు
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం



శుక్రవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు పూల రవీందర్, వీ గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ నేతలపై ప్రజల మనసులో ఉన్నదే మంత్రి కేటీఆర్ చెప్పారని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలేవీ చేయలేదని, అసెంబ్లీలో కూడా వాడగలిగే భాషనే మాట్లాడారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు సంస్కారం, సంకుచిత స్వభావం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదన్నారు. జానారెడ్డి ముందుగా కాంగ్రెస్ నాయకులకు సంస్కారం నేర్పుకోవాలని హితవుపలికారు. శుక్రవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, పూల రవీందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తమకుతాము చెప్పుకొన్నంత మాత్రాన ఎవరూ పెద్దవాళ్లు కాలేరని, ప్రజలు గుర్తిస్తేనే పెద్దవారవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన పాత నాయకులు, కొత్త నాయకులు ఇష్టారీతిన, వ్యక్తిగతంగా విమర్శలు, ఆరోపణలు చేస్తుంటే కనిపించడంలేదా? వినిపించడంలేదా? అని జానారెడ్డిని ఉద్దేశించి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. 'మోరీలు నిండుతాయి? బట్టలూడదీసి కొడుతాం' అం టూ మాట్లాడినప్పుడు సంస్కారం ఏమైందని నిలదీశారు. 'మిమ్మల్ని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ కంటే ఎక్కువగా గౌరవించింది ఎవరు?' అని జానారెడ్డిని ప్రశ్నించారు. మీ పార్టీ నాయకులే మిమ్ముల్ని గుర్తించడంలేదన్నారు. ఇటీవల నల్లగొండలో నిర్వహించిన సభలో కుంతియా, జైపాల్‌రెడ్డి సమక్షంలో.. మీ పార్టీ నాయకులు వాడిన భాషేమిటి? అప్పుడు ఎందుకు ఖండించలేదని మంత్రి జగదీశ్ నిలదీశారు.

**2019లో ఒక్కసీటు కూడా రాదు**

'2014 ఎన్నికల్లో అక్కడక్కడ మీరు గెలిచిన సీట్లలో కూడా 2019లో మిమ్ములను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మీకు ఒక్కసీటు కూడా రాదు. తమిళనాడు, యూపీ మాదిరిగానే కాంగ్రెస్ చరిత్ర తెలంగాణలోనూ ముగిసిపోయింది' అని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నిజంగా కాంగ్రెస్‌పై ప్రజలకు ప్రేమ ఉంటే 30 మంది ముఖ్యమంత్రి అభ్యర్థులతో సహా 40 మంది వెళ్లిన బస్సుయాత్రకు ఎక్కడా వంద మందైనా ఎందుకు స్వాగతం పలుకడంలేదన్నారు.

**మీపై దోచుకున్న కేసులు.. మాపై ఉద్యమ కేసులు**

'జానారెడ్డి మాపై ఏవో కేసులున్నాయంటున్నారు. ప్రజల కోసం కొట్లాడినందుకు మాపై ఉద్యమ కేసులున్నాయి. ప్రజల సొమ్మును దోచుకొన్నందుకు కాంగ్రెస్ నాయకులపై కేసులున్నాయి' అని జగదీశ్‌రెడ్డి కౌంటరిచ్చారు. సీఎం కేసీఆర్ ప్రధాని మోదీ పట్ల తప్పుగా మాట్లాడలేదని, ఉపన్యాసం ఫ్లోలో చిన్న తప్పిదం జరిగితే దానికి దురుద్దేశాలు అంటగట్టడం సరికాదని హితవుపలికారు. చిన్నవాళ్లనయినా, పెద్దవాళ్లనయినా సీఎం కేసీఆర్ ఎంతగా గౌరవిస్తూ మాట్లాడుతారో అందరికీ తెలుసునని చెప్పారు.

## ఉనికి కోసమే కాంగ్రెస్ విమర్శలు

- కేటీఆర్‌పై జానారెడ్డి వ్యాఖ్యలు వాపస్ తీసుకోవాలి: బండి రమేశ్
- ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కేటీఆర్: లింగంపల్లి కిషన్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, ఆగ్రో చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు. చిత్రంలో బీ రంగారెడ్డి, సంపత్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావుపై సీఎల్పీనేత జానారెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనుకకుతీసుకోవాలని టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నా యకులు ఉనికిని కాపాడుకోవడానికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో టాంకాం చైర్మన్ బీ రంగారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మరోసారి సీఎం కేసీఆర్‌పై, కేటీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలోనే తనకు ఎంతవరకు గౌరవం దక్కుతున్నదో జానారెడ్డి చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ బస్సుయాత్రలో టీఆర్‌ఎస్‌పై ఇష్టారీతిన విమర్శలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. కేటీఆర్‌ను విమర్శిస్తున్న జానారెడ్డికి రేవంత్‌రెడ్డి మాటలు వినిపించడంలేదా? అని టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫాదర్ ఆఫ్ తెలంగాణ కేసీఆర్ అయితే.. ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కేటీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి ఆదర్శమైన టీఎస్ఐపాస్‌ని, అంతర్జాతీయ ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకొవస్తున్న వ్యక్తి కేటీఆర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి, వీ హనుమంతరావు అలీబాబా 40 నాయకులేనన్న కేటీఆర్ వ్యాఖ్యలకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. సమావేశంలో మహిళా, శిశుసంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్ సుశీలాదేవి పాల్గొన్నారు.

## ఎంపీలు, ఎమ్మెల్యేల కోర్టుకు 30 పోస్టులు

- ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులకు సంబంధించిన క్రిమినల్ కేసుల వ్యవహారాలను చూసే ప్రత్యేక కోర్టులో పోస్టుల భర్తీకి రాష్ట్ర ఆర్థికశాఖ శుక్రవారం ఉత్తర్వులను జారీచేసింది. జిల్లా న్యాయమూర్తితో పాటు మొత్తం 30 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన క్రిమినల్ కేసుల కోసం రాష్ట్రంలో ఇటీవల సెషన్ జడ్జి క్యాడర్‌తో హైదరాబాద్‌లో ప్రత్యేకకోర్టు ఏర్పాటైంది. ఈ కోర్టుకు సంబంధించిన పోస్టులు, ఖాళీలు ఈ విధంగా ఉన్నాయి: జిల్లా న్యాయమూర్తి-1, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-1, సూపరింటెండెంట్ (హెడ్‌క్లర్క్)-(1), సూపరింటెండెంట్ (ట్రాన్స్‌లేటర్)-1, సీనియర్ అసిస్టెంట్ (యూడీబీసీ)-1, స్టెనోగ్రాఫర్ (గ్రేడ్-1)-1, జూనియర్ అసిస్టెంట్ (5), టైపిస్ట్(2), ఫీల్డ్ అసిస్టెంట్ (అమీన్స్)-3, ఎగ్జామినర్-1, కాపీయిస్ట్-1, ప్రాసెస్ సర్వర్-5, రికార్డు అసిస్టెంట్-1, ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)-5, ఫుల్‌టైమ్ మసాల్చీ-1. ఈ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలను తీసుకోవాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి శివశంకర్ సూచించారు.

## పాస్‌పుస్తకాల ముద్రణ టెండర్ గడువు 5 వరకు పొడిగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భూయాజమాన్య హక్కులతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణ టెండర్ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఐదు వరకు పొడిగించింది. వరుసగా గురు, శుక్రవారాలు సెలవులు కావడంతో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించడానికి ఇబ్బంది అవుతుందని.. ఈ మేరకు గడువును పెంచాలని బిడ్డింగ్‌లో పాల్గొనాలనుకుంటున్న ప్రింటర్లు.. రెవెన్యూశాఖ, సీసీఎల్‌ఏ, టీఎస్‌టీఎస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో కుదుర్చుకున్న ఎంఓయూ రద్దు చేసుకున్న తరువాత ప్రభుత్వం పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణకు టీఎస్‌టీఎస్ ద్వారా షార్ట్‌టెండర్ పిలిచింది. షార్ట్‌టెండర్ నోటీస్‌లో మార్చి 2 (శుక్రవారం) మధ్యాహ్నం 1 గంటలోపు ప్రింటర్లు బిడ్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలని తెలిపింది. అయితే హోలీ పండుగకు ఈ నెల 1న రాష్ట్ర ప్రభుత్వం.. 2న కేంద్ర ప్రభుత్వం సెలవుగా ప్రకటించగా రాష్ట్ర ప్రభుత్వం 2న ఐచ్ఛిక సెలవు ఇచ్చింది. దీంతో ప్రింటర్లు బ్యాంకు గ్యారెంటీలతో సహాటెండర్ దాఖలుకు కావాల్సిన అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని సబ్మిట్ చేయడానికి వీలుపడని పరిస్థితి ఏర్పడింది.

# నేడు ఢిల్లీకి గవర్నర్ నరసింహన్

**రెండురోజుల పర్యటన.. రాష్ట్రపతి, ప్రధాని తదితరులతో భేటీలు!**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ శనివారం ఉదయం ఢిల్లీకి బయలుదేరివెళ్తారు. దేశ రాజధానిలో ఆయన రెండురోజులపాటు ఉంటారని అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తోపాటు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని ఆయన కలుస్తారని సమాచారం. ఆదివారం ప్రధానిని కలిసి రెండురాష్ట్రాల పరిస్థితులను వివరించే అవకాశముందని తెలిసింది. హైకోర్టు, హెచ్చార్సీ, లోకాయుక్త, ఏపీ ట్రిబ్యునల్ వంటి ఉమ్మడి సంస్థల విభజన అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాపై సాగుతున్న రగడ ఈ భేటీల్లో చర్చకు రావచ్చని అంటున్నారు. ఏపీ పునర్విభజన చట్టంలోని తొమ్మిది, పది షెడ్యూల్ సంస్థల విభజనపై పురోగతిని గవర్నర్ కేంద్రానికి వివరించనున్నారు. దీనిపై ఈ నెల 5న ఢిల్లీలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రప్రభుత్వాల చీఫ్ సెక్రటరీల సమావేశం జరుగనున్నది. గవర్నర్ సోమవారం ఉదయం విజయవాడకు బయలుదేరి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.



తన ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరుకావాలని గవర్నర్ నరసింహన్‌ను ఆహ్వానిస్తున్న హోంమంత్రి నాయిని

**గవర్నర్‌ను కలిసిన డిప్యూటీ సీఎం, హోంమంత్రి**

పలువురు ప్రముఖులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను కలిశారు. తన జన్మదినం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ గవర్నర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనకు గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి గవర్నర్‌ను కలిసి తన ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరు కావాలని ఆహ్వానించినట్టు తెలిసింది. ఢిల్లీలో తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ కూడా శుక్రవారం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ కూడా శుక్రవారం గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**సెకండియర్ పరీక్షలకు 4,21,333 మంది విద్యార్థులు హాజరు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ సెకండియర్ (ద్వితీయ భాష) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 4,39,422 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 4,21,333 మంది హాజరయ్యారు. 4.11 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలో 20 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కేసులో పట్టుబడ్డారు. ఈ పరీక్షల కోసం ప్రశ్నాపత్రం ఏ బుక్‌లెట్‌ను ఎంపికచేశారు.



హైదరాబాద్ ఈసీఐఎల్‌లో ఓ కేంద్రానికి శుక్రవారం ఇంటర్ సెకండియర్ ద్వితీయ భాష పరీక్షకు హాజరైన విద్యార్థులు

# టీఆర్టీకి 94.6 శాతం హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉపాధ్యాయుల కొలువుల భర్తీలో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)ను విజయవంతంగా నిర్వహించినట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన ఎస్జీటీ (బెంగాలి, హిందీ, కన్నడ, మరాఠి, ఉర్దూ, తమిళ మీడియం) పరీక్షకు 94.6 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం సెషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పరీక్షలో 60.4 శాతం హాజరు నమోదైందని చెప్పారు. శనివారం ఉదయం సెషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్, బయో సైన్సెస్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు (హిందీ, కన్నడ, మరాఠి, ఉర్దూ, తమిళ మాధ్యమాలు), మధ్యాహ్నం సెషన్‌లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సెస్ (ఆంగ్ల మాధ్యమం) పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు అభ్యర్థులు సన్నద్ధమై ఉండాలని సూచించారు.

**అభ్యర్థి దరఖాస్తు ప్రకారమే హాల్‌టికెట్ కేటాయింపు**


ఉపాధ్యాయ కొలువుల భర్తీలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థికి స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) హాల్‌టికెట్ ఇచ్చారని పలు మీడియా సంస్థల్లో జరిగిన ప్రచారంలో వాస్తవంలేదని టీఎస్‌పీఎస్సీ హెల్ప్‌డెస్క్ స్పష్టంచేసింది. చిలుముల శంకరయ్య అనే అభ్యర్థి ముందుగా సోషల్ స్టడీస్‌కే దరఖాస్తు చేసుకున్నారని, అయితే ఎడిట్ ఆప్షన్‌లో మాత్రం తెలుగుకు మార్చుకున్నారని తెలిపింది. అభ్యర్థి చేసుకున్న సవరణ ప్రకారమే హాల్‌టికెట్ వచ్చిందని పేర్కొన్నది. చాలామంది అభ్యర్థులు తమ ఓటీఆర్ వివరాలు సరిదిద్దుకోవడం, వివరాలు తప్పుగా ఇవ్వడంతో ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్నది.



## మంత్రి ఈటలతో కేంద్ర అధికారి భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పౌరసరఫరాలశాఖలో అమలుచేస్తున్న సంస్కరణల పరిశీలనకు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీశాఖ అధికారి రవికాంత్ నగరానికి చేరుకున్నారు. ఆయన శుక్రవారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన సంస్కరణలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కేంద్ర అధికారి రవికాంత్ శనివారం సివిల్ సప్లైస్ భవన్, చౌకధరల దుకాణాలను పరిశీలించనున్నారు.





ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై చర్యలకు, వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది. ఇది పాత చట్టం కన్నా పదునైనది. దీంతో అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులనే కాకుండా వారి పేరుమీద దేశంలో, ఇతర దేశాల్లో ఉన్న ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే వీలున్నది.

**అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక మంత్రి**

యువత పెడమార్గం పట్టకుండా ఉండేందుకు క్రికెట్ పోటీల లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలి. సోషల్ మీడియా ద్వారా చెడుమార్గం పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ఏడాదిలాగే ఓ యువకుడు తల్లిదండ్రుల కోరికను మన్నించి హింసామార్గాన్ని వీడటం ఆహ్వానించదగినది.

**మెహబూబా ముఫ్తీ, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**




**1575**

తుకరాయ్ యుద్ధంలో బెంగాల్ సేనలను ఓడించిన మొగల్ చక్రవర్తి అక్బర్.

**1923**

అమెరికా 'టైమ్'పత్రిక ప్రచురణ ప్రారంభం.



**1939**

బ్రిటిష్ నియంతృత్వ పాలనకు నిరసనగా బొంబాయిలో నిరహారదీక్షకు దిగిన మహాత్మా గాంధీ.

ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ దేశంలో శాంతిస్థాపన కోసం తాలిబన్లతో చర్చల ప్రక్రియకు పూనుకోవటం ఆహ్వానించదగినది. నిజానికి ఇది మొదటిసారి కాదు. 2015లో పాకిస్థాన్ కేంద్రంగా తాలిబన్లతో శాంతి చర్చలు జరిగినా తాలిబన్ నేత ముల్లా ఒమర్ చనిపోవటంతో చర్చల ప్రక్రియ నిలిచిపోయింది. ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు ముందుకు రావాలని అధ్యక్షుడు అష్రఫ్ తాలిబన్లను కోరారు. ఇప్పుడు శాంతి చర్చల్లో భారత్‌తో సహా 20 దేశాలు ప్రాతినిధ్యం వహిస్తుండటం సరికొత్త పరిణామం. ఇరుపక్షాలూ పంతానికి పోకుండా శాంతిస్థాపనకు కృషి చేయాల్సిన అవసరమున్నది.

**ది హిందూ**

రంగుల పండుగ హోలీని దేశవ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తమదైన జీవన సంప్రదాయాలు, అభిరుచుల వ్యక్తీకరణ హోలీ. అయితే ఈ సందర్భంగా అసాంఘిక శక్తులు రంగుల పండుగను వికృతం చేసిన చేదు అనుభవాలున్నాయి. ముఖ్యంగా మహిళల పట్ల అమానవీయంగా ప్రవర్తించిన సందర్భాలున్నాయి. ఈ అనుభవాల దృష్ట్యా ప్రజలు జాగరూకతతో హోలీని ఆనందంగా జరుపుకోవాలి. పరస్పర గౌరవ మర్యాదలతో నడుచుకొని రంగుల పండుగకు కొత్త అందాలు అద్దాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ఆయుధ పోటీ

నాటో రక్షణ వ్యవస్థలకు దొరుకకుండా లక్ష్యాన్ని ఛేదించే కొత్తరకం క్షిపణులను తయారు చేసుకున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించడంతో పెద్ద రాజ్యాల మధ్య మళ్ళా ఆయుధ పోటీ తీవ్రమవుతుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా విధానం వల్ల మళ్ళా ప్రచ్ఛన్నయుద్ధం తలెత్తే ప్రమాదం ఉందని అమెరికా శిబిరంలోని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ పుతిన్ మాత్రం అమెరికా విధానమే తాము కొత్త ఆయుధాలు రూపొందించుకోవడానికి ప్రేరేపించిందని ఆరోపించారు. పుతిన్ వెల్లడించిన వివరాల ప్రకారం– రష్యా రూపొందించుకున్న కొత్త క్షిపణి అణుశక్తితో తక్కువ ఎత్తులో ప్రయాణిస్తుంది. అమెరికా రక్షణ వ్యవస్థకు దొరుకకుండా సాగడమే కాకుండా, ఎంత దూరమైనా ప్రయాణించగలదు. ఆకాశం నుంచి ఉల్క మాదిరిగా దూసుకువచ్చే మరో క్షిపణి ధ్వని కన్నా అనేక రెట్లు వేగంగా ప్రయాణించగలదనీ, అజేయమైనదని పుతిన్ వివరించారు. రష్యా పార్లమెంటులో ఈ వివరాలను వెల్లడించిన పుతిన్, ఈ సందర్భంగా వీడియో ద్వారా క్షిపణులను ప్రదర్శించారు. రష్యా అధ్యక్ష ఎన్నిక ఈ నెల పద్దెనిమిదవ తేదీన జరుగనుంది. ఈ ఎన్నిక నేపథ్యంలో ప్రజాభిమానం పోగు చేసుకోవడానికి పుతిన్ ఈ క్షిపణుల కథనాన్ని వినిపించారని అమెరికా శిబిరం అంటూనే, రష్యా విధానం ఆయుధ పోటీని పెంచేదిగా ఉందని కూడా తప్పుపడుతున్నది. పుతిన్ రష్యాలో బలమైన నాయకుడిగా అవతరించారు. రాబోయే ఎన్నికలలో ఆయన గెలుపు దాదాపు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో నిరాధారమైన కథనాలు వినిపించవలసిన అవసరం పుతిన్‌కు లేదు. పైగా అగ్రరాజ్యమైన అమెరికాను రెచ్చగొట్టే, కీలకమైన ప్రకటనలను అంత అలవోకగా చేస్తారని ఊహించలేము. పుతిన్ చెబుతున్న కొత్తరకం క్షిపణులు ఇంకా అమ్ముల పొదిలో చేరనప్పటికీ, చివరి దశ తయారీలోనైనా ఉండి ఉంటాయని భావించవచ్చు.


**అమెరికా పోటీగా చైనా ఆయుధ వ్యవస్థను పెంచుకుంటుంది. ఈ పరిణామం అనివార్యంగా భారత్‌పై పడుతుంది. ఇక ఈ పోటీకి అంతం ఎప్పుడూ ఉండదు. ఆయుధాల ద్వారా భద్రత చేకూరుతుందనే తప్పుడు ఆలోచనాధోరణి నుంచి బయటపడినప్పుడే ప్రపంచానికి ఈ ముప్పు తప్పుతుంది.**

ఇప్పటికే భూగోళాన్ని అనేకసార్లు సర్వనాశనం చేయగలిగే ఆయుధాలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రష్యా మళ్ళా కొత్తరకం క్షిపణులను తయారుచేయడం సమర్థనీయం కాదు. కానీ ఈ ఆయుధ పోటీ పెరుగడంలో అమెరికా బాధ్యత కూడా ఉన్నది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో, ఆ తరువాత ఆయుధ వ్యవస్థ తగ్గింపు ఒప్పందాలు కుదిరాయి. ఈ నిరాయుధీకరణ పరిణామాన్ని మరింత ముందుకు తీసుకుపోతే బాగుండేది. క్షిపణి ప్రయోగ వ్యవస్థల తగ్గింపు కోసం 1970 దశకంలోనే వ్యూహాత్మక ఆయుధాల పరిమితి చర్చలు (సాల్ట్) సాగి రెండు ఒప్పందాలు కుదిరాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇదొక పెద్ద ముందడుగుగా చెప్పుకోవచ్చు. 1986లో రెక్జావిక్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, సోవియెట్ యూనియన్ అధినేత గోర్బచేవ్ సమావేశమైన నేపథ్యంలో దీర్ఘశ్రేణి వ్యూహాత్మక ఆయుధాలు తగ్గించుకోవడం సాధ్యమయ్యేదే. కానీ అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థపై పరిశోధనలు మొదలుపెట్టడం వివాదాస్పదమైంది. ఆ తర్వాత 1990 దశకం ఆరంభంలో వ్యూహాత్మక ఆయుధ తగ్గింపు ఒప్పందాలు (స్టార్ట్1, స్టార్ట్ 2) కుదిరాయి. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమైనా, అణ్వాయుధాలు గల రష్యా, మూడు రిపబ్లిక్‌లు నిరాయుధీకరణ స్ఫూర్తిని కొనసాగించాయి. ప్రచ్ఛన్నయుద్ధం కూడా ముగిసినందువల్ల ఆయుధ పోటీ సమసిపోతుందనే అభిప్రాయం నెలకొన్నది. కానీ మళ్ళా ఆయుధ పోటీ కొత్త రూపం సంతరించుకొని ముందుకురావడం ఆందోళనకరం. రష్యా తాజాగా కొత్త క్షిపణులను తయారుచే యడం గతంలో కుదిరిన నిరాయుధీకరణ ఒప్పందాలను ఉల్లంఘించడమేనని అమెరికా విమర్శిస్తున్నది. కానీ అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థను నిర్మించుకోవడం వల్లనే తాము దానికి అతీతమైన క్షిపణి వ్యవస్థను వృద్ధి చేసుకోవలసి వచ్చిందని పుతిన్ విమర్శించడం గమనార్హం.

ఆయుధాలు భద్రత కల్పించినట్టు కనిపిస్తుంది కానీ, ఈ ఆయుధ పోటీ పెరిగే కొద్దీ ప్రమాదం పెరుగుతుంది. అమెరికా, రష్యా, చైనా మొదలైన పెద్ద దేశాలు ఈ భారీ ఆయుధ సంపత్తి తమకు భద్రత కల్పించలేదని గ్రహించాలె. ఎప్పుడూ ఒక దేశాన్ని మించి మరో దేశం ఆయుధాలను తయారుచేస్తూనే ఉంటుంది. ఈ పోటీ ఒక దగ్గర ఆగదు. ఆకాశంలో గూఢచార ఉపగ్రహాలు తిరుగుతున్నాయి. సముద్రంలో జలాంతర్గాములు తిరుగుతున్నాయి. ఖండాంతర క్షిపణులు తయారయ్యాయి. వీటికి రక్షణ వ్యవస్థలు ఏర్పడ్డాయి. తాజాగా రక్షణ వ్యవస్థలకు అతీతమైన క్షిపణులు తయారయ్యాయి. రెండు శిబిరాలు ఆయుధ పోటీకి దిగినట్టే, ప్రతి ప్రాంతంలో వైరి దేశాల మధ్య ఆయుధ పోటీ ఉంటుంది. అమెరికా పోటీగా చైనా ఆయుధ వ్యవస్థను పెంచుకుంటుంది. ఈ పరిణామం అనివార్యంగా భారత్‌పై పడుతుంది. ఇక ఈ పోటీకి అంతం ఎప్పుడూ ఉండదు. ఆయుధాల ద్వారా భద్రత చేకూరుతుందనే తప్పుడు ఆలోచనాధోరణి నుంచి బయటపడినప్పుడే ప్రపంచానికి ఈ ముప్పు తప్పుతుంది. ఈ పోటీని నివారించడం అగ్రదేశాల నుంచే ప్రారంభం కావాలె.

**సందర్భం**

## ఆదర్శప్రాయుడు జమలాపురం



తెలంగాణ గడ్డ మీద 1948 ఆగస్టు 1న స్టేట్ కాంగ్రెస్ ప్రజలను యుద్ధోన్ముఖులను చేసిన ధీరోదాత్తుడు జమలాపురం కేశవరావు. ఆంధ్రప్రాంత కాంగ్రెస్ అధ్యక్షుడిగా మధిరలో ఈ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించారు. పోలీస్ చర్య తర్వాత ఖమ్మం జిల్లా డోర్నకల్ అటవీప్రాంత గిరిజనులు మిలిటరీ అధికారులపై కూడా తిరుగుబాటు చేయటంతో సర్దార్ పటేల్ కోరికపై ఆ ప్రాంతంలో పర్యటించి ఆదివాసులను శాంతింపజేశారు. ఆ విధంగా సమరంలోనూ, శాంతిలోనూ కేశవరావు అద్భుత నాయకత్వ పటిమ లోకానికి చాటింది. ప్రజల హక్కుల కోసం ధీరోదాత్త పోరాటం, నిరాడంబర జీవితం నాడు జమలాపురం కేశవరావు ఎందరికో ఆదర్శం. అందుకే.. 'మచ్చలేని మనసు జబ్బులేని వాళ్లు డబ్బులేని జేబు నీవన్న– సర్దారు నామంబు సహజనామంబుగా సరిపోయినది నీకు కేశన్నా' అని కేశవ రావుగారిని కాళోజీ కీర్తించారు.

నిజాం ప్రభుత్వ హయాంలో స్వాతంత్ర్యం కోసం ఆలోచించటమే పెద్ద నేరంగా పరిగణించబడుతున్నప్పుడు కేశవరావు సత్యాగ్రహ ఉద్యమానికి పూనుకున్నారు. దీంతో ఆయన ధైర్య సాహసాలకు ప్రజలు ఆయనకు సర్దార్ అని సంబోధిస్తూ పిలుచుకున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం గ్రామంలో 1908 మార్చి 3న కేశవరావు జన్మించిన ఆయన, 1953 మార్చి 29వ తేదీన తన 46వ ఏట అస్వస్థతతో తుదిశ్వాస విడిచారు. పోరాటానికీ, త్యాగానికీ మారుపేరైన జమలాపురం కేశవరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడు. అతని ఆశయాలకోసం పోరాడటం నేడు అందరి కర్తవ్యం.

**- కొలనుపాక కుమారస్వామి**

**సవరణ:** మార్చి 1వ తేదీ సంచికలోని 4వ పేజీలో **'రైతు చరిత్రను తిరగరాస్తారా?'** వ్యాసం ఉపోద్ఘాతంలో 'మనసులో'కి బదులు 'ముసుగులో' అని పొరపాటున అచ్చయింది. పాఠకులు గమనించగలరు.

**- ఎడిటర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@namasthetelangaana.com Fax-040-23291118

**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# జన్ మన్ కి బాత్

ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్నిటికంటే ముఖ్యం 'జన్ మన్ కి బాత్'. భారత సమాజం స్వాతంత్ర్యోద్యమ రోజుల్లోనే, ప్రజాస్వామ్య వ్యవస్థను, ప్రజాస్వామ్య విధానాలను వరించింది. కనుక అనేక ఇతర దేశాల వలె, విశేషించి కొన్ని పొరుగు దేశాలలో వలె ఈ నేలపై నియంతృత్వం వికటాట్టహాసం వినిపించడం లేదు. గత నాలుగేండ్ల నుంచి పడగ విప్పి బుసలు కొడుతున్న అసహనాన్ని, విపరీత విద్వేషాన్ని గమనించినట్లయితే సత్వర భవిష్యత్తులో ఏమవుతుందో, ఎటువంటి దారుణ పరిణామాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా సంభవిస్తాయో చెప్పలేమనిపిస్తుంది.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఇంకా బతికి ఉన్నందువల్లనే ఎవరైనా ఎంతటి ఉన్నత పదవిలోనైనా కూర్చొని ఏమైనా మాట్లాడగలుగుతున్నారు. "..Democracy is a great institu-tion and therefore it is liable to be greatly abused. The remedy, therefore, is not avoidance of democracy but reduction of possibility of abuse to a minimum.." అని గాంధీజీ ఎనభై ఏండ్ల కిదట యంగ్ ఇండియాలో రాసిన మాటలు నిజమని దేశంలో నాలుగేండ్ల నుంచి రుజువవుతున్నది. మొన్న ప్రధాని మోదీజీ వినిపించిన 'మన్ కి బాత్'లో మహిళ ప్రాధాన్యం పొందింది. 'బేటీ బచావ్ – బేటీ పడావ్' నినాదం ప్రతిధ్వనించింది. విచిత్రం ఏమంటే మోదీజీ సీఎంగా దాదాపు ఇరువై ఏండ్లు ఏలిన గుజరాత్‌లో స్త్రీ ప్రాధాన్యం ఘోరంగా తగ్గింది. మగ శిశువు జననాలతో పోల్చినప్పుడు గుజరాత్‌లో ఆడ శిశు జననాలు చాలా తగ్గాయి. మొన్న కేవలం ఓట్ల కోసం మోదీజీ పర్యటించిన కర్ణాటకలో ఐదు నెలల కిందట ఒక మహిళపై (ప్రముఖ పాత్రికేయురాలు) ఆమె ఇంటి దగ్గరే దుండగులు బుల్లెట్ల వర్షం కురిపించి హత్య చేశారు. మోదీజీ కనీసం మొన్నటి 'మన్ కి బాత్' ప్రసారంలోనైనా ఆ కన్నడ రచయిత్రి దారుణ హత్యను ఖండించినట్లయితే కొంత ఔచిత్యం ఉండేది. ఔచిత్యం అన్నది ఉన్నట్లయితే గత నాలుగేండ్లలో అనేక తప్పిదాలు, కొన్ని ఘోర తప్పిదాలు సంభవించకపోయేవి. అరువై ఏండ్ల తపఃఫలంగా– అయిదారు రోజుల్లో తెలంగాణ రాష్ట్రోదయం, ప్రథమ తెలంగాణ ప్రభుత్వ అవతరణ జరుగబోతుండగా అప్పుడే పుట్టి కండ్లు తెరచిన మోదీ ప్రభుత్వం తన మొట్టమొదటి పనిగా తెలంగాణ ఏడు మండలాలను పొరుగు రాష్ట్రానికి ఒక ఆర్డినెన్స్ ద్వారా దత్తపరుచకపోయేది, ఇప్పటివరకు ఉమ్మడి హైకోర్టు విభజన, ఉమ్మడి ఆస్తుల విభజన, నదీజలాల వివాదాల పరిష్కారం, ఉద్యోగుల కేటాయింపు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మూలన పడి ఉండకపోయేవి. బాలారిష్టాలను, పాలి పగలను, పలు అవరోధాలను, చీటికిమాటికి జారీ అవుతున్న స్టే ఆర్డర్లను, లోకల్ నేతల శాపనార్థాలను ముఖ్యమంత్రి కేసీఆర్ స్థైర్యంతో, చాకచక్యంతో ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని బహుముఖ ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. ఇన్ని ఒత్తిడుల మధ్య తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాల హృదయంతో కేంద్రంలోని పాలక కూటమికి రాజకీయ అవసరాలు ఏర్పడినప్పుడల్లా అందించిన అమూల్య సహాయాన్ని మరువరాదన్న ఔచిత్యం ఉన్నట్లయితే మోదీజీ ప్రభుత్వం మన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదాను, మన రాష్ట్రానికి ప్రత్యేక హోదాను, వాగ్దానాల ప్రకారం మనకు కొత్త పథకాలను ప్రకటించింది. దేశంలో ఎక్కడా ఎన్నడూలేని రీతిగా వ్యవసాయరంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించిన అపూర్వ అభ్యుదయ చర్యలకు ప్రత్యేక నిధులను భారీగా కేటాయించి ఉండేది. ఔచిత్యం అడుగంటిన, అసహనం హద్దుమీరిన, విద్వేషం విపరీత స్వరూపం ధరించిన, ప్రజాస్వామ్యం విలువలకు, ఫెడరల్ వ్యవస్థ సూత్రాలకు విచ్చలవిడిగా విఘాతం కలుగుతున్న, కసి–పగ రాజకీయాలతో సీబీఐ, ఎన్‌ఐఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ, న్యాయవ్యవస్థలను (నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు గత్యంతరం లేక, దిక్కులేక రోడ్డు ఎక్కిన దుస్థితిని పరికిస్తే న్యాయ వ్యవస్థ కూడా సాష్టాంగ పడక తప్పడం లేదని వెల్లడవుతుంది) పాలకులు స్వప్రయోజనాల కోసం దుర్వినియోగ పరుస్తున్న దుస్థితిని గమనిస్తే, అరవింద్ కేజ్రీవాల్, మెహబూబా ముఫ్తీ, నితీశ్‌కుమార్, పళనిస్వామి, పన్నీర్ సెల్వం, అకాలీదళ్, శివసేన దయనీయ స్థితిని అవలోకిస్తే, కేసీఆర్ వంటి మహానాయకుడు, రాజనీతి వైదుష్య సంపన్నుడు, పరిపాలనాదక్షుడు మొదటి ముఖ్యమంత్రి, రాష్ట్ర అధినేత కావడం తెలంగాణ రాష్ట్రం అదృష్టం, మహా జాతకం అనిపిస్తుంది. కేసీఆర్ సమర్థ నాయకత్వం ఫలితంగా ఒక ప్రమాదం తప్పింది. తెలంగాణ రాష్ట్రం సత్వర అభివృద్ధికి నోచుకోక మోదీ చుట్టూ పొర్లు దండాలతో మొక్కులు చెల్లించవలసిన శోచనీయస్థితి నివారించబడింది.

ఔచిత్యం గురించే చెబితే ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వారం రోజులు ఇండియా పర్యటనలో జరిగిన అమర్యాదను చెప్పక తప్పదు. ప్రస్తుత ఈ దేశ పాలకులు మహా డెమొక్రాట్లు అయినట్లు మాటిమాటికి డైనాస్టీలపై విషం కక్కుతుంటారు. 47 ఏండ్ల యువ నాయకుడు జస్టిన్ ట్రూడో బహుళ జాతుల (ఇంగ్లీష్, ఫ్రెంచ్, స్పానిష్, ఇండియన్ తదితర) కెనడాలో ఒక డైనాస్టీకి చెందినవాడు. ఆయన తండ్రి పియరీ ట్రూడో అనేక సంవత్సరాలు కెనడా ప్రధాని, లిబరల్ పార్టీ అధ్యక్షుడు. ప్రాబల్యం తగ్గి పతన దశకు వచ్చిన లిబరల్ పార్టీకి 2013లో జస్టిన్ ట్రూడో యువ అధ్యక్షుడై 2015 ఫెడరల్ ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో ఘన విజయం సాధించారు. 2015 నవంబర్ నుంచి జస్టిన్ ట్రూడో కెనడా ప్రధాని. ఆయన కేవలం 31 శాతం ఓట్లతో గద్దెనెక్కి ఫీంకరిస్తున్న ప్రధాని కాదు. జస్టిన్ ట్రూడోకు సౌమ్యుడు, సంస్కారవంతుడు, ఉదారశీలి అన్న పేరు వచ్చింది. మూడు లక్షల జనాభా, మూడు వందల చ.కి. వైశాల్యం గల చాలా చిన్న దేశం మాల్దీవుల రిపబ్లిక్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి మోదీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. మాల్దీవుల వలె కెనడా చిన్నదేశం కాదు. ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన ఏడు దేశాల్లో (జీ-7) కెనడా ఒకటి. వైశాల్యం దృష్ట్యా ప్రపంచంలో తొలిస్థానం రష్యాది, రెండో స్థానం కెనడాది. అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ దేశాల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశం కెనడా. ఈ దేశంలో భారతీయుల జనాభా 13 లక్షలు. ఇందులో 40 శాతం మంది సిక్కులే. అయినప్పటికీ సిక్కు టెర్రరిజంను సహించబోమని జస్టిన్ ట్రూడో భారత పర్యటనలో సాహసవంతంగా స్పష్టం చేశారు. పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్‌కు, కమ్యూనిస్టు చైనా అధిపతికి, జపాన్ ప్రధానికి, ఇజ్రాయెల్ ప్రధానికి, సౌదీ అరేబియా రాజుకు, నిన్నగాక మొన్న జోర్డాన్ రాజుకు ఢిల్లీలో, అహ్మదాబాద్‌లో, సబర్మతీలో మోదీజీ స్వయంగా వెళ్లి స్వాగతం పలికి అందించిన పరిష్వంగ సుఖం, ఆలింగన మాధుర్యం, పరిమళాలు కెనడా యువనేత జస్టిన్ ట్రూడోకు అందలేదు. కెనడా ప్రధాని తన సతీమణితో, ముగ్గు రు చిన్నపిల్లలతో కలిసి ఢిల్లీలో అడుగు పెడుతున్నప్పుడు 'స్వకార్యం స్వామికార్యం' కోసం మోదీజీ కర్ణాటకలో ఓట్ల వేటలో, రాజకీయ కొట్లాటలో మునిగి తేలుతున్నారు! మోదీజీ, యూపీ, గుజరాత్ బీజేపీ సీఎంలు ఔచిత్యం పాటించి మర్యాదలు చేయకపోయినా జస్టిన్ ట్రూడో, ఆయన సతీమణి, ముగ్గురు పిల్లలు భారతీయ దుస్తుల్లో, అచ్చమైన ఒక సామాన్య భారతీయ కుటుంబ సభ్యుల వలె సబర్మతిలో ఊయల ఊపుడు లేకుండానే రాట్నం నడిపారు. ఆ కుటుంబం నడవడిలో ఎంతమాత్రం కాపట్యం, భేషజం లేని సహజత్వం ప్రదర్శితమైంది. అన్నిటికంటే ముఖ్యం ఈ రోజు అమెరికాలో ట్రంప్ పిచ్చిపిచ్చి చర్యలతో భవిష్యత్తు అంధకార బంధురంగా కనిపిస్తున్న లక్షలాది భారత యువతీయువకులు, విద్యార్థులు, సరైన వీసాలు, ఉద్యోగాలు లేనివారు, పక్కనే ఉన్న కెనడా వెళ్లాలనుకుంటున్నారు. వాళ్లకు కెనడాయే శరణాలయంగా, కరుణాలయంగా కనిపిస్తున్నది. ట్రంప్ జంపింగ్ ధోరణి కారణంగా వీసాలు, ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల్లేక అనిశ్చిత పరిస్థితి ఎదుర్కొంటున్న భారతీయ యువతీ యువకుల విషయంలో మోదీ ప్రభుత్వం ఏడాదైనా మౌనం వీడటం లేదు. ట్రంప్ అమెరికాకు ఈ దేశం ఒక ఉపగ్రహం అయిందనిపిస్తున్నది. డెబ్బై ఏండ్ల కిందట భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన వెంటనే అణుశక్తి పరిశోధన తదితర రంగాల్లో భారతదేశానికి సహాయపడిన కొద్ది దేశాల్లో కెనడా ఒకటి. జస్టిన్ కుటుంబం పర్యటన సమయంలోనే తమ కుటుంబ వర్తక వ్యాపారాల కోసం ఈ దేశం వచ్చిన జూనియర్ ట్రంప్‌కు మోదీ ప్రభుత్వం అధికారికంగా అన్ని మర్యాదలు జరిపింది. ఇండో–పసిఫిక్ విధానం మీద జూనియర్ ట్రంప్ ఈ దేశం పాలకులకు ఒక లెక్చరిచ్చి వెళ్లాడు. డెబ్బై ఏండ్ల నుంచి భారత సరిహద్దుల్లో మన సైనికుల, మామూలు ప్రజల తలలు నరుకుతున్న వారికి, 1962లో మన దేశంపై దురాక్రమణ జరిపి, ఇప్పటికీ దురాక్రమణలు జరుపుతున్నవారికి, 2002లో గుజరాత్ మత కల్లోలంలో దారుణ హత్యాకాండ జరిగిందని వీసాలు నిరాకరించిన వారికి రాచ మర్యాదలు జరుపుతున్నప్పుడు కెనడా ప్రధాని మన మర్యాదలకు, కౌగిలింతలకు అర్హుడు కాడా? ఏమైనా, యోగీ ఆదిత్యనాథ్‌జీకి ఇష్టంలేకపోయినా జస్టిన్ ట్రూడో కుటుంబం ఆగ్రాలో తాజ్‌మహల్‌ను చూడకుండా వెళ్లలేదు.

> నాలుగేండ్ల నుంచి సత్యహరిశ్చంద్రుల పాలనలో జరిగిన ఈ కుంభకోణాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. వేలకోట్ల రూపాయల బ్యాంకుల డబ్బు, ప్రజాధనం మింగి గజదొంగలు దేశం విడిచి విదేశాలకు వెళ్లుతున్నారు. ఇది క్విట్ ఇండియా ఉద్యమం అని సుప్రీంకోర్టులో ఒక న్యాయమూర్తి జోక్ విసిరారు.

మోదీజీ మన్ కి బాత్‌లో వినిపించని ఒక ముచ్చట జన్ మన్ కి బాత్‌లో వినిపించింది. ఇది మోదీ డైనాస్టీ తామర తంపరగా విస్తరిస్తున్న ముచ్చట. గుడిని, గుడిలోని లింగాన్ని మింగినట్లు నీరవ్ మోదీ, ఆయన మామ చోక్సీ, వారి, అంబానీ వారి దగ్గరి బంధువు విపున్ అంబానీ, జతిన్ మోదీ, వీరందరి వాడే విక్రమ్ కొఠారీ రూ.20 వేల కోట్ల పీఎన్‌బీ తదితర బ్యాంకుల భారీ మొత్తాలను స్వాహా చేసి లండన్‌లో ఏండ్ల నుంచి ఉంటున్న లలిత్‌మోడీ, విజయ్ మాల్యాలకు తోడయ్యారు. పాపాల భైరవులు, కాంగ్రెస్ పాలకులు హయాంలో భారీ కుంభకోణాలు ఆశ్చర్యం కలిగించలేదు. కానీ, నాలుగేండ్ల నుంచి సత్యహరిశ్చంద్రుల పాలనలో జరిగిన ఈ కుంభకోణాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. వేలకోట్ల రూపాయల బ్యాంకుల డబ్బు, ప్రజాధనం మింగి గజదొంగలు దేశం విడిచి విదేశాలకు వెళ్లుతున్నారు. ఇది క్విట్ ఇండియా ఉద్యమం అని సుప్రీంకోర్టులో ఒక న్యాయమూర్తి జోక్ విసిరారు.

# బలహీనులపై మూకదాడులు

**కేరళ**

**టీకే దేవాసియా**

కేరళలో జరిగిన మధు చిందాకి అనే ఆదివాసీ యువకుని హత్య దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. మధు ఆహారపదార్థాలను దొంగిలించాడన్న నెపంతో 16 మంది అతడిని కట్టేసి తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు అతడు చనిపోయాడు. ఈ ఘటనను దాడిచేసిన మూక వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టింది. దీంతో మధు ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఈ ఘటన గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కేరళ హైకోర్టు 'సుమోటో' కేసుగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. నిజానికి మధు చిందాకి కావాలని ఏదో దొంగతనం చేయలేదు. ఆకలికి తట్టుకోలేక ఆహారపదార్థాలను దొంగిలించాడు. అవి కూడా అప్పటి ఆకలిబాధ తీర్చుకునేందుకే. అంతదానికే ఆ యువకున్ని తీవ్రంగా హింసించి, ప్రాణాలు తీశారు. ఇలాంటి ఘటనలు ఈ మధ్య కేరళలో ఎక్కువయ్యాయి. రోజురోజుకూ కేరళ సమాజంలో ఇలాంటి మూక దాడులు పెరిగిపోతున్న తీరు పట్ల సామాజిక కార్యకర్తల్లో, మేధావుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది.

కేరళలో ఈ మధ్యకాలంలో ఒక నెల రోజుల్లో జరిగిన మూక హత్యల్లో మధు హత్య ఆరవది. ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే కొజికోడ్ జిల్లా కోడెన్‌చెర్రి ప్రాంతంలో ఓ నిండు గర్భిణీని ఆరుగురు వ్యక్తులు అతి దారుణంగా హింసించారు. హృదయవిదారకమైన ఈఘటనలో పాలకపక్షం మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలుండటం గమనార్హం. జనవరి 28 జరిగిన ఈ ఘటన పట్టపగలు వందలమంది సమక్షంలో జరిగింది. ఇదంతా ఎందుకు జరిగిందంటే ఓ భూమి తగాదాలో ఆ స్త్రీ భర్త అక్కడి మార్క్సిస్టు పార్టీ నేత చెప్పినట్లు వినలేదు. ఆ భూమి విషయమై స్థానిక అధికారపక్ష నేతలను ఎదిరించాడు. దీంతో స్థానిక మార్క్సిస్టు పార్టీ నేత ఆధ్వర్యంలో అతని కుటుంబంపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఆ దాడిలో ఆ స్త్రీ తీవ్రంగా గాయపడగా, వారి చిన్నారి బిడ్డ కన్నుమూసింది. ఈ ఘటన జరిగి వారం గడువకముందే కన్నూరు జిల్లాలో ఓ ఒడిషా కార్మికుడిపై దాడి జరిగింది. స్థానికంగా ఉన్న చిన్నపిల్లలను కిడ్నాప్ చేస్తున్న గ్యాంగులో సభ్యుడిగా ఉన్నాడన్న అనుమానంతో అతన్ని తీవ్రంగా కొట్టారు. ఇదంతా ఎందుకు చేశారంటే ఒడిషా కార్మికుడైన చౌట్టూ దగ్గర ఓ పాఠశాల పిల్లవాడి ఫొటో దొరికింది. నిజానికి ఆ ఫొటో పాఠశాల బస్సు డ్రైవరు దగ్గరి నుంచి ఎప్పుడో పడిపోయింది. అది రోడ్డుమీద పడి ఉండటంతో దాన్ని చౌట్టూ జేబులో వేసుకున్న పాపానికి అతన్ని చితకబాదారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు కూడా చౌట్టూ అమాయకుడని తేల్చారు. అలాగే జనవరి 30కన్నా ముందే ఎర్నాకులం జిల్లా వ్యాపీన్‌లో ఓ మతిస్థిమితం లేని మహిళపై అక్కడి జనం దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఆమె ఆ ప్రాంతంలో సంచరిస్తూ న్యూసెన్స్ చేస్తున్నదన్న ఆరోపణతో దాడి చేశారు. కర్రలతో కొట్టుకుంటూ రోడ్డు వెంట ఈడ్చుకెళ్లారు. కాల్చిన ఇనుప రాడ్‌తో ఆమె పాదాలపై కాల్చారు. పద్నాలుగేండ్ల ఆమె కూతురు దాడిని ఆపేందుకు ప్రయత్నిస్తే ఆమెపై కూడా దాడిచేశారు. ఆమె తీవ్ర గాయాలతో దవాఖాన పాలైంది. ఇలా జరుగుతున్న మూక దాడుల పట్ల సామాజిక కార్యకర్తలు, మేధావులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇదొక మానసిక జాడ్యంగా కేరళలో మారిందని వాపోతున్నారు.

కేరళలో జరుగుతున్న ఈ మూక దాడుల పట్ల మానసిక వైద్యులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. కేరళ సమాజంలోని రుగ్మతకు అద్దంపడుతున్నదని అంటున్నారు. మూకుమ్మడిగా ఒక నిస్సహాయునిపై దాడి చేస్తూ, అదే తన హీరోయిజానికి ప్రతీకగా చాటుకుంటున్న తీరుకు నిదర్శనమని కొచ్చికి చెందిన సీనియర్ మానసిక వైద్యుడు డాక్టర్ సీజే జాన్ అంటున్నారు. ఇలాంటి పోకడలు ఇటీవలి సినిమాల ప్రభావంతో కూడా ఎక్కువగా జరుగుతున్నాయని అంటున్నారు. ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతూ ఆ ఘటనను సోషల్ మీడియాలో ఎందుకు పెడుతున్నారన్న దానికి సమాధానంగా, వారి దౌర్జన్య, హింసాత్మక వికృత చేష్టలను హీరోయిజానికి నిదర్శనంగా చూసుకునే మానసిక వికృతత్వానికి నిదర్శనంగా భావించాలి. సాధారణంగా ఇలాంటి మూక దాడులు బడుగు బలహీన వర్గాలపైనే జరుగుతుండటం గమనార్హం. డాక్టర్ సీజే జాన్ ప్రకారం.. బలహీన వర్గాలు, నిస్సహాయులైన ట్రాన్స్‌జెండర్లు, వలసకూలీలు, దళితులపైనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. ఏ సామాజిక సమూహానికైతే కనీస ప్రతిఘటన చేసే శక్తిలేదో వారిపైనే ఈ దాడులు జరుగుతున్నాయి.

ఇతర రాష్ట్రాలనుంచి జీవనోపాధికోసం వచ్చిన వారిపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. అసోంకు చెందిన ఓ వలస కూలీని కొట్టాయం జిల్లా చింగవనంలో గతేడాది కొట్టి చంపారు. దొంగతనం చేశాడన్న కారణంతో యాభై మంది చూస్తుండగా కైలాష్ జ్యోతి బేహ్రా అనే కూలీని చెట్టుకు కట్టేసి కొట్టిచంపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రజల ఆరోపణ అవాస్తవమని తేల్చారు. అయినా ఏ ఘటన జరిగినా వలస కూలీలవైపే ఎందుకు అనుమానంగా చూస్తారంటే.. అంతకుముందు ఏడాది న్యాయశాస్త్రం చదువుతున్న ఓ దళిత విద్యార్థి అసోం వలస కూలీ చేతిలో హతుడయ్యాడు. దీంతో ఆ ప్రాంతంలో ఎక్కడేమి జరిగినా వలసకూలీలనే అనుమానించే స్థితి వచ్చింది. ఇక హిజ్రాల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానంతో తిరువనంతపురం వలియతుర ప్రాంతంలో ఓ హిజ్రాను నడిబజార్‌లో బట్టలూడదీసి చిత్రహింసలకు గురిచేశారు. రాత్రి వేళ కనిపిస్తే చాలు పోలీసులు పట్టుకొని హింసిస్తున్నారు. తిరువనంతపురంలో ఓ పాఠశాల వేడుకల్లో పాల్గొని ఇంటికి తిరిగివస్తున్న హిజ్రాలను పోలీసు లుతీవ్రంగా హింసించారు. ఈ క్రమంలో ఓ హిజ్రా ప్రాణాలు కూడా పోయాయి.

ఇలాంటి మూక మనస్తత్వంతో అమాయకులపై దాడులకు ప్రజల్లో ఉన్న భూస్వామ్య సాంస్కృతిక భావనలు, తమనేమీ చేయలేరనే ఆధిపత్య అహంకారం కారణమని మనస్తత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. అంతేగాక చట్టం తమనేమీ చేయలేదనే భావన కూడా కారణం. మరోవైపు ఇలాంటి దాడులకు పాల్పడుతున్న వారికి సహాయ పడుతున్న అధికార పార్టీ నేతలు, అధికారగణం కూడా కారణమని చెప్పుకోవచ్చు. ఒక గిరిజన యువకున్ని స్థానికులు ఈడ్చుకొచ్చి చితకబాదుతున్నా, పోలీసులు కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయారే కానీ జరుగుతున్న ఘోరాన్ని ఆపలేదని ప్రతిపక్షనేత రమేష్ చెన్నితల ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని పోరాడుతున్న డాక్టర్ జాన్ ప్రభుత్వ అలసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గత రెండేండ్లలో 335 కేసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీస్ కేసులు నమోదైతే, అందులో ఏ ఒక్కదానిలోనూ దోషులకు శిక్షలు పడలేదు. చాలా కేసుల్లో అరెస్టులు కూడా జరుగటం లేదు.

> ఇలాంటి మూక మనస్తత్వంతో అమాయకులపై దాడులకు ప్రజల్లో ఉన్న భూస్వామ్య సాంస్కృతిక భావనలు, తమనేమీ చేయలేరనే ఆధిపత్య అహంకారం కారణమని మనస్తత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. అంతేగాక చట్టం తమనేమీ చేయలేదనే భావన కూడా కారణం.

ప్రముఖ సామాజిక, రాజకీ య కార్యకర్త కె.వేణు విశ్లేషణ ప్రకారం.. కేరళ సమాజం ఇతర విషయాల్లో అభివృద్ధి చెందినంతగా సామాజికంగా, నాగరికంగా అభివృద్ధి చెందలేదు. అక్షరాస్యత విషయంలో ఎంత వృద్ధి సాధించినా మౌఢ్య భూస్వామ్య భావజాలం ఇంకా కేరళ సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. ఇదే నిదర్శనమని వివరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజం అంతర్గతంగా ప్రజాస్వామీకరించబడకుండా మానవీయ విలువలకు తావుండదని కేరళ ఉదంతాలు చాటిచెబుతున్నాయి. ఇప్పటికైనా కేరళ ప్రభుత్వం, సామాజిక, పౌర సంస్థలు మూక దాడులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. మూకదాడులకు బలవుతున్న బడుగు బలహీన వర్గాలకు రక్షణ కల్పించాలి.

**(డిఫ్ డాట్ కామ్ సౌజన్యంతో..)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

## అంటార్కిటికాలో 15 లక్షల అడేలీ పెంగ్విన్లు



**పారిస్, సిడ్నీ:** అంటార్కిటికాలోని సుదూర ప్రాంతాల్లో అంతరించిపోతున్న అరుదైన పెంగ్విన్ జాతి పక్షులను భారీ సంఖ్యలో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంటార్కిటికాలోని పలు దీవుల్లో దాదాపు 15 లక్షల అడేలీ పెంగ్విన్‌లను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. మంచు ఖండంలో నివసించే ఐదు రకాల జాతుల్లో అడేలీ పెంగ్విన్ అరుదైనదని, అయితే ఇంత భారీ స్థాయిలో ఆ జాతి పెంగ్విన్లు ఉండటం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తున్నదని శాస్త్రవేత్తలు చెప్పారు. దక్షిణ అమెరికా ఖండానికి సమీపంలో దగ్గరదగ్గరగా ఉన్న తొమ్మిది రాతి ద్వీపాల్లో పెద్ద సంఖ్యలో వీటిని కనుగొన్నట్లు వెల్లడించారు. మాంసాహారులైన ఈ జాతి పెంగ్విన్లను వాటి కంటి చుట్టూ ఉండే తెల్లని వలయంతో గుర్తించవచ్చు.

**తగ్గిపోతున్న మంచు:** అంటార్కిటికా సముద్రంపై ఉన్న మంచుపొర రికార్డు స్థాయిలో తగ్గిపోయిందని, అధిక ఉష్ణోగ్రతలే దీనికి కారణమని శాస్త్రవేత్తలు తెలిపారు. గతేడాది మార్చిలో 20.7 లక్షల చదరపు కిలోమీటర్ల మేర మంచు తగ్గిపోగా, ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే దాదాపు 21.5 లక్షల చదరపు కి.మీ. మేర తగ్గిపోయిందని చెప్పారు.

## వివాదంగా మారిన మ్యాగజైన్ ముఖచిత్రం!

- బిడ్డకు పాలుపట్టే మోడల్ ఫొటోపై అనుకూల, ప్రతికూల స్పందనలు
- అసభ్యంగా ఉన్నదంటూ కోర్టులో కేసు



**న్యూఢిల్లీ:** ఓ మలయాళీ మ్యాగజైన్ ముఖచిత్రంపై బిడ్డకు పాలుపట్టిస్తున్న మోడల్ ఫొటోను ప్రచురించటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటో అసభ్యకరంగా ఉన్నదని పేర్కొంటూ న్యాయస్థానం, కేరళ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌లోనూ కేసులు వేశారు. గృహలక్ష్మి అనే మలయాళీ మ్యాగజైన్ ముఖచిత్రంపై గిలు జోసెఫ్ అనే మోడల్ బిడ్డకు పాలిస్తున్న ఫొటో ప్రచురించారు. ఫొటో అసభ్యంగా ఉన్నదని, ఇది మహిళల అసభ్య ప్రాతినిధ్య (నిషేధ) చట్టం 1986లోని సెక్షన్ 3, 4లను ఉల్లంఘించిందని ప్రచురణకర్తలు, మోడల్‌పై న్యాయవాది వినోద్ మాథ్యూ కొల్లం న్యాయస్థానంలో కేసువేశారు. కేసు విచారణను కోర్టు ఈ నెల 16కు వాయిదా వేసింది. ఫేక్ ఫీడింగ్, బాలల హక్కుల ఉల్లంఘించారని ఫిర్యాదు వచ్చిందని, దీన్ని పరిశీలిస్తున్నామని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ శోభా కోషి తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన వచ్చిన గృహలక్ష్మి సంచికపై 'మేం బిడ్డలకు పాలివ్వాల్సి ఉంది. దయచేసి మమ్మల్ని పొంచిపొంచి చూడొద్దని కేరళకు చెప్పండి తల్లులారా!' అనే టైటిల్‌తో కవర్ ఫొటో ప్రచురించారు. సోషల్ మీడియాలో పలువురు దీన్ని ప్రశంసించగా, మరికొందరు దీనికి వ్యతిరేకంగా స్పందించారు. దుబాయ్‌కు చెందిన మలయాళీ మోడల్ గిలు జోసెఫ్ ఓ వీడియోలో ఈ వివాదంపై స్పందిస్తూ.. 'బహిరంగంగా తల్లిపాలు పట్టడంపై గృహలక్ష్మి జరుపుతున్న ప్రచారంలో ఇది ఓ భాగం. ఇది వాస్తవ సమస్య. ప్రస్తుతం సమాజంలో బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తమ బిడ్డకు పాలుపట్టే వాతావరణం కల్పించలేదు. బిడ్డకు పాలుఇవ్వడం అనేది తల్లి హక్కు. దీని గురించి ఎవరూ భయపడాల్సిన లేదా సిగ్గుపడాల్సిన అవసరంలేదు' అని చెప్పారు.

### బిడ్డ మరణ వార్త విన్నా..
## విధులు నిర్వహించారు

**కత్తిపోట్లకు గురైన వ్యక్తిని కాపాడిన యూపీ హెడ్ కానిస్టేబుల్**



భూపేంద్రను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

**లక్నో:** కన్నబిడ్డ మృతి వార్త తెలిసినా.. విధి నిర్వహణకే ప్రాధాన్యం ఇచ్చి ఆదర్శంగా నిలిచారు యూపీ హెడ్ కానిస్టేబుల్ భూపేంద్ర(57). గతనెల 23న ఉదయం 9 గంటలకు రాంపూర్ మణిహరన్-బడాగావ్ రహదారిపై సిర్‌సిరి గ్రామం వ్యక్తిపై కత్తితో దాడి జరిగిన సమాచారం వచ్చింది. ఆ వెంటనే భూపేంద్ర ఇంటి నుంచి వచ్చిన మరో ఫోన్‌లో తన కూతురు జ్యోతి (27) హఠాన్మరణం చెందిందని తెలిసింది. కానీ ఆయన విషాదాన్ని పంటిబిగువున అణుచుకున్నారు. దాడి జరిగిన స్థలానికి చేరుకుని రక్తపుమడుగులో ఉన్న వ్యక్తిని తమ వాహనంలో దవాఖానకు తరలించి కాపాడారు. వృత్తిధర్మంతో ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన భూపేంద్రను పోలీస్‌శాఖ అధికారులు సన్మానించారు.



# అమ్మ పిలుపుతో.. ఉగ్రవాదానికి వీడ్కోలు

**జనజీవన స్రవంతిలోకి తిరిగొచ్చిన యువకుడు**


**సరిహద్దుల్లో కొనసాగుతున్న పాక్ కాల్పులు ■ ఎదురుకాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులు హతం**

**జమ్ము/శ్రీనగర్, మార్చి 2:**

ఉద్యోగం, సద్యోగం చేయకున్నా ఫర్వాలేదు... ఇంటి పట్టున ఉంటే చాలని కోరుకునే తల్లులు ఎందరినో మనం చూస్తుంటాం. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఒక్కరోజు కనిపించకుండా పోతేనే విలవిల్లాడిపోయే ఆ తల్లి బాధ చెప్పనలవి కాదు. అలాంటిది తన కుమారుడు ఉగ్రవాదిగా మారడాన్ని ఆ తల్లి జీర్ణించుకోలేకపోయింది. నిద్రాహారాలు మాని కుమారుడు తిరిగొస్తాడనే ఆశతో జీవిస్తున్నది. కనిపించిన వారికల్లా తన కుమారుడ్ని రమ్మని చెప్పండయ్యా అని వేడుకునే ఆ తల్లి పిలుపు కుమారుడి చెవిన పడిందో కాబోలు... ఇదిగో అమ్మా వస్తున్నానంటూ తల్లి ముంగిట వాలిపోయాడు. జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని ఓ యువకుడు ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అతడి తల్లి కన్నీరుమున్నీరైంది. బాబూ ఇంటికి రా అంటూ ఎన్నో మార్లు వేడుకుంది. చివరకు కన్నతల్లి పిలుపునకు లొంగిపోయిన ఆ యువకుడు ఉగ్రవాదానికి వీడ్కోలు పలికి తల్లి చెంతకు చేరాడు. దాంతో ఆ తల్లి ముఖంలో సంతోషం వెల్లివిరిసింది. అయితే భద్రతా కారణాల రీత్యా ఆ యువకుడి వివరాలు తెలిపేందుకు పోలీసులు నిరాకరించారు. 'తల్లి పిలుపు మేరకు కుమారుడు ఉగ్రవాదాన్ని వీడటం మంచి పరిణామం. వారి కలయికతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిస్తుందని ఆకాంక్షిస్తున్నాను' అని జమ్ముకశ్మీర్ డీజీపీ ఎస్పీ వైద్ శుక్రవారం నాడు ట్విట్టర్‌లో తెలిపారు. రక్షణ కల్పిస్తామని పోలీసులు స్పష్టం చేసిన దరిమిలా గత ఏడాది నుంచి సుమారు పన్నెండు మంది యువకులు తుపాకులు వీడి జనజీవన స్రవంతిలో కలిసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. 'ఉగ్రవాదుల్లో చేరుతున్న యువత ఇంటికి తిరిగి వచ్చేలా వారి కుటుంబాలకు కౌన్సెలింగ్ చేపడుతున్నాం. క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వారి ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు యూత్ క్లబ్‌లను నెలకొల్పుతున్నాం' అని జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ శాసనమండలిలో చెప్పారు.

**పాక్ కాల్పుల్లో ముగ్గురికి గాయాలు**


భారత సరిహద్దు ప్రాంతంలోని పూంచ్ జిల్లాలో ఉన్న నౌషేరా, రాజౌరీ సెక్టార్లపై పాకిస్థాన్ రేంజర్లు తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి ఉన్న సుందర్‌బనీ, నౌషేరా, ఖౌర్ గ్రామాలపై విచక్షణారహితంగా పాకిస్థాన్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో ఓ పౌరుడు సహా ఇద్దరు ఆర్మీ జవాన్లు గాయపడ్డారు. పాకిస్థాన్ కాల్పులను భారత సైనికులు దీటుగా ఎదుర్కొన్నారు. ఈ ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు సైనికులు హతమైనట్లు భారత ఆర్మీ అధికారి ఒకరు తెలిపారు.



### దవాఖాన నుంచి తప్పించుకున్న ఉగ్రవాది ఆచూకీ లభ్యం

- సహచరులతో కలిసి అడవుల్లో సంచారం
- వెల్లడించిన వీడియో

**న్యూఢిల్లీ:** గత నెలలో శ్రీనగర్ దవాఖాన నుంచి తప్పించుకున్న లష్కరే తాయిబా ఉగ్రవాది నవీద్ జట్ జాడ తెలిపే వీడియో ఒకటి బయటపడింది. తుపాకీ చేత బట్టి మరో ఐదుగురు ఉగ్రవాదులతో కలిసి అతను దక్షిణ కశ్మీర్‌లోని అడవిలో సంచరిస్తున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. అతని వెంట ఉన్నవారు కమాండర్ సమీర్ టైగర్ తదితర హిజ్బుల్ ఉగ్రవాదులని పోలీసులు గుర్తించారు. నవీద్ జట్(22) అలియాస్ హంజా లా కరుడు గట్టిన ఉగ్రవాది. గతంలో కశ్మీర్‌లో పలు ఉగ్రదాడులకు పాల్పడ్డాడు. అతని దాడిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఒక టీచర్ మృతి చెందారు. పుల్వామా జిల్లాలో ఏడుగురు పోలీసుల హత్య వెనుక నవీద్ పాత్ర ఉన్నట్లు అనుమానాలున్నాయి. పోలీసులు నవీద్‌ను 2014 లో అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. నవీద్‌తోపాటు మరి కొందరు ఖైదీలను గతనెల 6న వైద్యపరీక్షలకు శ్రీనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లినపుడు తప్పించుకున్నాడు. అప్పుడు మరో ఉగ్రఖైదీతో కలిసి అతను జరిపిన కాల్పుల్లో ఇద్దరు పోలీసులు చనిపోయారు. ఆ ఘటనపై ఒక జైలు అధికారిని ప్రభుత్వం తొలిగించింది. అలా పరారైన నవీద్ హిజ్బుల్ ఉగ్రవాదులతో కలిసి పని చేస్తున్నపుడు ఆ వీడియోను తీశారని పోలీసులు భావిస్తున్నారు.



నవీద్ జట్

# ఈశాన్య పవనం ఎటువైపో!

**మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడే**

**ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం**

**అగర్తలా/ కోహిమా/ షిల్లాంగ్, మార్చి 2:**

ఈశాన్య ప్రాంతంలోని మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును శనివారం చేపడతారు. మూడు రాష్ర్టాల్లోనూ పటిష్ఠ బందోబస్తు నడుమ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని.. ఎన్నికల, పోలీసు పరిశీలకులను నియమించామని త్రిపుర అదనపు ఎన్నికల ప్రధానాధికారి తపస్ రే తెలిపారు. నాగాలాండ్‌లోని 17 లెక్కింపు కేంద్రాల్లో 349 టేబుళ్ల ఏర్పాటు చేశామని ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభిజిత్ సిన్హా అన్నారు. మేఘాలయలోని 13 లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని.. ఇందుకు 11 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించినట్టు ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎఫ్‌ఆర్ కార్కోంగోర్ తెలిపారు. ఈ మూడు రాష్ర్టాల్లో బీజేపీ ప్రధాన పోటీదారుగా నిలిచింది. త్రిపురలో 25 ఏండ్లుగా కొనసాగుతున్న లెఫ్ట్ ప్రభుత్వాన్ని బీజేపీ ఈసారి కుప్పకూలుస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మిగతా రెండు రాష్ర్టాలోనూ బీజేపీ బలంగా నిలుస్తుందని తెలిపాయి. మేఘాలయలో పదేండ్లుగా కాం గ్రెస్ పార్టీ.. నాగాలాండ్‌లో 2003 నుంచి నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌ఎఫ్‌పీ) అధికారంలో ఉన్నది. ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో విజయంతో ఉత్సాహం మీద ఉన్న బీజేపీ శ్రేణులు.. మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర రాష్ర్టాలోనూ పాగా వేయాలని ఉవ్విళ్లూరుతున్నాయి. త్రిపురలో ఫిబ్రవరి 18, నాగాలాండ్, మేఘాలయలో ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగింది. మూడు రాష్ర్టాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాలు ఉన్నా వివిధ కారణాలతో మూడు రాష్ట్రా ల్లో 59 చొప్పున స్థానాలకే ఎన్నికలు నిర్వహించారు. మేఘాలయలో కాంగ్రెస్ 59 స్థానాలు, బీజేపీ 47 స్థానాల్లో పోటీ చేసింది. తొలిసారి సీఎం ముకుల్ సంగ్మా రెండుచోట పోటీ చేశారు. నాగాలాండ్‌లో ఎన్డీపీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ.. ఎన్డీపీపీకి 40 స్థానాలు కేటాయించింది. నాగాలాండ్ ఏర్పడినప్పటి నుంచి ముగ్గురు సీఎంలను అందించిన కాంగ్రెస్.. బీజేపీ కంటే తక్కువగా 18 స్థానాల్లోనే పోటీ చేస్తున్నది. నాగాలాండ్‌లో పౌర సంఘాల హెచ్చరికలతో తొలుత ఎన్నికలకు దూరమన్న పార్టీలు.. చివరి క్షణంలో మనస్సు మార్చుకున్నాయి.



**త్రిపుర మంత్రి ఖాజేంద్ర కన్నుమూత**

**అగర్తాలా:** త్రిపుర మత్స్యశాఖ మంత్రి ఖాజేంద్ర జమతీయా శుక్రవారం ఢిల్లీలోని ఓ దవాఖానలో కన్నుమూశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన అధికార సీపీఎం తరపున కృష్ణపూర్ నుంచి పోటీ చేశారు. ఖాజేంద్రకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నెల 18న ఎన్నికలు ముగిశాక అస్వస్థతకు గురైన ఖాజేంద్ర ఢిల్లీలోని గోవింద్ వల్లభ్ పంత్ దవాఖానలో చేరారు. బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు.

# బుర్కినాలో ఉగ్రదాడులు

**28 మంది మృతి, 75 మందికి గాయాలు**



బుర్కినాలో ఉగ్రవాదుల దాడితో ఎగిసిపడుతున్న పొగ

- భద్రతాదళాల కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

**పారిస్, మార్చి 2:** బుర్కినాలో ఉగ్రవాదులు చెలరేగిపోయారు. రాజధాని ఔగాడౌగోలోని సైన్యం ప్రధాన కార్యాలయం, ఫ్రాన్స్ రాయబార కార్యాలయంపై ఆరుగురు సాయుధ ఉగ్రవాదులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో కనీసం 28 మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఇద్దరు ఫ్రాన్స్, మరొకరు పశ్చిమ ఆఫ్రికాకు చెందిన వారని భద్రతా సంస్థలు తెలిపాయి. బుర్కినా ప్రభుత్వ భద్రతా బలగాలు మాత్రం 15 మంది మరణించారని పేర్కొన్నాయి. సైన్యం వైద్య విభాగం అధిపతి కర్నల్ అమాడో కఫాండో మాట్లాడుతూ మరో 75 మంది గాయపడ్డారని తెలిపారు. రెండు ఘటనల్లో జరిగిన మృతుల సంఖ్యను కలిపి చెబుతున్నారా? ఏదో ఒక దాడికి సంబంధించిన మృతులా? అన్న విషయం తెలియరాలేదు. దాడికి పాల్పడిన ఆరుగురు సాయుధ ఉగ్రవాదులు భద్రతా బలగాల కాల్పుల్లో హతమయ్యారు. ఆరుగురు ఉగ్రవాదుల్లో ఫ్రాన్స్ రాయబార కార్యాలయంపై నలుగురు, సైన్యం ప్రధాన కార్యాలయంపై మరో ఇద్దరు దాడి చేశారు. మృతుల్లో తమ పౌరులు లేరని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. మృతుల్లో ఏడుగురు భద్రత సిబ్బంది ఉన్నారు.

## అమెరికాలో మళ్లీ కాల్పులు

- సెంట్రల్ మిషిగన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఘటన
- ఇద్దరు మృతి.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**షికాగో, మార్చి 2:** అమెరికాలోని సెంట్రల్ మిషిగన్ యూనివర్సిటీ వసతిగృహం క్యాంబెల్ హాల్‌లో శుక్రవారం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతిచెందారు. 19 ఏండ్ల వయసున్న ఓ యువకుడు ఆయుధంతో వసతిగృహంలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడినట్లు తెలుస్తున్నది. కాల్పులు జరిగిన వెంటనే యూనివర్సిటీ అధికారులు అప్రమత్తమయ్యారు. కాల్పుల విషయాన్ని విద్యార్థులకు చేరవేశారు. నిందితుడు జేమ్స్ ఎరిక్ డెవిస్ జూనియర్‌గా భావిస్తున్నామని అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



యూనివర్సిటీ ఆవరణలో పోలీసులు; ఇన్‌సెట్‌లో నిందితుడు జేమ్స్ ఎరిక్ డెవిస్



## మాదక ద్రవ్యాల విముక్తి కేంద్రంలో అగ్ని ప్రమాదం

- 25 మంది మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
- అజర్‌బైజాన్ రాజధాని బకులో ఘటన

**బకు, మార్చి 2:** అజర్‌బైజాన్ రాజధాని బకు నగరంలోని 'డ్రగ్స్ రిహాబిలిటేషన్ క్లినిక్ (మాదక ద్రవ్యాల విముక్తి కేంద్రం)'లో శుక్రవారం ఉదయం 6.10 గంటలకు సంభవించిన అగ్ని ప్రమాదంలో 25 మంది మృతి చెందారు. మరో నలుగురు తీవ్ర గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పూర్తిగా కలపతో నిర్మించిన దవాఖాన వార్డులో మంటలు పెద్ద ఎత్తున చెలరేగిన దృశ్యాలను స్థానిక టీవీ చానెళ్లు ప్రసారం చేశాయి. ఈ క్లినిక్ నిర్మాణంలో భద్రతా ప్రమాణాలు పాటించలేదని మానవ హక్కుల కార్యకర్తలు ఆరోపించారు. అగ్ని ప్రమాదం జరిగిన మూడు గంటల తర్వాత 10 బృందాల అగ్నిమాపక దళాలు, అత్యవసర సర్వీసుల శాఖ సహాయ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. క్లినిక్‌లో చిక్కుకున్న 200 మందికి పైగా రోగులు, వైద్య సిబ్బంది ప్రాణాలను కాపాడారు. ఘటనాస్థలాన్ని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ సందర్శించారు. ప్రమాదానికి సాంకేతిక లోపమే కారణమని ప్రాథమికంగా తెలుస్తున్నది.

## విజయేంద్ర సరస్వతిపై కేసు!

**తమిళనాడు పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఆదేశం**

**చెన్నై:** కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తమిళ గేయాన్ని అవమానించడం నిజమే అయితే ఆయనపై కేసు (ఎఫ్ఐఆర్) నమోదు చేయాలని తమిళనాడు పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత జనవరిలో జరిగిన ఒక కార్యక్రమంలో తమిళ రాష్ట్ర గేయం 'తమిళ్ థాయి వజ్తు' ఆలపిస్తున్నప్పుడు అక్కడ ఉన్న వారంతా లేచి నిలబడినప్పటికీ.. విజయేంద్ర సరస్వతి కుర్చీలో కండ్లు మూసుకుని కూర్చున్నారు. దీంతో తాంతై పెరియార్ ద్రవిడ కజగం ఉపాధ్యక్షుడు దొరైస్వామి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## కర్ణాటకలో 'పరువు' హత్య


**మైసూర్:** పరువు పోతుందన్న కారణంతోనే ఓ తండ్రి కన్న కుమార్తెను హత్య చేశాడు. ఈ ఘటన కర్ణాటకలోని మైసూరులో ఇటీవల జరిగింది. అగ్రకులానికి చెందిన కుమార్ అనే వ్యక్తి కుమార్తె సుష్మ ఒక దళిత యువకుడిని ప్రేమించింది. దీంతో కుమార్ తన కుమార్తెను కాలేజీ మాన్పించాడు. ఆ తర్వాత సుష్మ, ఉమేశ్ ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెండ్లి చేసుకున్నారు. దీంతో కుమార్తెను చంపడానికి కుమార్ పథకంపన్నాడు. ఇంటికి రావాలని, ఫంక్షన్ చేసుకుందామని కుమార్తెతో చెప్పడంతో ఆమె తిరిగి వచ్చింది. కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించడంతో సుష్మ మృతిచెందింది. మృతదేహాన్ని పొలానికి తీసుకెళ్లి కాల్చేశాడు. పోలీసుల విచారణలో కుమార్ నేరాన్ని ఒప్పుకున్నాడు.

### హిమాచల్‌లో రోడ్డు ప్రమాదాలు..
## 11 మంది మృతి

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 11 మంది మరణించారు. గాయాలతో ఏడుగురు దవాఖానలో చికిత్సపొందుతున్నారు. అమృత్‌సర్ నుంచి మణికరన్ వెళ్తున్న కారు చండీగఢ్-మనాలీ రహదారిపై స్వర్గత్ వద్ద అదుపుతప్పి లోయలో పడటంతో ఎనిమిది మంది మృతిచెందారు. మరో ఘటనలో బిర్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉనా వద్ద కారును ఢీకొట్టగా ముగ్గురు మరణించారు.

## అజేయ క్షిపణిని తయారుచేశాం!

**ఏ లక్ష్యాన్నైనా ఛేదించగలదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి**





**మాస్కో:** ప్రపంచంలోని ఏ లక్ష్యాన్నైనా చేరుకోగల ఖండాంతర క్షిపణి వ్యవస్థను సొంతం చేసుకున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఇందులో హైపర్ సోనిక్ క్షిపణులు, అధునాతన జలాంతర్గాములు ఉన్నట్లు చెప్పారు. అధ్యక్ష ఎన్నికలు సమీస్తుండటంతో పుతిన్ దేశ కొత్త అణ్వాయుధ సంపత్తి వివరాలను వెల్లడించారు. తాము అభివృద్ధి చేసిన క్షిపణిని ఏ రక్షణ వ్యవస్థా నిలువరించలేదని ఫెడరల్ అసెంబ్లీని ఉద్దేశించి గురువారం చేసిన ప్రసంగంలో చెప్పారు. ప్రసంగిస్తున్నప్పుడు కొత్త క్షిపణి దూసుకెళ్తున్న వీడియోను భారీ తెరపై ప్రదర్శించారు. ఈ అణ్వస్త్రం ప్రపంచంలోని ఏ రక్షణ వ్యవస్థనైనా నిర్వీర్యం చేయగలదన్నారు. తక్కువ ఎత్తు లో ప్రయాణించే ఈ క్షిపణిని శత్రువులు గుర్తించడం చాలా కష్టమన్నారు. రష్యాపై గానీ, తమ భాగస్వామ్య పక్షాలపై గానీ జరిగే ఏ అణుదాడి నైనా తమపై దాడిగానే భావిస్తామనిన్నారు. ఉన్నత స్థాయి టెక్నాలజీ, మేధోసంపత్తి కల రష్యా యువత ఎంతో పట్టు దల, శ్రద్ధతో ఈ క్షిపణి వ్యవస్థను రూపొందించారని స్పష్టంచేశారు. పుతిన్ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని, అవి వట్టి బుకాయింపులేనని పలువురు విశ్లేషకులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించారు.

**ఇది ప్రచ్ఛన్న యుద్ధం ఒప్పందాల ఉల్లంఘనే!: అమెరికా**

**వాషింగ్టన్:** అజేయ ఆయుధాలు తయారు చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించడంపై అమెరికా మండిపడింది. పుతిన్ ప్రచ్ఛన్న యుద్ధం కాలం నాటి ఒప్పందాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారన్నది. దేశాన్ని రక్షించుకునేందుకు తమ సైన్యం సర్వ సన్నద్ధంగా ఉన్నదని స్పష్టం చేసింది. వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి సారా శాండర్స్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 'రష్యా ఎంతోకాలంగా అణ్వస్త్రాలు తయారుచేస్తున్న సంగతి మాకు తెలుసు. ఇప్పటివరకు దీన్ని రష్యా నిరాకరించింది. కానీ పుతిన్ తాజా ప్రకటనతో ఈ విషయం రుజువైంది' అని అన్నారు. రష్యా అణ్వస్త్రాలను నిరోధించే సామర్థ్యం తమకు ఉన్నదన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో భద్రత పెంచండి

**ఢిల్లీ తరహా విధానాలు పాటించండి.. మధ్యప్రదేశ్ సీఎంకు లేఖ రాసిన లోక్‌సభ స్పీకర్**



**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లోని ప్రైవేట్ స్కూళ్లలో భద్ర త పెంచాలని, అవసరమైతే ఢిల్లీ తరహా విధానా లు పాటించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మ హాజన్ సూచించారు. ఈ మేరకు మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు శుక్రవారం లేఖ రాశారు. జనవరి 5న మధ్యప్రదేశ్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు అతివేగంతో ప్రయాణిస్తూ ఓ ట్రక్ ను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు విద్యార్థులతోపాటు డ్రైవర్ మృతిచెందారు. బస్సు నిర్వహణ లోపం కారణంగా ప్రమాదం జరిగినట్టు తేలింది. ఈ ఘటనపై లోక్‌సభ స్పీకర్ స్పందించారు. 'విద్యార్థుల రక్షణకు ఢిల్లీ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారని విన్నాను. ముఖ్యంగా పాఠశాలలో ఏదైనా హింస జరిగినా, ఏదైనా ఘటనతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లినా వెంటనే ఆ పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకొని నడిపిస్తున్నారు' అని అన్నారు. అవసరమైతే ఇలాంటి నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని సూచించారు.

## భారత రాయబారికి పాక్ క్లబ్‌లో నో ఎంట్రీ

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లోని భారత రాయబారికి ఇస్లామాబాద్‌లోని ఓ ప్రముఖ క్లబ్ సభ్యత్వం నిరాకరించింది. విదేశీ రాయబారులు, దౌత్యవేత్తలకు భేషరతుగా సభ్యత్వం కల్పించే ఈ క్లబ్.. భారత రాయబారి అజయ్ బిసారియాకు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు. ఇతర భారత దౌత్యవేత్తలకు సభ్యత్వాన్ని పునరుద్ధరించలేదు. కారణాలను మాత్రం సదరు క్లబ్ వెల్లడించలేదు. రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించిన ప్రస్తుత తరుణంలో భారత రాయబారి అజయ్ బిసారియాకు ఇస్లామాబాద్ క్లబ్‌లో సభ్యత్వాన్ని పెండింగ్‌లో పెట్టింది. కాగా, గత ఏడాది నవంబర్‌లో పాకిస్థాన్‌లో భారత రాయబారిగా నియమితులైన అజయ్ బిసారియా కూడా అందరి మాదిరిగానే సభ్యత్వం కోసం సమర్పించిన దరఖాస్తుపై క్లబ్ యాజమాన్యం ఇప్పటివరకు స్పందించలేదు.

**భారత దౌత్యవేత్తకు మరోసారి పాక్ సమన్లు**

**ఇస్లామాబాద్:** పాక్‌లో భారత డిప్యూటీ హై కమిషనర్ జేపీ సింగ్‌కు మరోసారి పాకిస్థాన్ సమన్లు జారీ చేసింది. భారత దళాలు సరిహద్దు వెంట కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నాయని, పాక్ భూ భాగంలోకి కాల్పులు జరుపుతున్నాయని ఆరోపించింది. ఈ మేరకు సమన్లు జారీ చేశారు.

## విదేశీ తీర్పులను భారత కోర్టులు పరిగణించొచ్చు

**బాంబే హైకోర్టు స్పష్టీకరణ**

**ముంబై:** భారతీయులను దోషులుగా తేలుస్తూ విదేశీ కోర్టులు ఇచ్చే తీర్పులను దేశీయ న్యాయస్థానాలూ పరిగణనలోకి తీసుకోవచ్చునని బాంబే హైకోర్టు పేర్కొంది. విదేశీ కోర్టుల తీర్పులు భారత చట్టాలకు లోబడకున్నా, వాటిని భారత కోర్టులు పరిగణనలోకి తీసుకోవచ్చునని బాంబే హైకోర్టు ధర్మాసనం గురువారం తెలిపింది. దీనిపై 2013లో సందేహాలు లేవనెత్తిన డివిజన్ బెంచ్, దీనిపై స్పష్టత ఇవ్వాలని విస్తృత ధర్మాసనాన్ని కోరింది. ఈమేరకు జస్టిస్‌లు బీఆర్ గవాయ్, కేఆర్ శ్రీరాం, బీపీ కొలాబావాలాతో కూడిన ధర్మాసనం గురువారం రూలింగ్ ఇచ్చింది. ముంబైలోని లీలావతి దవాఖాన ట్రస్టీ పదవినుంచి తనను అకారణంగా తొలిగించారని ఆరోపిస్తూ ప్రమోద్ మెహతా 2013 మార్చిలో పిటిషన్ దాఖలు చేశారు. మెహతా తప్పుడు ప్రవర్తన వల్లే బెల్జియం కోర్టు ఆయనకు గతంలో శిక్ష విధించిందని దవాఖాన జాయింట్ చారిటీ కమిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు.

## ఈ ఏడాది నుంచే పీహెచ్‌డీ ఉమ్మడి ప్రవేశాలు!

■ సాధ్యాసాధ్యాలపై సమావేశమైన అడ్మిషన్స్ కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పీహెచ్‌డీ అడ్మిషన్ల విషయంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ఉమ్మడి నిబంధనలుండాలన్న అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు దృష్టి సారించారు. 2017లో విడుదలైన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్తులో నిర్వహించబోయే ప్రవేశాలు, ఉమ్మడి నిబంధనల అంశాలపై శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల కమిటీ సమావేశమైంది. ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రామచంద్రం, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ వేణుగోపాలరెడ్డి, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సీతారామారావుతోపాటు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు.. యూజీసీ జారీచేసిన నూతన నిబంధనల అమలు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో వేర్వేరు పద్ధతుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో ప్రవేశపరీక్షలు నిర్వహిస్తున్నారు. మరికొన్నింటిలో ప్రవేశపరీక్షలను నిర్వహించి ర్యాంకులు ఇస్తున్నారు. దీనివల్ల పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు గందరగోళంలో పడే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఉమ్మడి నిబంధనలతో అడ్మిషన్లు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. మరోసారి నిర్వహించే సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. 2018-19 విద్యాసంవత్సరం నుంచే పీహెచ్‌డీ అడ్మిషన్లు కామన్ పద్ధతిలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు.



బాధితుడు షేక్ ముజీబ్‌కు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్

## మక్కా ప్రమాదబాధితుడు ముజీబ్‌కు 50వేల ఆర్థికసాయం

- మానవత్వంతో ఆదుకున్న హజ్ కమిటీ చైర్మన్
- డిప్యూటీ సీఎం మహమూద్ అలీ చేతుల మీదుగా చెక్కు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా హజ్‌యాత్రకు వెళ్లి మక్కాలో క్రేన్ కూలిన ఘటనలో గాయపడ్డ హైదరాబాద్ పాతబస్తీకి చెందిన షేక్ ముజీబ్‌కు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్ తన తొలి నెల జీతం రూ.50 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. శుక్రవారం డిప్యూటీ సీఎం మహమూద్ అలీ జన్మదినాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ముజీబ్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. గతంలో సహాయం కోరుతూ అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని బాధితుడు ముజీబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం అందజేసిన హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీపీఎస్సీ డీఎల్ పరీక్షలో టాపర్‌గా ఓయూ విద్యార్థి



కుర్మేటి సుధాకర్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీ కళాశాలల అధ్యాపక (డీఎల్) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కుర్మేటి సుధాకర్ టాపర్‌గా నిలిచారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఘడియ గౌరారం గ్రామానికి చెందిన సుధాకర్ ప్రస్తుతం ఓయూలో పరిశోధక విద్యార్థిగా కొనసాగుతున్నారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన డీఎల్ పరీక్షలో 500 మార్కులకుగాను 350.35 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను ఓయూకు చెందిన పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## డంగు సున్నం.. బెల్లం.. జనుము

- ఖైరతాబాద్ మసీదు మరమ్మతులకు వాడే పదార్థాలివే..
- 'స్కక్కో' వర్క్ కోసం ప్రత్యేక శిల్పుల నియామకం

**ఖైరతాబాద్:** హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని చారిత్రాత్మక కుతుబ్‌షాహీ (బడా) మసీదు మరమ్మతు కోసం ప్రాచీన కాలంలో కట్టడాల నిర్మాణానికి ఉపయోగించిన ముడిసరుకునే వాడనున్నారు. ఇండో-పర్షియన్ నిర్మాణ శైలిలో, స్టక్కో వర్క్ (సన్నగార) శిల్ప కళా నైపుణ్యంతో దీనిని నిర్మించారు. మసీదులోని మూడు ఆర్చీలు, ఏడు మినార్లతో ప్రతిచోట స్టక్కోవర్క్ ఉట్టిపడుతుంది. ఈ నేపథ్యంలో సహజత్వం దెబ్బతినకుండా ఉండేందుకు మరమ్మతు పనులకు డంగు సున్నం, బెల్లం, కరక్కాయ, కలబంద, గోడిగుడ్డు తెల్లసొన, జనపనార వినియోగించనున్నారు. డంగు సున్నం మిశ్రమాన్ని తయారు చేసేందుకు శాస్త్రీయ పద్ధతులను వినియోగిస్తున్నారు. కాల్షియం కార్బొనేట్ (డంగు సున్నం)ను రసాయనిక చర్యలతో కాల్షియం ఆక్సైడ్‌గా మార్చి అందులో బెల్లం, కరక్కాయ తదితర ముడిసరుకులను కలుపనున్నారు. ఈ మిశ్రమాన్ని మరమ్మతులకు వినియోగిస్తారు. మిశ్రమం తయారీ, స్కక్కో వర్క్ కోసం పురావస్తు శాఖ ప్రత్యేక శిల్పులను, కళాకారులను నియమించింది. సిమెంట్ వాడితే 50 ఏండ్ల వరకు మాత్రమే మన్నుతుందని, డంగు సున్నం మిశ్రమంతో నిర్మించిన కట్టడాలు, మరమ్మతులు కనీసం 200 నుంచి 400 ఏండ్ల వరకు చెక్కుచెదరకుండా ఉంటాయని పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ తెలిపారు. నాలుగు నెలల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. 1626లో కుతుబ్ షా కుమార్తె ఖైరున్నీసా బేగం తన గురువైన అకుంద్ ముల్లా అబ్దుల్ మాలిక్ స్మారకార్థం ఈ మసీదు, టూంబ్‌ను నిర్మించారు. దీనికి అప్పటి ఆర్కిటెక్ట్ హుస్సే షా వలీ డిజైన్ చేయగా మొత్తం ఇండో-పర్షియన్ నిర్మాణ శైలిలో, స్టక్కో వర్క్ (సన్నగార) శిల్ప కళా నైపుణ్యం ఉట్టిపడేలా చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం మినార్లు, మసీదు భాగంలో పగుళ్లు తేలి, కొన్నిచోట్ల బీటలు వారాయి. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని పురాతన, చారిత్రాత్మక మసీదుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రభుత్వం పురావస్తు శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించింది. పునరుద్ధరణ పనులను శుక్రవారం డిప్యూటీ సీం మహమూద్ అలీ ప్రారంభించారు.



ఖైరతాబాద్‌లోని కుతుబ్ షాహీ మసీదు



సిద్దిపేటలోని కోమటిచెరువు కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్



నీటిపారుదలశాఖ బ్రాండ్ అంబాసీడర్ నేహాల్‌ను అభినందిస్తున్న సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్. చిత్రంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు

# కళాకారులు సంస్కృతిని బతికించాలి

### సిద్దిపేట అభివృద్ధి మంత్రి హరీశ్‌రావు చిత్తశుద్ధికి నిదర్శనం

**కోమటిచెరువు కళాక్షేత్రం దేశానికే ఆదర్శం: అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి**

**రెండోరోజు కొనసాగిన వేడుకలు.. ఆకట్టుకున్న ప్రదర్శనలు**

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్మించిన కోమటి చెరువు కళాక్షేత్రం దేశానికే ఆదర్శమని, ఇలాంటి ఆడిటోరియం దేశంలో మరెక్కడా లేదని అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. ఈ కళాక్షేత్రం కవులు, కళాకారులకు స్ఫూర్తినిస్తుందన్నారు. రాష్ట్రంలోని కళాకారులు విలువలు, సంస్కృతిని బతికించాలని సూచించారు. సిద్దిపేట కోమటి చెరువు కళాక్షేత్రం ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు నిర్వహించిన వేడుకలకు స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, పెద్దపల్లి కలెక్టర్ దేవసేన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. సిద్దిపేటను కవులు, కళాకారులు, సాహిత్య అభిమానుల పూదోటగా అభివర్ణించారు. ఈ నియోజకవర్గం రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సిద్దిపేట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. ఒకప్పుడు ఉద్యమానికి, నేడు అభివృద్ధికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. చిత్తశుద్ధి ఉన్న నాయకత్వం ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందనడానికి మంత్రి హరీశ్‌రావే నిదర్శనమన్నారు. ఆయన పనితీరును చూస్తుంటే తమకూ ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నదన్నారు. సిద్దిపేట అంటేనే క్రియేటర్స్ అని ఇక్కడ జరుగుతున్న ప్రతి పనిని అందరూ అనుసరించాల్సిందేనన్నారు.



రెండోరోజు వేడుకల్లో ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యం



విద్యుత్‌దీపాల మధ్య ధగధగ మెరిసిపోతున్న కోమటిచెరువు కళాక్షేత్రం

**అబ్బురపరిచిన నేహాల్ మేధోశక్తి**

రాష్ట్ర నీటి పారుదల శాఖ బ్రాండ్ అంబాసిడ్ నేహాల్ తన అద్భుతమైన మేధస్సుతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల నిర్మాణ పద్ధతులు, వాటి సామర్థ్యం, రోజూ పనులు జరుగుతున్న తీరును క్షుణ్ణంగా వివరించారు. సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో తెలంగాణ రైతుల కన్నీళ్లు తుడువడానికి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని విమర్శించారు. మొక్కవోని పట్టుదలతో కాంగ్రెస్ సృష్టించిన అడ్డంకులను దాటి త్వరితగతిన అనుమతులు తీసుకొచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపడుతున్నారని వివరించారు. అనంతరం నిర్వాహకులు నేహాల్‌కు రూ.10 వేల నగదు అందించి సన్మానించారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు**

కోమటి చెరువు కళా ఉత్సవాల్లో భాగంగా రెండో కళాకారుల ఆట..పాట ఆకట్టుకున్నాయి. గీతాలహరి, దేశీరాగం, ఆహో, మాతృవందనం, వాద్యవిన్యాసం, సంకీర్తనలహరి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన అహో సిరిపురం శ్రీనివాస్ వినూత్న ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా నిర్వాహకులు పలువురు కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# లెక్కలు తేలుతున్నాయ్!

### బండ్లగూడ ఆర్టీవోలో ఆడిటింగ్ చేస్తున్న త్రిసభ్య కమిటీ

- అక్రమాలపై రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సీరియస్
- ఉన్నతాధికారులతో 5న సమావేశం

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ బండ్లగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో జరిగిన అవినీతి లెక్కలు తేలుతున్నాయి. లైఫ్‌ట్యాక్స్ వసూళ్లలో జరిగిన అక్రమాలపై నియమించి త్రిసభ్య కమిటీ విచారణ జరుపుతున్నది. వాహనాల వయసును ఎక్కువగా నిర్ధారిస్తూ తప్పుడు పత్రాలు సృష్టించడం ద్వారా ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఆడిటింగ్ చేస్తున్నది. మరోవైపు ఈ అవినీతి వ్యవహారాన్ని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తున్నది. బండ్లగూడ ఆర్టీవోలోని కొందరు సిబ్బంది, మధ్యవర్తులు, వ్యాపారులు కుమ్మక్కై జరుపుతున్న ఈ అక్రమ దందాపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'లైఫ్‌ట్యాక్స్‌ను మింగేశారు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు విచారణను ముమ్మరం చేశారు. బండ్లగూడ ఆర్టీవో ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి బదిలీ అయిన వాహనాలెన్ని, అందులో నిబంధనలకు విరుద్ధంగా లైఫ్‌ట్యాక్స్ ఎగవేసినవి ఎన్ని ఉన్నాయనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రతీ ఫైలును పరిశీలిస్తూ ఒక్కో వాహనంపై వాస్తవంగా ఎంత పన్ను వసూలు చేయాలి? ఎంత వసూలు చేశారు? అనే వివరాలను రికార్డు చేస్తున్నారు. అయితే ఈ పరిశీలనలో అధికారులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వర్‌లో నమోదు చేసిన డాటా మొత్తం లోపభూయిష్టంగా ఉండటంతో పాటు, ప్రధాన నిందితులు పలు వాహనాలకు సంబంధించిన అనేక దస్త్రాలను ఇప్పటికే మాయం చేసినట్టు తెలుస్తున్నది. ఈ అవినీతి విలువ రూ.2 కోట్లకుపైగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేయగా... ఇప్పటివరకు జరిగిన ఆడిటింగ్‌లో రూ.కోటికిపైగా బయటపడ్డట్టు తెలిసింది. ఎగవేసినట్టు తేలిన లైఫ్‌ట్యాక్స్‌ను వసూలు చేస్తూనే అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు. పన్ను తక్కువ చెల్లించిన వాహనాల నుంచి మిగతా మొత్తాన్ని వసూలు చేయనున్నారు. ఇందులో భాగంగా తక్కువ పన్ను చెల్లించిన వాహనాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. ఇదే కార్యాలయంలో నాలుగు రోజుల కిందట వెలుగు చూసిన స్క్రాప్ వాహనాలకు ఆర్సీలు ఇచ్చిన కుంభకోణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పూర్తిస్థాయి ఆధారాలను సంపాదించినట్టు తెలిసింది. ఈ మేరకు త్వరలో రవాణాశాఖకు లేఖ రాయనున్నట్టు సమాచారం. అయితే ఈ రెండు కేసులను నిర్వీర్యం చేసేందుకు ప్రధాన నిందితులు ప్రయత్నాలను ఇప్పటికే ప్రారంభించారు.

**వరుస కుంభకోణాలపై మంత్రి సీరియస్**

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో వరుసగా కుంభకోణాలు వెలుగుచూస్తుండటంపై రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సీరియస్ అయినట్టు తెలుస్తున్నది. వరుస వివాదాలు, విమర్శలు, అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన ఈ నెల 5వ తేదీన రవాణాశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇటీవలి వరుస ఘటనలపై సమీక్షించే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. అవినీతి ఆరోపణలు రావడంతోపాటు ప్రభుత్వ రాబడికి నష్టం కలిగించే చర్యలపైనా చర్చించే అవకాశం ఉన్నదన్నారు. లైఫ్‌ట్యాక్స్ అవినీతిలో ఆడిటింగ్ పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదన్నారు.



**అవినీతి రుజువైతే చర్యలు తప్పవు**

బండ్లగూడ ఆర్టీవోలో లైఫ్‌ట్యాక్స్ ఎగవేతకు సంబంధించి ఆడిటింగ్ జరుగుతున్నదని, తప్పు తేలితే నిందితులు ఎవరైనా చర్యలు తప్పవని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండురంగనాయక్ తెలిపారు. స్క్రాప్ వాహనాలకు ఆర్సీలు సృష్టించిన అవినీతిపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల నుంచి లేఖ వచ్చిన తర్వాత స్పందిస్తామన్నారు. ఈ రెండు ఘటనల్లో రవాణాశాఖ తరపున కూడా డాటాను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.



ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును శుక్రవారం తెలంగాణ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చెలిమచర్ల విజయ్‌కుమార్ సన్మానించారు. కలగా మిగిలిపోతుందనుకున్న రైతులకు 24 గంటల విద్యుత్‌ను సాకారం చేయడంలో ప్రభాకర్‌రావు శ్రమ ఎంతో ఉన్నదని కొనియాడారు. వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేసే నిర్ణయాన్ని సమర్థంగా అమలు చేస్తున్నందుకు తమ ఫోరం తరపున ప్రభాకర్‌రావును సన్మానించినట్టు చెప్పారు.

– అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ

**• మిత్రుడొచ్చాడు**




గత ఏడాది హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరిగిన జీఈఎస్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడి కూతురు ఇవాంకా ట్రంప్‌కు స్వాగతం పలికిన రోబో 'మిత్ర' గుర్తుందా... అదే రోబో మరోసారి హైదరాబాద్‌లో సందడి చేయనున్నది. మహిళా దినోత్సవం సందర్భంగా షీటీమ్స్ నిర్వహిస్తున్న ఎక్స్‌పోలో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వచ్చింది. బెంగళూరుకు చెందిన ఇన్వెంట్ రోబోటిక్స్ సంస్థ రూపొందించిన 'మిత్ర' ప్రస్తుతం సీసీఎస్‌లో ఉన్నది. ఈ రోబోను ఆదివారం ఉదయం జరుగనున్న షీ టీమ్స్ 10కే రన్‌లో పరుగెత్తించాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

## తప్పతాగి కారు నడిపి.. నిండు ప్రాణం తీశాడు

**బేగంపేటలో ఘోర రోడ్డు ప్రమాదం**

**మద్యం మత్తులో కారు నడిపిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి**

**ఆటోను ఢీ కొట్టిన కారు.. ఆటో డ్రైవర్ మృతి**

**బేగంపేట:**

ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తప్పతాగి కారును అతివేగంగా నడిపి ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాడు. యూటర్న్ తీసుకుంటున్న ఆటోను అతివేగంగా వచ్చి ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్‌కు చెందిన నవీన్ కుమార్ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున పంజాగుట్ట మీదుగా ఉప్పల్ వైపు వెళ్లేందుకు తన కారులో బయలుదేరాడు. అప్పటికే పీకలదాకా మద్యం తాగిన నవీన్‌కుమార్ అతివేగంతో కారును నడుపుతున్నాడు. 3.45 గంటల సమయంలో బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఉన్న సిగ్నల్ వద్ద సికింద్రాబాద్ వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. అంతేకాకుండా కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. దీంతో ఆటో నడుపుతున్న చింతల్ సమీపంలోని షాపూర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రఫీక్ (34) రోడ్డుపై పడ్డాడు. రఫీక్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో నవీన్ కుమార్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న బేగంపేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.



ఘటనాస్థలంలో రక్తపుమడుగులో ఆటోడ్రైవర్ రఫీక్ మృతదేహం, ధ్వంసమైన ఆటో



## జంతువులపై జాలితో..

**దేశమంతా తిరుగుతున్నారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ చేస్తున్నారు. కెమెరాల్లో బంధించిన చిత్రాలను అమ్ముతున్నారు. వచ్చిన డబ్బులను జంతువుల కోసమే ఖర్చు చేస్తున్నారు డాక్టర్ సరితా సుబ్రహ్మణ్యం.**

వేసవి తాపానికి తట్టుకోలేక ఎన్నో వన్యప్రాణులు ప్రాణాలు వదులుతాయి. డాక్టర్ సరిత సుబ్రహ్మణ్యం భర్త పీవీ సుబ్రహ్మణ్యంతో కలిసి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశమంతా తిరిగి వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ చేస్తున్న ఈ దంపతులిద్దరూ ముంబైకి చెందిన డెంటల్ డాక్టర్లు. ఇరువై ఐదేళ్ల నుంచి తిరిగి ఫొటోలు తీస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఆలోచన వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తీసిన చిత్రాల్లో 20 కాన్వాస్ సైజుల్లో ప్రింట్ తీయించి అమ్మకానికి పెట్టారు. జంతువులపై జాలితో చేస్తున్న వీళ్ల కార్యక్రమం చాలామందికి నచ్చింది. చిత్రాలు అమ్మిన డబ్బులను బందిపూర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అడవి జంతువులకు మంచినీళ్లు సప్లయ్ చేయడానికి వెచ్చిస్తున్నారు. ఫారెస్ట్‌లో సోలార్ పంప్స్, బోర్లు వేయించడానికి ఆ డబ్బులు ఖర్చు చేస్తున్నారు.

## విశాఖ విప్లవం

**తాగుబోతు తండ్రి.. కూతురిని బరువుగా భావించాడు. బాల్య వివాహం చేసి చేతులు దులుపుకొందాం అనుకున్నాడు. విషయం తెలుసుకున్న విశాఖ ఓ ఉద్యమమే చేసింది.**

చీకటి గదిలో బంధించాలనుకున్న తండ్రి కళ్లను తెరిపించింది. బ్లాక్ అండ్ వైట్ రోజుల నుంచి రంగుల ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టాలనుకున్న ఆమె ఆశలను, ఆశయాలను నలిపేసిన ఆ తండ్రిలాంటి ఎందరికో కనువిప్పు కలిగించింది. చీకట్లో కూరుకుపోయిన తన జీవితాన్ని, భవిష్యత్తును ఇప్పుడు వెలుగులతో కొత్త ప్రపంచాన్ని చూస్తున్నది విశాఖ షిర్కే. వయసు పదిహేడేళ్లు.. చదువుతున్నది పదో తరగతి. ఉండేది ముంబైలోని సుబుర్బ్ జోగేశ్వరి ప్రాంతం. తండ్రి పెడుతున్న హింసను భరించలేక సామాజిక కార్యకర్త దుర్గాను సంప్రదించింది. బడి మాన్పించి బతుకును ఆగం చేయాలనుకున్న తండ్రికి బుద్ధి చెప్పింది. మూడేళ్ల కిందట బడి మానేసి అప్పటి నుంచి పోరాటం చేస్తూ గెలిచింది. పదో తరగతి బోర్డ్ పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యింది. ఉన్నత చదువుతో భవిష్యత్తు బంగారుమయం అవుతుందనే నమ్మకంతో అడుగులు వేస్తున్నది.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi





**సినిమా తీయడమంటే మాటలు కాదు. ప్రతీ ఫ్రేమ్ అందంగా చూపించాలి. అలా రావాంటే ఫ్రేమ్‌లో ఉన్న వ్యక్తి కాలానుగుణంగా కనిపించాలి. అలా కనిపించాలంటే స్క్రిప్ట్‌లోని ఎమోషన్, సందర్భం, లొకేషన్‌ను బట్టి కాస్ట్యూమ్స్ ఉండాలి. వేషధారణ అంతా కరెక్ట్‌గా ఉంటేనే.. సీన్ పండుతుంది. ఇలా డైరెక్టర్, నటులు, కెమెరామన్‌తో పాటు.. ప్రతి ఫ్రేమ్‌లోనూ కాస్ట్యూమర్ పనితనం కనిపిస్తుంది. అంతలా కష్టపడితేనే సినిమా నిలుస్తుంది. ఇంతటి రిస్క్ ఉన్న కాస్ట్యూమ్ డిజైనింగ్‌లో.. తనదైన ముద్ర వేసింది కృష్ణశాంతి. తాజాగా విడుదలైన 'అ!' సినిమాలో తన కష్టం కనిపించింది. ఇక త్వరలో రానున్న రంగస్థలాన్ని తన చేతులతోనే అలంకరించిన కృష్ణశాంతితో 'జిందగీ' ముచ్చట్లు.!!**

**'అ!' సినిమాలో నటీనటుల కాస్ట్యూమ్స్ ఎలా ఉండాలనే చర్చలో.. కృష్ణశాంతి గీసిన బొమ్మలు. ఈ బొమ్మల ఆధారంగానే వారికి కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. దీంతో ఆ క్యారెక్టర్స్‌కు డిఫరెంట్ లుక్ వచ్చింది.**

# (అ!)లంకరణ శాంతి!

వంగవీటి సినిమా చిత్రీకరణకు ముందు.. ఢిల్లీ నుంచి ముగ్గురు కాస్ట్యూమ్ డిజైనర్లను పిలిపించారు డైరెక్టర్ రాంగోపాల్ వర్మ. ప్రతీ ఫ్రేమ్ గురించి కొత్తగా ఆలోచించే వర్మకు.. వాళ్లు దుస్తులకు సంబంధించి ఇస్తున్న సలహాలు, సూచనలు, డమ్మీగా నెట్‌లో చూపిస్తున్న కాస్ట్యూమ్స్ నచ్చడం లేదు. వెంటనే కో డైరెక్టర్‌కు కాల్ చేసి.. 'కృష్ణశాంతిని అర్జెంట్‌గా ఆఫీస్‌కు రమ్మని చెప్పండి' అన్నాడు వర్మ. అంతకు ముందే ఆమె పనితనం వర్మకు తెలియడంతో.. వెంటనే వెళ్లి వర్మతో స్క్రిప్ట్ గురించి తెలుసుకొన్నది. తాను కొన్ని విషయాలు చెబుతుంటే.. అప్పటికప్పుడే తన లుక్‌బుక్‌లో స్కెచ్ వేసింది. 'ఇలా ఉంటే సరిపోతుందా సార్' అన్నది. 'ఎస్.. నాకు ఇలాంటిదే కావాలి ఈసారి కూడా నువ్వే కాస్ట్యూమ్ డిజైనర్' అన్నాడు వర్మ. అతని దగ్గర కొంచెం సమయం తీసుకొని విజయవాడకు పయనమైంది శాంతి. 1980లో వంగవీటి రంగా, అతని ప్రత్యర్థులు, స్నేహితులు, సన్నిహితులు ఎలా ఉండేవారు? ఎలాంటి దుస్తులు, ఆభరణాలు ధరించేవారు? ఆ కాలంలో విజయవాడలో ట్రెండ్ ఎలా ఉన్నది? ఇలాంటి విషయాలన్నీ తెలుసుకున్నది. తెలిసినవారి ద్వారా ఫొటోలు సేకరించింది. కట్ చేస్తే.. వంగవీటి సినిమా చూస్తున్నంత సేపూ.. 1980లో ఉన్నట్లే అనిపించింది ప్రేక్షకులకు. తనకు అప్పజెప్పిన పనిని విజయవంతంగా ముగించడానికి ఇంతలా రీసెర్చ్ చేస్తుంది కృష్ణశాంతి. ఆ కష్టమే తనను రంగస్థలం సినిమాకు పరిచయం చేసింది.

### అధ్యయనమే శాంతి సక్సెస్..

అవును అధ్యయనం లేకుండా కృష్ణశాంతి ఏ పనీ అంత త్వరగా ఒప్పుకోదు. ఒక్కసారి ఒప్పుకున్నదంటే ఆ పని విజయవంతంగా ముగించాల్సిందే. చిన్నప్పటి నుంచీ తన కుటుంబసభ్యుల ద్వారా కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న శాంతి.. ఉన్నత స్థానానికి ఎదిగినా కూడా తన పనిపై అధ్యయనం మానలేదు. ఇక రంగస్థలం సినిమా కోసం.. ఏకంగా నాలుగు వేలకు పైగా ఫొటోలను సేకరించారంటే.. ఒక సినిమా కోసం ఆమె ఎంతలా గ్రౌండ్‌వర్క్ చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని నెలల పాటు ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతీ పల్లెను దర్శించి.. వారి వేషధారణ ఎలా ఉంటుందో అధ్యయనం చేసింది. రామ్‌చరణ్, అతని అక్క, హీరోయిన్ సమంత, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్టులు వారంతా 1985లో ఎలా ఉండేవారో.. ఎలాంటి దుస్తులు ఎంచుకునేవారు, అలంకరణ.. వంటివన్నీ తెలుసుకొని అందుకు తగ్గట్లుగా కాస్ట్యూమ్స్ డిజైన్ చేసింది. రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాల్లో తిరిగి పాత ఫొటోలు, వస్తువులూ, చీరెలూ, గాజులూ, చెవిపోగులూ, ఉంగరాలు.. ఒకటేమిటి అన్ని నమూనాలనూ తీసుకున్నది.



**వర్మనే మెప్పించింది..!**

24క్రాఫ్ట్స్‌లో ఏ విభాగంలోనైనా కొత్తవాళ్ల ప్రతిభను ఎంకరేజ్ చేసే డైరెక్టర్ రాంగోపాల్ వర్మ. నిఫ్ట్‌లో ఫైనలియర్ చదువుతున్నప్పుడు.. 'కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం.. అప్పల్రాజు' అనే సినిమా కోసం ఓ డిజైనర్‌ని ఆయన వెతుకుతున్నారని తెలిసిందట. అసలు కాస్ట్యూమ్ డిజైనింగ్‌పై అవగాహన లేకపోయినా.. వెళ్లి ఆయనతో మాట్లాడింది కృష్ణశాంతి. స్క్రిప్ట్‌కు సంబంధించి హీరో, హీరోయిన్ వేషధారణ ఇలా ఉండాలి అని చెబుతుండగా.. స్కెచ్ వేసి చూపించింది. కాస్ట్యూమ్స్‌కు సంబంధించి కొన్ని సలహాలు, సూచనలు కూడా ఇచ్చింది. అంతే.. వర్మకు తన పని నచ్చేసింది. అప్పల్రాజు సినిమాకు పూర్తిస్థాయిలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసి తానేంటో నిరూపించుకున్నది శాంతి.

### కృష్ణశాంతి.. లోకల్!

చిన్నప్పటి నుంచే బొమ్మలు గీయడంలో కృష్ణశాంతి దిట్ట. తన స్కూల్‌డేస్‌లో డ్రాయింగ్‌లో తనే ఫస్ట్. ఏ బొమ్మ అయిన చాలా సులువుగా గీసెయ్యగలదు. అలా గొప్ప ఆర్టిస్ట్ అవ్వాలని, అది కూడా హైదరాబాద్ జెఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ చేయాలని ఆరో తరగతిలోనే నిర్ణయించుకున్నది. కుటుంబ నేపథ్యం మొత్తం హైదరాబాదే కావడం శాంతికి కలిసివచ్చింది. నాన్న ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తుంటారు, అమ్మ గౌతమ్ స్కూళ్లలో డీన్‌గా పనిచేస్తున్నది. తాతయ్య, బాబాయిలూ ఉన్నత ఉద్యోగాల్లోనే ఉన్నారు. అంతా చదువుకున్న కుటుంబం కావడంతో.. తన కెరీర్ విషయంలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అలా ఇంట్లో తల్లిదండ్రులు, తాతయ్య, బాబాయిల సహకారంతో ఎన్నో డ్రాయింగ్, ఆర్ట్స్ కాంపిటీషన్లలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నది. తన నిర్ణయాన్ని గౌరవించే తల్లిదండ్రులు ఫైన్ ఆర్ట్స్ చేయించడంతో శాంతి ప్రతిభ వెలుగులోకి వచ్చింది. ఎంట్రెన్స్‌లోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించింది. ఆర్టిస్ట్ అవ్వాలనుకొని తీరా.. నిఫ్ట్‌లో డిజైనింగ్ చేసి, ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడింది. తన సొంత ఆలోచనలతో కష్టపడి ఈ స్థానానికి చేరుకున్నది.



**అ! సినిమా ఫస్ట్‌లుక్‌లో నటీనటుల కాస్ట్యూమ్స్ చూసిన డైరెక్టర్ రాజమౌళి.. కృష్ణశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఆ సందర్భాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అంటున్నది శాంతి.**



**కాస్ట్యూమ్ డిజైనింగ్ చాలా కష్టం..**

'కాస్ట్యూమ్ డిజైనింగ్‌లో ఎంతో కష్టం ఉంటుంది. ఆ కష్టాన్ని వెండితెర చెరిపేస్తుంది. చివరి నిమిషంలో కూడా మార్పులు చేయాలి. నటులకు నప్పే రంగులూ, వస్తువులను ఒక్కోసారి ప్రత్యేకంగా తయారు చేయించుకోవాలి. అందుకే నేను రీసెర్చ్ చేస్తుంటా. కొత్తగా డిజైనింగ్ రంగంలోకి రావాలనుకునేవాళ్లకు అవకాశాలు వస్తూనే ఉంటాయి. అయితే వారు కొత్త ఆలోచనలో రావాలి. కాపీలు కొడితే ఎక్కువకాలం ఇండస్ట్రీలో ఉండలేరు. నా ఎదుగుదలకు కారణం కుటుంబసభ్యులు, నా టీం సహకారం. మావారే నా క్రిటిక్. ఏదైనా ముక్కుసూటిగా చెప్పేస్తాడు' అంటున్నది శాంతి.

### విభిన్నంగా చూపించడంలో దిట్ట..!

సినిమాలో నటీనటులను భిన్నంగా చూపించడంలో కొత్తగా ఆలోచిస్తుంది శాంతి. ఇందుకు ఉదాహరణే మొన్న చూసిన 'అ!', రేపు చూడబోయే 'రంగస్థలం' సినిమాలు. 'అ!' సినిమాకు ఎన్ని మార్కులు పడ్డాయో నటీనటుల వేషధారణకు అన్నే వచ్చాయి. ఎందుకంటే ఈ సినిమాలో ప్రతీ పాత్రలోనూ కొత్తదనం కనిపిస్తుంది. రెజీనాను ప్రేక్షకులు ఊహించని విధంగా తయారు చేస్తే.. కాజల్ సింప్లీ సూపర్బ్ లుక్‌లో ఆకట్టుకున్నది. ఇక అవసరాల శ్రీనివాస్ గెటప్ అదుర్స్. సినిమా క్లైమాక్స్‌లో అన్ని పాత్రల్లోనూ కాజల్ కనిపిస్తుంది. అలా కాజల్ తగ్గట్టుగా అన్ని పాత్రలూ, అన్ని పాత్రల్లోనూ కాజల్ కనిపించే వేషధారణ సినిమాకే హైలెట్. ఇలా అందరూ మెచ్చేవిధంగా తీర్చిదిద్దిన ఘనత కాస్ట్యూమ్ డిజైనర్ కృష్ణశాంతిది. తాను డిజైనర్‌గా చేసిన అన్ని సినిమాల్లో కెల్లా.. అతికష్టమైన సినిమా 'అ!'.

### 'స్కెచ్' వేస్తే పడిపోవాల్సిందే!

తన లక్ష్యాన్ని మనసులో స్పష్టంగా విజువలైజ్ చేసుకుంటే.. అనుకున్నది అనుకున్నట్టుగా స్కెచ్ వేయడం శాంతిలోని గొప్పతనం. ఎవరైనా డైరెక్టర్ తనకు కథ, కథా వస్తువులను చెబుతుంటే.. పాత్రను అర్థం చేసుకొని, కొన్ని క్షణాలు కళ్లు మూసుకొని వాటిని విజువలైజ్ చేసుకుంటూ స్కెచ్ వేస్తుంది. డైరెక్టర్‌కు ఏది కావాలో అదే తన కాస్ట్యూమ్స్‌లో చూపిస్తుంది. మొదటి సినిమాలో తన ప్రతిభ చూపిన కృష్ణశాంతికి.. వరుసగా పదుల సంఖ్యలో సినిమా అవకాశాలు పలకరించాయి. అలా ఎనిమిదేళ్లుగా సినిమానే తన ప్రపంచం అయిపోయింది. ఇప్పటికీ తన చేతిలో కొన్ని సినిమాలున్నాయి. అ!, ఊ కొడతారా ఉలిక్కి పడతారా, మిస్టర్ నూకయ్య, రొటీన్ లవ్‌స్టోరీ, ఎటాక్, వంగవీటి వంటి సినిమాలు మంచి గుర్తింపునిచ్చాయి. లక్ష్యాన్ని చేరుకోవడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలూ సద్వినియోగం చేసుకుంటూ.. తన జీవితానికి రహదారిని ఏర్పాటు చేసుకున్నది శాంతి. ఫ్యాషన్ డిజైనింగ్ స్టూడియో కూడా ఏర్పాటు చేసుకున్నది. మరో పక్క ఎన్ఆర్ఐలకూ, డబ్బులు ఉన్నా షాపింగ్ చేసే సమయంలేని వారికి పెళ్లి వార్డ్‌రోబ్‌లు సిద్ధం చేయడం శాంతి ప్రత్యేకత. యుక్తవయసులోనే తనకు నచ్చిన రంగంలో రాణిస్తున్న కృష్ణశాంతి మంచి సినిమాలకు పనిచేయాలని మనమూ కోరుకుందాం.

**రవికుమార్ తోటపల్లి**

## బహుమతిగా కోడిపుంజు



**కోడిపుంజు, కోడిపెట్ట ఇస్తే ఏం చేస్తాం? కోసుకొని తింటం. దావత్ చేసుకుంటం. పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్తున్న కోళ్లను అక్కడి విద్యార్థులు ఏం చేస్తున్నారో తెలుసా?**

బాలికావిద్యను ప్రోత్సహించే క్రమంలో పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన ఓ వినూత్న కార్యక్రమం ఇది. ఆరవ తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థినులకు నాలుగు కోడిపెట్టెలు, ఓ కోడిపుంజు, ఓ పంజరం ఇస్తున్నది. వాటి బాగోగులు చూస్తూ వాటిపై రిపోర్ట్ చేయడానికి ఒక ఫామ్ ఇస్తారు. ఆ రిపోర్ట్ సంబంధిత టీచర్లకు చూపించాలని ఆదేశాలు జారీ చేశారు. దీన్ని వృత్తి విద్యలో భాగం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు అక్కడి విద్యాశాఖ అధికారులు. పిల్లల భవిష్యత్తులను దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థినులకు పౌల్ట్రీ ఫామ్ మెయింటెనెన్స్ మీద ఓ ప్రాథమిక అవగాహన ఏర్పడడం కోసం, ఈ అవగాహన భవిష్యత్తులో ఆ రంగం వైపు అడుగేసి వ్యాపారం చేయడానికి ఉపయోగపడుతుందని ఈ పథకాన్ని తీసుకొచ్చారు. అంతేకాదు ఆ కోళ్లు పెట్టే గుడ్లు తినడం ద్వారా సదరు విద్యార్థినికి పౌష్టికాహారం లభిస్తుంది. వంటింట్లో వృథా అయిన ఆహారపదార్థాలు కోళ్లకు దాణాగా ఉపయోగించడం వల్ల సహజ వనరుల వేస్టేజ్‌ను అరికట్టడం అంశాన్ని నేర్చుకుంటారు. ఒక్క పథకం ఎన్నో అంశాల్లో అవగాహన పెంచబోతుంది. రేపటితరం కోసం ఇలాంటి పథకాలు రావాలి.

## హోలీ రంగు పోవాలంటే..



**అందరూ రెండు రోజులు హోలీ రంగుల్లో మునిగి తేలారా? రంగుల ప్రపంచంలో కేరింతలు కొట్టారా? ఇష్టమైన వారికి రంగులు పూస్తూ.. పూసుకుంటూ ఎంజాయ్ చేశారా? మరి ఈ రెండు రోజులు రకరకాల రంగుల్లో మీ జుట్టు ఎలా మారిపోయిందో.. జుట్టుకు ఎంత రంగు పట్టిందో కదా! మరి ఆ రంగును వదిలించుకొని.. జుట్టును కాపాడుకోవాలంటే ఏం చేయాలి?**

- హోలీ ఆడడానికి వెళ్లే ముందే జుట్టుకు బాగా ఆయిల్ రాయాలి. ఒకవేళ అలా చేయడం మరిచిపోతే.. స్నానం చేసిన తర్వాతైనా పర్లేదు. జుట్టుకు నూనె రాసి మర్దన చేయండి. మరుసటిరోజు బాగా కడిగితే.. జుట్టుకు అంటుకున్న రంగులతో పాటు.. మాడుకు అంటుకున్న రంగులు కూడా పోతాయి.
- రంగోలి ఆడడానికి బయల్దేరేముందే జుట్టును దగ్గరికి ముడివేయాలి. అలా చేస్తే.. రంగు జుట్టు కుదుళ్లలోకి వెళ్లదు. అలా చేసిన తర్వాత కూడా జుట్టు కుదుళ్లకు రంగు పోతే.. స్నానం చేసిన తర్వాత జుట్టును బాగా ఆరబెట్టండి. లూజుగా వదిలేయండి.
- షాంపూతో స్నానం చేసేటప్పుడు ముందు జుట్టును బాగా కడుగండి. షాంపూ నేరుగా జుట్టుకు పట్టించడం మంచిది కాదు.
- తలస్నానం చేసిన తర్వాత జుట్టు కుదుళ్లకు నిమ్మరసం పట్టించండి. కుదుళ్లలో చిక్కుకుపోయిన రంగుల తాలూకు గాఢతను, ప్రభావాన్ని నిమ్మరసం తగ్గిస్తుంది. నిమ్మరసం రాసుకున్న తర్వాత అది ఆరేంత వరకు ఎట్టి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లకూడదు.

## హిజాబ్‌తో బాడీబిల్డింగ్!!



**బాడీ బిల్డింగ్ పోటీలంటే.. కండలు తిరిగిన దేహం.. చేతి, కాలి కండరాలు కనిపిస్తేనే మార్కులు వేస్తారు. కాలి నుంచి తల వరకూ శరీరం మొత్తం హిజాబ్ ధరించి పోటీల్లో పాల్గొంటే..? ఆ పోటీల్లో బంగారు పతకం సాధిస్తే..?**

ఇంకా సందేహం ఏం లేదండోయ్.. హిజాబ్ ధరించే పోటీల్లో పాల్గొని.. ఏకంగా గోల్డ్ మెడల్ కొట్టేసింది ఈ కేరళ అమ్మాయి. పేరు మజిజియా భాను. కేరళ రాష్ట్రం కోజికోడ్‌లోని ఓర్కట్టెరికి చెందిన మజిజియా తాజాగా కొచిలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. మహిళా బాడీ బిల్డింగ్ పోటీలంటేనే బికినీ, జాకెట్ ధరించి తమ దేహాన్ని ప్రదర్శించాలి. అలాంటి పోటీల్లో కాలి నుంచి తల వరకూ హిజాబ్ ధరించి.. తన బాడీ ప్రదర్శనతో అందర్నీ మంత్రముగ్దుల్ని చేసింది 23 ఏండ్ల మజిజియా భాను. తాను ఈ పోటీల్లో పాల్గొనేందుకు కాబోయే భర్త, కుటుంబ సభ్యుల సహకారం మరువులేనిదంటున్నది భాను. తన మతాన్ని గౌరవిస్తూనే ఈ హిజాబ్ ధరించి పోటీల్లో పాల్గొన్నట్లు చెబుతున్నది. భాను బాడీ బిల్డింగే కాదు.. పవర్ లిఫ్టింగ్‌లోనూ ప్రవీణురాలే. గతంలో కోజికోడ్‌లో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచి 'ది బెస్ట్ లిఫ్టర్ ఆఫ్ కేరళ' టైటిల్‌ను గెలుచుకున్నది. పవర్‌లిఫ్టింగ్ నుంచి బాడీ బిల్డింగ్‌కు బాటలు వేసుకొని బంగారు పతకాలు కొల్లగొడుతున్నది.

నమస్తే తెలంగాణ
నిధి
[ హైదరాబాద్ ]
శనివారం 03 మార్చి 2018

# దీర్ఘకాలంలో లాభాలు..

## ఆదిత్యా బిర్లాలైఫ్ రిసర్జెంట్ ఇండియా ఫండ్- సీరీస్ 6

ఆదిత్యా బిర్లా సన్‌లైన్ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఆదిత్యా బిర్లా సన్‌లైన్ రిసర్జెంట్ ఇండియా ఫండ్- సీరీస్ 6 క్లోజ్ ఎండెండ్ పథకాన్ని ప్రారంభించింది. వ్యవధి మూడున్నరేండ్లుగా నిర్ణయించింది. కొత్త ఫండ్ ఆఫర్ ఫ్రిబవరి 21 నుంచి మార్చి ఏడు లోపు అందుబాటులో ఉంటుంది. ఒక్కో యూనిట్ ధర.. పది రూపాయలు.

భారత ఆర్థిక వ్యవస్థ గాడిలో పడితే.. కొన్ని రంగాలు మెరుగైన పనితీరును కనబరుస్తాయి. అలాంటి కంపెనీలను గుర్తించి.. అందులో పెట్టుబడులు పెడితే.. మంచి లాభాలను అందుకోవడానికి ఆస్కారమున్నది. కాకపోతే, అలా అభివృద్ధి చెందడానికి ఆస్కారమున్న సంస్థలను గుర్తించి.. అందులో పెట్టుబడులు పెట్టాలి. అప్పుడే, ఆశించిన లాభాలు చేతికందుతాయి. మరి, ఈక్విటీ మార్కెట్‌ను పునరుజ్జీవం కలిగించేవి గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో సంబంధమున్న సంస్థలను గుర్తించి




వాటిలో ఆదిత్యా బిర్లాలైఫ్ రిసర్జెంట్ ఇండియా ఫండ్- సీరీస్ 6 పెట్టుబడి పెడుతుంది. వాటిలో పెట్టుబడులు పెడితే.. దీర్ఘకాలంలో మంచి ప్రయోజనాలు లభిస్తాయని.. ఈ క్రమంలోనే తాజా ఫండ్‌కు శ్రీకారం చుట్టామని ఆదిత్యా బిర్లా లైఫ్ ఫండ్ వెల్లడించింది. సుమారు ఎనభై నుంచి వంద శాతం మేరకు నిధులను ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో నిధుల్ని కేటాయిస్తుంది. మనీ మార్కెట్లో ఇరవై శాతం దాకా ఫండ్ మేనేజర్లు కేటాయిస్తారు. మూడున్నరేండ్లలోపు మంచి లాభాలను అందుకోవాలని ఆశించే మదుపరులకు ఈ ఫండ్ చక్కగా పనికొస్తుందని సంస్థ చెబుతున్నది.

ఈ పథకంలో రెగ్యులర్ ప్లాన్, డైరెక్టర్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. రెండింట్లోనూ గ్రోత్ మరియు డివిడెండ్ ఆప్షన్ ఉన్నట్లు సంస్థ చెబుతోంది. ఈ ఫండ్‌ను సత్యబ్రతా మోహంతీ, మిలింద్ బఫ్నాలు నిర్వహిస్తున్నారు. ఈ ఫండ్ ఎన్‌ఎస్‌ఈ/బీఎస్‌ఈ లో నమోదు అవుతుంది. యూనిట్లను కేటాయించిన ఐదు రోజుల తర్వాతే ప్రప్రథమ ఎన్‌ఏవీని లెక్కించి ప్రకటిస్తారు. దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు పెట్టేవారికి ఈ పథకం చక్కగా నప్పుతుందని ఆదిత్యా బిర్లా లైఫ్ ఫండ్ చెబుతున్నది.

# ఆలస్యం.. అమృతం.. విషం!



**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుంజుకున్న నేపథ్యంలో మనుష్యుల జీవన విధానంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఇంజినీరింగ్ పూర్తి కాగానే ఐటీ సంస్థల్లో చేరే వారి సంఖ్య పెరుగుతున్నది. లేకపోతే, ఇతరత్రా నైపుణ్యాలను పెంపొందించుకుని నేటి తరం యువత మంచి ఉద్యోగాన్ని సంపాదిస్తున్నారు. అందులో కొందరు జల్సాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఒకప్పుడు పొదుపు మీద దృష్టి పెట్టేవారు.. ప్రస్తుతం ఖర్చు మీదే ఆసక్తి చూపెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అధిక శాతం మంది అప్పుల భారిన పడుతున్నారు.**

ఆర్థిక ప్రణాళికలపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్నారు. తనపై ఆధారపడ్డ కుటుంబానికి సరైన భద్రత, భరోసాను ఇవ్వడంలో విఫలమవుతున్నారు. ఆర్థిక విషయాలకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన లేకపోవడమే కాకుండా ఆర్థిక విషయాలను తప్పుగా అర్థం చేసుకోవడమో ప్రధాన కారణమని చెప్పొచ్చు. పెళ్లి కాక ముందే నెలకు ఎంతో కొంత మదుపు చేయడం వల్ల ఒనగూడే ప్రయోజనాలు చాలామందికి తెలియవు. ఉదాహరణకు, అశోక్ మెడిసిన్ పూర్తి కాగానే డాక్టర్‌గా ఒక ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాడనుకుందాం. తను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నెలకు వెయ్యి రూపాయలు చొప్పున, 35 ఏండ్ల పాటు మదుపు చేస్తే.. చేతికి అక్షరాల రూ. 65 లక్షలు చేతికొస్తుంది. అదే ముప్పయ్యేండ్ల వయసులో నెలకు రూ.1000 చొప్పున పొదుపు చేస్తే



మాత్రం.. పదవీవిరమణ నాటికి చేతికొచ్చేది రూ.35 లక్షలే. కేవలం ఐదేండ్లు వాయిదా వేయడం వల్ల ముప్పయ్ లక్షల మేరకు సొమ్ము మదుపు చేసే అవకాశాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. ఔను, నెలకు రూ.1000 మదుపు చేయటాన్ని వాయిదా వేయడం వల్ల జరిగే నష్టం అంత భారీగా ఉంటుందన్నమాట. ఇలాంటి కీలకమైన విషయం అర్థం చేసుకోకుండా మనలో చాలామంది ఆర్థిక ప్రణాళికలను నిత్యం వాయిదా వేస్తూ వస్తారు. ఆతర్వాత, కళ్లు తెరుచుకున్నా ఉపయోగముండదు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. పిల్లలకు ఉన్నత విద్య, వైద్యం, వారి పెళ్లిళ్లు, ఇల్లు కొనడం, ప్రయాణాలు వంటి వాటి వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆతర్వాత, కష్టాలు మరింత రెట్టింపు అవుతాయ్! రిటైర్ అయ్యేనాటికి చేతిలో పెద్దగా కార్పస్ ఉండదు. అయితే, మనం నెలకు ఓ ఐదు వేల రూపాయలు మదుపు చేయడాన్ని వాయిదా వేయడం వల్ల కలిగే నష్టం ఎంతుంటుందో ఒకసారి పట్టికలో చూద్దామా..



పెద్ది శ్రీనివాస్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, జెన్ సెక్యూరిటీస్

| వయసు | 60 ఏండ్లకు కార్పస్ | ఆలస్యమైతే | ఎంత నష్టం? |
|---|---|---|---|
| 25 | 3.24 కోట్లు | – | – |
| 26 | 2.87 | ఏడాది | 37 లక్షలు |
| 27 | 2.54 | రెండేండ్లు | 70 లక్షలు |
| 28 | 2.25 | మూడేండ్లు | 99 లక్షలు |
| 30 | 1.76 కోట్లు | ఐదేండ్లు | 1.48 కోట్లు |

పైన పేర్కొన్న ఉదాహరణను గమనిస్తే.. నెలకు రూ.5,000 చొప్పున మదుపు చేయడాన్ని ఏడాది పాటు వాయిదా వేయడం వల్ల, ఎంతలేదన్నా రూ.37 లక్షల మేరకు కోల్పోతున్నాం. ఓ ఐదేండ్లు వాయిదా వేస్తే.. రూ.1.48 కోట్లు సంపాదించుకునే అవకాశాన్ని కోల్పోతాం. కాబట్టి, పిల్లల చదువు, ఉన్నత విద్య, పెళ్లి, ఇల్లు కొనడం వంటివన్నీ పక్కాగా జరగాలంటే.. మదుపు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరిచిపోవద్దు.

### అవసరాలు, కోరికల మధ్య తేడా?

పొదుపు, మదుపు చేయాలనే ఆలోచనలున్నప్పటికీ, చాలామంది వద్ద తగినంత సొమ్ము ఉండకపోవచ్చు. ఆదాయాన్ని మించిన ఖర్చులుండటం వల్ల ఇలా అవుతుంటుంది. ఈ స్థితి నుంచి బయటపడాలంటే ఆర్థిక వ్యవహారాల్లో క్రమశిక్షణను అలవర్చుకోవాలి. అవసరాలు, కోరికల మధ్య తేడా తెలుసుకోవాలి. జీవితంలో అత్యవసరం అనుకున్నవాటి మీదే దృష్టి సారించాలి. ఉదాహరణకు, ప్రస్తుత పరిస్థితుల్లో కొందరికి కారు అవసరమే అవ్వొచ్చు. అందుకు సాధారణ కారు తీసుకుంటే సరిపోతుంది. అలాకాకుండా, లగ్జరీ కారు తీసుకోవడం వల్లే అసలు సమస్య మొదలవుతుంది. కాబట్టి, ఖర్చు చేసేటప్పుడు అవసరం, కోరికల మధ్య గల వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలి. అప్పుడే, ఆర్థిక క్రమశిక్షణ పెరిగి, భవిష్యత్తు కోసం సొమ్ము దాచుకోవాలన్న ఆలోచనలు కలుగుతాయి. ప్రస్తుతం చేసే ఖర్చులను కొంత నియంత్రించుకోగలిగితే.. రేపటి అత్యవసరాలకు అక్కరకొస్తుందని గుర్తుంచుకోవాలి.

### బడ్జెట్ సిద్ధం చేయాలి


వేతనజీవులైనా, వ్యాపారులైనా తమ ఇంటి బడ్జెట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. రోజువారి చేసే ఖర్చుల గురించి తప్పకుండా రాసుకోవాలి. మనలో చాలామందికి ఖర్చుల గురించి ముందుగా అనుకుంటారే తప్ప.. ప్రతిరోజూ చేసే ఖర్చులను మాత్రం రాసుకోరు. చేతికొచ్చే జీతం, ఖర్చులను నెల చివర్లో ఒకసారి బేరీజు వేసుకుంటే.. మదుపుపై కొంత అవగాహన కలుగుతుంది. మనలో చాలామంది కుటుంబంతో కలిసి డిన్నర్‌కు వెళ్లాలనుకుంటారు. లేదా సినిమా చూడాలనుకుంటారు. వీటికి తప్పకుండా వెళ్లాల్సిందే. కాకపోతే, మన బడ్జెట్ ప్రకారమే ప్రణాళికలు రచించుకుంటే ఉత్తమం అని గుర్తుంచుకోవాలి.

### రుణం వద్దు.. మదుపు ముదు

సరైన ఆర్థిక ప్రణాళికల్లేకపోవడమో లేదా పెట్టుబడులను నిర్ణీత గడువు లోపు పెట్టకపోవడం వల్ల అనేకసార్లు మన ఇంటి బడ్జెట్ తలకిందులౌతుంది. ఈ క్రమంలో వ్యక్తిగత రుణం తీసుకోవడమో లేదా క్రెడిట్ కార్డులను అధికంగా వినియోగించడమో చేస్తాం. కొందరైతే, పాత అప్పుల్ని తీర్చడానికి కొత్త అప్పులు తీసుకుంటారు. ఫలితంగా, కొన్నాళ్లకు అప్పులపాలవుతారు. ఇలాంటి అంశాలను ముందే గుర్తించి.. అడ్డుకట్ట వేయాలి. లేకపోతే, కుటుంబం రోడ్డు మీద పడుతుంది. ఉదాహరణకు, చిన్నారుల విద్య కోసం పదేండ్లలోపు మీకు ఐదు లక్షలు అవసరమని అనుకుందాం. అయితే, ప్రస్తుతమున్న ఖర్చుల నేపథ్యంలో, ఈ విషయాన్ని పక్కన పెట్టేశారనుకుందాం. అయితే, మీ చిన్నారులు పెద్దయ్యేసరికి వారికి చదువులు చెప్పించాలంటే తప్పకుండా రుణానికి వెళ్లాల్సిందే. ఐదు లక్షల రుణాన్ని పదిహేను శాతం వార్షిక వడ్డీ చొప్పున తీర్చాలంటే.. నెలకు రూ.8,066 కట్టాల్సి ఉంటుంది. ఇదే మొత్తం కోసం ఈక్విటీ మ్యుచువల్ ఫండ్లలో నెలకు రూ.2,152 మదుపు చేస్తే సరిపోతుంది. భవిష్యత్తులో అక్కరకొస్తుందంటే.. అధిక లాభం వస్తుందంటే.. విద్యా, గృహ, వ్యాపార రుణాలు వంటివి ఉత్తమం అని చెప్పొచ్చు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

**( ఉదాహరణలు కేవలం అవగాహన కోసమే. ఈక్విటీ మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనవుతుంది. )**

## హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ గ్యారెంటీడ్ ప్లాన్



# రేపు రిటైర్మెంట్.. ప్రణాళిక నేడే!

పదవీవిరమణకు కాస్త ముందుగానే ఆర్థిక ప్రణాళికలను రచించేవారికి అక్కరకొచ్చేలా హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కొత్తగా ''పెన్షన్ గ్యారెంట్ ప్లాన్'' పథకానికి శ్రీకారం చుట్టింది. ఇది సింగిల్ ప్రీమియం యాన్యుటీ పథకం. సాధారణంగా దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రణాళికలు రచించేవారు, పదవీవిరమణ గురించి పూర్తిగా విస్మరిస్తారు. యాభై, యాభై ఐదు ఏండ్లు వస్తే తప్ప.. పదవీవిరమణ తర్వాత ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించరు. ప్రస్తుతం మనదేశంలో వైద్య విధానంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చేసింది. ఫలితంగా, గతంతో పోల్చితే ప్రస్తుతం ప్రజలు ఎక్కువకాలం జీవిస్తున్నారు. అంటే, పదవీ విరమణ పొందిన తర్వాత కూడా పెద్దలు అధిక కాలం జీవిస్తున్నారు. ఈ క్రమంలో పదవీవిరమణ ప్రణాళిక అత్యంత కీలకంగా మారింది.

- సామాజిక భద్రత కనుమరుగైన నేపథ్యంలో, పదవీవిరమణ పొందినవారికి క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందించేవి యాన్యుటీ ప్లాన్లు అని గుర్తుంచుకోండి. ఈ పథకంలో సొమ్ము పెట్టిన తర్వాత క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందుకోవచ్చు. ఇవి సాధారణంగా పదవీవిరమణ పొందినవారికి లేక అతిత్వరలో రిటైర్ అయ్యేవారికి అతికినట్లు సరిపోతాయి. డిఫర్డ్ యాన్యుటీ ఆప్షన్లు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. కాకపోతే, పదవీవిరమణ కోసం ముందస్తుగా ప్రణాళికలు రచించేవారికి ఇది అక్కరకొస్తుంది.
- మార్కెట్ ఒడుదొడుకులకు లోనవ్వడంతో పాటు వడ్డీ రేట్లు తగ్గముఖం పడుతున్నాయి. దీంతో యాన్యుటీ రేట్లను అంచనా వేయడం కాస్త కష్టమే. ఈ నేపథ్యంలో, డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్ తీసుకున్నా.. కచ్చితంగా యాన్యుటీ రేట్లను అందజేస్తుంది. పైగా, కొనుగోలు చేసినప్పుడే, వాటిని అందుకోవచ్చు. దీర్ఘకాలం లాభాల కోసం కాస్త ముందస్తుగానే ప్రణాళికను రచించేవారికి ఈ ప్లాన్ చక్కగా ఉపయోగపడుతుంది. అంటే, పాలసీని ఎంచుకున్నప్పుడే.. ఓ పదేండ్ల తర్వాత మీకు అందాల్సిన యాన్యుటీ రేటును నిర్ణయిస్తారు. కాకపోతే, ఆ సొమ్మును నెలకు అందుకోవాలా? మూడు నెలలకా? ఆరు నెలలకోసారా? లేక ఏడాదికా అనే విషయాన్ని పాలసీ తీసుకున్నప్పుడే నిర్ణయించుకోవచ్చు. పథకం ద్వారా వచ్చే ప్రయోజనాలను భార్యకూ బదిలీ చేయడానికి పాలసీ అంగీకరిస్తుంది.

### రేపటి రేటు.. నేడే తెలుసుకోవచ్చు..

మేం అందిస్తున్న వినూత్న పథకమిది. భవిష్యత్తులో వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టినా యాన్యుటీ మాత్రం ప్రస్తుతమున్న ధరకే అందుతాయి. పదవీవిరమణ పొందినవారు ప్రశాంతమైన జీవనం గడపటానికి ఈ పెన్షన్ గ్యారెంటీడ్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టాం. యాన్యుటీ రేట్లను తెలుసుకోవడానికి ఎవరైనా రిటైర్మెంట్ వరకూ వేచి చూడక్కర్లేదు. ఇది ఎంతలేదన్నా పదమూడు శాతం దాకా ఉండొచ్చు.

**- శ్రీనివాసన్ పార్థసారధి, సీనియర్ ఈవీపీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్**

# మత్తులో ప్రమాదం.. పరిహారం ఇస్తారా?



మద్యం తాగి వాహనం నడిపితే జరిగే అనర్థం అంతాఇంతా కాదు. మద్యం మత్తులో కారులో నడిపేవారు ప్రాణాలు కోల్పోవడమే కాదు.. కొన్ని సందర్భాల్లో ఇతరుల మరణానికీ కారకులవుతుంటారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆల్కాహాల్, లేదా మాదకద్రవ్యాలు తీసుకున్న వ్యక్తులు వాహనం నడపడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరం. మరి ఇలాంటి ప్రమాదాల సందర్భాల్లో బీమా రక్షణ మాటేమిటి.

జీవిత బీమా పాలసీల్లో చూస్తే రెండు అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. తాగి డ్రైవింగ్ చేయడం కారణంగా ప్రమాదంలో తనే ప్రాణాలు కోల్పోవడం ఒకటి. ఇతరుల ప్రాణాలకు హాని కల్గించడం రెండోది. వేర్వేరు బీమా కంపెనీలతో కొన్ని పాలసీల డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం పై సందర్భాల్లో బేసిక్ జీవిత బీమా పాలసీల్లో క్లెయిం స్వీకరించిన దాఖలాలు ఉన్నాయి. చాలా కేసుల్లో పాలసీదారులకు యాక్సిడెంటల్ బెనిఫిట్ రైడర్ ఉన్నప్పటికీ మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదం బారిన పడితే క్లెయిం తిరస్కరించే అవకాశం లేకపోలేదు. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయినా..అంగవైకల్యం భారిన పడినా అధిక రక్షణ కోసం బేసిక్ పాలసీకి కొంత ప్రీమియం అదనంగా చెల్లించి తీసుకునేదే యాక్సిడెంటల్ బెనిఫిట్ రైడర్. ఉదాహరణకు పది లక్షలకు బేసిక్ లైఫ్ ఇన్సురెన్స్ తీసుకుంటే యాక్సిడెంటల్ బెనిఫిట్ రైడర్‌ను మరో 7లక్షలకు తీసుకోవచ్చు. అంటే ప్రాణాలు కోల్పోతే రూ. 17 లక్షల మొత్తం చేతికందుతుంది. ఒకవేళ తాగి వాహనం నడుపుతూ ప్రమాదం జరిగితే పది లక్షల బేసిక్ కవర్‌నే చెల్లిస్తారు. అదనంగా జోడించుకున్న ఏడు లక్షలు ఇవ్వరు.

వాహన బీమా పాలసీల్లో డ్రైవర్ గానీ, రైడర్ గానీ మద్యం మత్తులో వాహన ప్రమాదానికి కారణమైతే థర్డ్ పార్టీకి జరిగిన నష్టాన్ని క్లెయిం చేసుకునేందుకు అనుమతిస్తారు. కేసు నమోదైన సందర్భాల్లో ఇది వర్తిస్తుంది. పాలసీ పత్రాల పరిశీలన.. సాధారణ బీమా కంపెనీలతో చర్చల అనంతరం వచ్చిన నిర్ధారణ ఇది. నష్ట పరిహారం బీమా కంపెనీలు చెల్లించాలా? లేక వాహన యజమాని కట్టాలా? అనే దానిపై న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి. చాలా కేసుల్లో న్యాయస్థానం బీమా కంపెనీల కంటే యజమాని నష్టాన్ని భరించాలని ఆదేశించాయి.

## సుడోకు

### డైలీ సుడోకు -144

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 7 | | 2 | | | | |
| | 5 | 8 | | | 3 | 4 | | |
| | | | | | 4 | | 7 | 1 |
| | | 5 | | | 8 | | 1 | 7 |
| 7 | | | 9 | | 6 | | | 8 |
| 3 | 8 | | 5 | | | 6 | | |
| 5 | 3 | | 7 | | | | | |
| | | 6 | 3 | | | 7 | 9 | |
| | | | | 5 | | 1 | | |

### డైలీ సుడోకు 143 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 8 | 9 | 5 | 3 | 1 | 7 | 2 | 6 |
| 5 | 2 | 3 | 6 | 8 | 7 | 1 | 4 | 9 |
| 6 | 1 | 7 | 2 | 4 | 9 | 5 | 8 | 3 |
| 3 | 7 | 4 | 9 | 2 | 5 | 6 | 1 | 8 |
| 1 | 9 | 2 | 8 | 7 | 6 | 3 | 5 | 4 |
| 8 | 6 | 5 | 3 | 1 | 4 | 9 | 7 | 2 |
| 7 | 3 | 1 | 4 | 6 | 2 | 8 | 9 | 5 |
| 2 | 5 | 6 | 1 | 9 | 8 | 4 | 3 | 7 |
| 9 | 4 | 8 | 7 | 5 | 3 | 2 | 6 | 1 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

# క్రెడిట్ కార్డు కష్టాలు తప్పాలంటే..



**క్రెడిట్ కార్డు ఒకటేనా? కనీసం రెండు కార్డులైనా లేకపోతే ఎలా? క్రెడిట్ కార్డుల విషయానికొస్తే.. అధిక శాతం మంది వ్యవహారం ఇలాగే మారిపోయింది. ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉండటం ఇటీవల కాలంలో సాధారణ వ్యవహారమే. క్రెడిట్ కార్డు సంస్థలు రివార్డు పాయింట్లను అందజేస్తూ.. అదనంగా కార్డులను అందజేస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, క్రెడిట్ కార్డుల నిర్వహణ, రుణ చరిత్రను నిర్వహిస్తే.. క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభావం ఎలా పడుతుందో చూద్దామా..**

మీ వద్ద ఎక్కువ క్రెడిట్ కార్డులు ఉన్నట్లయితే, ఆయా కార్డుల పేమెంట్ సైకిల్ ఆధారంగా వాటికి చెల్లింపులను చేయాల్సి ఉంటుంది. మరి అన్ని కార్డులను తరుచుగా ఉపయోగిస్తూ వాటి బిల్లుల చెల్లింపులను సకాలంలో చేయకపోతే అంతే సంగతులు. అది మీ క్రెడిట్ స్కోరుపై పెను ప్రభావాన్ని చూపుతుంది. మీరు ఇప్పటికే ఉన్న క్రెడిట్ ఖాతాలను నిర్వహించలేకపోవడంతో, ఇతర బ్యాంకులు మీకు అదనపు క్రెడిట్ కార్డు, రుణం ఇవ్వకుండా అడ్డుపడతాయి. ఈ పరిస్థితి నుంచి తప్పించుకునేందుకు మీ ఖర్చుల విధానాన్ని వరుస పద్ధతిలోకి తీసుకురావాలి. ప్రధానంగా రీ పేమెంట్ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. డ్యూ డేట్‌కు ముందు సున్నా శాతంగా ఉండే వడ్డీ రేటు, ఆ తర్వాత ముప్పయ్ శాతం దాకా అవుతుందని మర్చిపోవద్దు. మీ క్రెడిట్ స్కోరులో ముప్పయ్ ఐదు శాతం దీన్ని చుట్టూనే తిరుగుతుంది. కాబట్టి, మంచి రుణచరిత్ర కలిగి ఉండటం అత్యంత ముఖ్యమైన విషయమని మర్చిపోవద్దు.

### అప్పుల ఊబిలో వద్దు..

ఒకటి లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ కార్డులు, ఇతర రుణ సాధనాల ద్వారా ఎక్కువగా రుణాలను పొందటం, మిమ్మల్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తుంది. ఇది మీ క్రెడిట్ రిపోర్టుపై ప్రభావం చూపెడుతుంది. ఇప్పటికే ఎక్కువగా రుణాలను పొందిన కస్టమర్లను బ్యాంకులు వీలైనంత వరకూ పక్కన పెట్టేస్తాయి. రుణం, క్రెడిట్‌కు సంబంధించిన దరఖాస్తులను తిరస్కరించేందుకు ప్రాధాన్యమిస్తాయని

### మర్చిపోవద్దు.

తక్కువ సమయంలో వీలైనన్నీ ఎక్కువ క్రెడిట్ కార్డులను దరఖాస్తు చేస్తే అంతే సంగతులు. మీరు క్రెడిట్ కార్డు కోసం ఎంతగా తపిస్తున్నారో బ్యాంకులకు అర్థమవుతుంది. ఇలా వ్యవహరించడం వల్ల మీ క్రెడిట్ స్కోరు తగ్గేలా చేస్తుంది. ఇలాంటి కస్టమర్లకు రుణం ఇవ్వడాన్ని బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి. అయితే, క్రెడిట్ కార్డుల కోసం ఎక్కువగా దరఖాస్తు చేసినా, ఖర్చులను నియంత్రించి, క్రమం తప్పకుండా చెల్లింపులు చేయడం ద్వారా, మంచి చెల్లింపుల నడవడిక గల కార్డు వినియోగదారుడిగా నిరూపించుకోవాలి. అప్పుడే బ్యాంకు మీకు ప్రాధాన్యతనిస్తుంది.

### వెనక్కి ఇచ్చేస్తే మేలు..

ఒకటికి మించి క్రెడిట్ కార్డులను కలిగి ఉండటమనేది పెద్ద సమస్య అయినప్పుడు, వాటిలో కొన్ని కార్డులను వెనక్కి ఇచ్చేయడం వల్ల మీ క్రెడిట్ లిమిట్ తగ్గిపోతుంది. ఫలితంగా, మిగతా క్రెడిట్ వినియోగం కూడా పెరిగిపోతుంది. అందుకే, అందుబాటులో ఉన్న రుణ లభ్యతలో మీరు వినియోగించిన శాతం పెరగడమంటే, అది క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపుతుందని మర్చిపోవద్దు. అందుకే, క్రెడిట్ కార్డులు ఎక్కువున్నా, వాటిని వీలైనంత వరకూ అధికంగా వాడకపోవడమే మంచిది. ఒకవేళ మీరు క్రెడిట్ కార్డు ఉన్నా.. వినియోగించకపోతే ఇబ్బంది మీకే. కాబట్టి, మీరు చేయాల్సిందేమిటంటే.. కార్డు సాయంతో చిన్నస్థాయి లావాదేవీలను నిర్వహించి.. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడం ఉత్తమం. ఇలా చేయకపోతే గనక, మీ క్రెడిట్ రిపోర్టులో అట్టి క్రెడిట్ కార్డును ఉపయోగంలో లేని ఖాతాలుగా ప్రత్యేకంగా చూపిస్తారు. ఆ కార్డును వినియోగించకున్నా.. వార్షిక ఫీజునైతే తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, దానిని బ్యాంకుకు వాపసు ఇవ్వడమే ఉత్తమమైన పని.

### గృహరుణం రావట్లేదా?

గృహరుణాలు వంటి సెక్యూర్డ్ రుణాలు, క్రెడిట్ కార్డుల వంటి అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య సమతూకం పాటించడం సరైన విషయం. ఒకవేళ, మీకు క్రెడిట్ కార్డులు మినహా, మరే ఇతర రుణాలు లేకపోతే, మీ క్రెడిట్ హిస్టరీని బ్యాలెన్స్ చేయడం సాధ్యం కాదు. ఇది కూడా మీ క్రెడిట్ కార్డుపై ప్రభావం చూపుతుంది. ఎవరికైనా రుణాన్ని మంజూరు చేసే ముందు, బ్యాంకు అట్టి వినియోగదారుడు చెల్లింపులో నిలకడగా ఉంటాడా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. మంచి క్రెడిట్ హిస్టరీ నిర్వహించేందుకు సకాలంలో బిల్లులు చెల్లించడమే సులభమైన, కచ్చితమైన పద్ధతి. మీకు మంచి క్రెడిట్ హిస్టరీ ఉన్నప్పటికీ, గృహరుణాన్ని పొందేందుకు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తే.. వెంటనే మీ క్రెడిట్ రిపోర్టును పరిశీలించాలి. అందులోని తప్పిదాలను సరి చూసుకుని, వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలి.

నమస్తే తెలంగాణ
సంపద
[ హైదరాబాద్ ]
శనివారం 3 మార్చి 2018
CREDAI HYDERABAD PROPERTY SHOW



## నమ్మకం కల్గించాం..

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు భూములు కొనుగోలు చేస్తే వారం రోజులు గడవకముందే అక్కడ కబ్జారాయుళ్లు బోర్డులు పాతేవారు. అలాంటి పరిస్థితులు లేకుండా తెలంగాణ సర్కారు నిలువరించగలిగింది. నిర్మాణ రంగంలో ఉన్నవాళ్లతో పాటు, కొనుగోలుదారుల్లో భరోసా నింపింది. ఉత్తమ కాస్మో పాలిటన్ నగరమని ఆచరణలో తెలంగాణ సర్కారు నిరూపించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ క్రెడాయ్ బాధ్యతాయుతంగా మెలగడం సంతోషకరం, త్వరలోనే మరింత విస్తరించాలని కోరుకుంటున్నా..

# నిర్మాణ రంగానికి భరోసా!

*** పుంజుకుంటున్న రియల్ రంగం * సీఎం విప్లవాత్మక నిర్ణయాలే కారణం**

నిర్మాణ రంగానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తున్నదని, భూ కబ్జాలు, గూండాల తండాలు లేకుండా చేసి అభద్రతా భావాన్ని సంపూర్ణంగా తొలగించిందని ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో అనుకూల పరిస్థితులు నెలకొనడం వల్ల రియల్ రంగం గతంలో కంటే వేగవంతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. 24 గంటల కరెంట్, పూర్తి స్థాయి భద్రత కల్పించడం రియల్ రంగానికి తెలంగాణ సర్కారు ఇచ్చిన గొప్ప మద్దతుగా అభివర్ణించారు. నిర్మాణ రంగంలో ఉపాధి కల్పించే విషయంలో తెలంగాణ యువతను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. వారికి అవకాశాలు కల్పించాలని కోరారు. హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు జరిగే క్రెడాయ్ హైదరాబాద్ ఆరో ఎడిషన్ ప్రాపర్టీ షోను మంత్రి ఈటెల రాజేందర్ శుక్రవారం ప్రారంభించారు.

■ హైటెక్స్‌లో ప్రవేశించగానే మంత్రి ఈటెల రాజేందర్ ఎంతో ఓపికగా ముందుగా స్టాళ్లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవిస్తే రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలుతుందని, శాంతి, భద్రతలు క్షీణిస్తాయని ఆరోపణలు చేశారు. చర్చలు జరిపారు. అయితే అవన్నీ నీటి మూటలని తేలిపోయాయి. దేశంలోని మిగతా మెట్రో నగరాలను కాదని అందరు హైదరాబాద్ వైపు పరుగులు పెడుతున్నారు. ఇక్కడ నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి తెలంగాణ ఒక విశ్వాసాన్ని కలిగించింది. శాంతి, భద్రతల విషయంలో దేశంలోనే టాప్ స్టేట్‌గా తెలంగాణ నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 3 సంత్సరాల 8 నెలలు గడిచింది. ఇంత తక్కువ సమయంలోనే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందింది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అభివృద్ధి చెందిన గుజరాత్, హరియానా వంటి రాష్ట్రాల కంటే మేటిగా నిలిచింది. ఇదంతా గర్వంగా చెబుతున్నాను'' అని పేర్కొన్నారు. అందుబాటు ధరల్లో ఇండ్ల నిర్మాణాలు జరిపేందుకు ఇక్కడి బిల్డర్లు ముందుకు వస్తున్నారని మంత్రి ఈటెల చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్యతరగతి వారి కోసం ఇండ్ల నిర్మాణాలు ఇక్కడ చేపడుతున్నారని ప్రశంసించారు. సామాన్య ప్రజల అవసరాలు తీర్చే నగరంగా హైదరాబాద్ నిలిచిందన్నారు.

■ నేటికీ హైదారాబాద్ వేలాది ఎకరాల భూమి కలిగి ఉందన్నారు. చారిత్రక నేపథ్యమున్న హైదరాబాద్ భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. అన్ని రంగాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కరెంట్ సౌకర్యం కల్పించడంతో పాటు 10 శాతం నీటిని పరిశ్రమలకు కేటాయిస్తున్నామని చెప్పారు. మిగతా నీటి సమస్యను కృష్ణా, గోదావరి జలాలతో పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సంస్కరణలు రావాలి, ఆ ఫలాలు ప్రజలకు దక్కాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఎప్పుడూ చెబుతుంటారని, ఆయన ఆలోచన కార్యరూపం దాల్చి ప్రస్తుత పథకాల రూపంలో ప్రజలకు ఫలాలు అందుతున్నాయని చెప్పారు.

■ వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి కల్పించే నిర్మాణ రంగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ రంగంపై ఆధారపడి లక్షల మంది జీవనం కొనసాగిస్తున్నారని, వారిలో నైపుణ్యం పెంచి సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ సర్కారు మద్దతునిస్తుందన్నారు. కొన్ని సమస్యలు ఎదురవుతున్నప్పటికీ హైదరాబాద్ మిగతా నగరాలతో పోటీలో ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇందులో క్రెడాయ్ పాత్ర గొప్పదని, తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత వేగం పుంజుకున్నదని చెప్పారు. నాలా కన్వర్షన్‌లో ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, నీటి సదుపాయం ఏర్పాటు, జీఎస్టీ తగ్గింపు, సబ్సిడీ విద్యుత్ వంటి సమస్యలను క్రెడాయ్ ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి ఈటెల చెప్పారు. వీటితో పాటు రియల్ రంగంలో ఎదురవుతున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. జీఎస్టీలో భాగంగా తెచ్చిన టాక్స్ శ్లాబులను తాము ముందే వ్యతిరేకించామని, టాక్స్ తగ్గించి, బాధ్యతగా అందరినీ పన్ను పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రణాళిక రూపొందించాలని జీఎస్టీ కౌన్సిల్‌కు సూచించినట్లు గుర్తు చేశారు. మాటలతో కాలం వెల్లబుచ్చే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న విధానాల వలే దేశవ్యాప్తంగా అలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మేకిన్ ఇండియా మాటల్లో ఉండాలని, ప్రజల కష్టాలు తీర్చే పథకాలు రావాలని అన్నారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ జే స్వామినాథన్ మంత్రి ఈటెలకు జ్ఞాపికను బహూకరించారు.





## ప్రత్యేక ఆకర్షణగా స్టాళ్లు..

హెచ్ఐసీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు 40 నిమిషాల పాటు మంత్రి ఈటెల అక్కడే కలియతిరుగుతూ నిర్మాణ రంగానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి వివరాలు ఆరా తీశారు. రాష్ట్రంలోని ప్రముఖ బిల్డర్లు, పలు నిర్మాణ రంగ కంపెనీలు ప్రదర్శనలో పాల్గొని కొత్త ప్రాజెక్టుల వివరాలు ప్రదర్శించారు. ఇక తొలి రోజు క్రెడాయ్ షోకు మంచి స్పందన వచ్చింది. సొంతింటి కలను నిజం చేసుకోవాలని భావించేవారు క్రెడాయ్ షోలో పాల్గొని వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.



## నగరమే సరైన ఎంపిక..

నివసించేందుకు అనుకూలమైన సిటీగా హైదరాబాద్ ముందు వరుసలో ఉందని, దేశంలోని చాలా మంది ప్రముఖులు ఇక్కడ నివసించేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఇక్కడి భౌగోళిక పరిస్థితులకు తోడు తెలంగాణ సర్కారు అందిస్తున్న పటిష్టమైన భద్రత ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సింగపూర్, మలేసియాలో ఉన్నట్లుగా హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నగరం మొత్తాన్ని నిఘా పరిధిలోకి తెచ్చామన్నారు. బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీలో కాలుష్యం, ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌లో లేకపోవడం గొప్ప విషయమన్నారు. అంతర్జాతీయ సదస్సులకు వేదికగా హైదరాబాద్ నిలవడం వెనక తెలంగాణ సర్కారు కృషి దాగుందని చెప్పారు.

## మన్నిక గల వికర్ల్ కుర్చీలు!

గార్డెన్, బాల్కనీ లేదా ఇంట్లో ఎక్కడైనా చూడముచ్చటగా ఉండే కొత్త తరహా అల్యూమినియం కుర్చీలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. వికర్ల్ అనే కొత్త తరహా మెటీరియల్‌తో తయారవటమే వీటి ప్రత్యేకత. ఇంటి బయట వీటిని ఉపయోగిస్తే నీరు, ఎండకు పాడయిపోతాయనే భయపడనక్కర్లేదు. తక్కువ బరువుతో అందుబాటు ధరలోనే ఇవి లభిస్తుండటంతో.. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంది. ప్రత్యేకించి ఎలాంటి మెయింటనెన్స్ లేకుండానే దాదాపు 20 ఏండ్ల పాటు మన్నికగా ఉంటాయని.. వీటిని పరిచయం చేసిన రెహా కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. సాధారణ కుర్చీల కంటే కాస్త భిన్నంగా ఉన్న కుర్చీలను వాడాలనుకునే వారికి వికర్ల్ కుర్చీలు మంచి ఎంపిక అని అంటున్నారు. రూ. 18 వేల నుంచి ఇవి హైదరాబాద్‌లో లభిస్తాయని అంటున్నారు.



నమస్తే తెలంగాణ
చిత్రం
[ హైదరాబాద్ ]
శనివారం 3 మార్చి 2018


రజనీకాంత్

# కరికాలుడి రౌడీయిజం

**కా**లా అలియాస్ కరికాలుడు చావుకే దేవుడు. శత్రువులతో గొడవపడైనా సరే తన వారిని కాపాడుతాడు. శ్రమజీవుల వర్ణానికి సంకేతమైన నలుపు దుస్తుల్లోనే ఎల్లప్పుడూ కనిపిస్తాడు. మురికివాడలను ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే అస్సలు సహించడు. తమ వాడకొచ్చి చూడు మురికి మొత్తం ఇంద్రధనుస్సులా కనిపిస్తుందని సమాధానమిస్తాడు. అతడిని ఎదిరించడం కష్టం. ఎంతమంది గుంపులుగా వచ్చినా ఒక్కడే వారి భరతం పడతాడు. కరికాలుడి రౌడీయిజాన్ని పూర్తిస్థాయిలో చూపించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అతడి కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాలా'. పా రంజిత్ దర్శకుడు. ధనుష్ నిర్మిస్తున్నారు. హుమా ఖురేషి కథానాయిక. శుక్రవారం చిత్రబృందం టీజర్‌ను విడుదలచేసింది. ఈ టీజర్‌లో సాల్ట్ అండ్ పెప్పర్‌లుక్‌లో రజనీకాంత్ వినూత్నంగా కనిపిస్తున్నారు. మాస్ పంథాలో శక్తివంతమైన సంభాషణలతో ఆయన పాత్రను దర్శకుడు పా రంజిత్ వైవిధ్యంగా తీర్చిదిద్దారు. ఈ టీజర్‌కు తొలి పదహారు గంటల్లో 8.5 మిలియన్ల వీక్షణలు లభించాయి. టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతున్నది. ముంబాయిలోని మురికివాడల నేపథ్యంలో సాగనున్న ఈ సినిమాలో కరికాలుడు అనే మాఫియాడాన్ పాత్రలో రజనీకాంత్ కనిపిస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది.

# నాచియార్ రీమేక్‌లో?

**జ్యో**తిక ప్రధాన పాత్రలో బాలా దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'నాచియార్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. సామాజిక ఇతివృత్తంతో రూపొందిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలను సొంతం చేసుకున్నది. ముఖ్యంగా ఆవేశపరురాలైన పోలీస్ అధికారి పాత్రలో జ్యోతిక అభినయానికి మంచి పేరు వచ్చింది. తాజాగా ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ రీమేక్‌లో జ్యోతిక పాత్రలో అనుష్క నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో తెలుగులో అనుష్క కథానాయికగా మహిళా ప్రధాన ఇతివృత్తాలతో తెరకెక్కిన సినిమాలన్నీ మంచి వసూళ్లను రాబట్టాయి. ఆమె శైలికి అనుగుణమైన కథ కావడంతో అనుష్కతో నిర్మాతలు సంప్రదింపులు జరిపే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. నిర్మొహమాటం, అవిధేయత మనస్తత్వం కలిగిన మహిళా పోలీస్ అధికారి ఓ యువజంటకు ఎలా న్యాయం చేసిందన్నదే ఈ చిత్ర ఇతివృత్తం.


అనుష్క

# యాక్షన్ సన్నివేశాలతో..


శ్రీనివాస్

**బె**ల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ శుక్రవారం మొదలైంది. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంటినేని నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'బెల్లంకొండ శ్రీనివాస్ ప్రొఫెషనలిజం వున్న హీరో. ఆయనతో తెరకెక్కిస్తున్న తాజా చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ శుక్రవారం మొదలైంది. స్టంట్ మాస్టర్ స్టన్ శివ నేతృత్వంలో ఓ భారీ యాక్షన్ సన్నివేశంతో ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం. ఎలాంటి విరామం లేకుండా నిరవధికంగా ఈ చిత్రానికి హీరో శ్రీనివాస్ పనిచేయనున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు శ్రీనివాస్ సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో ఇద్దరు ప్రముఖ కథానాయికలు నటిస్తారు. వారెవరన్నది త్వరలో తెలియజేస్తాం. అబ్బూరి రవి మాటలు, ఛోటా కె. నాయుడు ఛాయాగ్రహణం, తమన్ సంగీతం ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి' అన్నారు.

**డిజిటల్ రైట్స్‌కు భారీ ఆఫర్..**

శ్రీవాస్ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. పూజాహెగ్డే కథానాయిక. అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ జరుగుతున్నది. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. అమెరికాలో నిర్వహించే చివరి షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తికానుంది. కాగా ఈ చిత్ర డిజిటల్, శాటిలైట్ రైట్స్‌కు భారీ ఆఫర్ లభించిందని, ఈ రెండు హక్కులకు కలిపి 13.5 కోట్లు ఆఫర్ లభించిందని చిత్ర వర్గాలు తెలిపాయి.

**శుక్రవారం వచ్చిందంటే చాలు కొత్త చిత్రాలు వెండితెరపై కొలువుదీరుతాయి. సినీ ప్రియులకు అదొక పండగరోజు. తమ అభిమాన తారల చిత్రాల్ని వీక్షిస్తూ వారాంతాల్ని ఆహ్లాదకరంగా గడపాలని ఉవ్విళ్లూరుతారు. కానీ శుక్రవారం నుంచి వెండితెర మౌనవ్రతం చేబూనింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ తీరును నిరసిస్తూ దక్షిణ భారత నిర్మాతల జాయింట్ యాక్షన్ కమిటీ థియేటర్ల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమా ప్రదర్శనలు నిలిచిపోయాయి. ప్రేక్షకుల కోలాహలంతో సందడిగా కనిపించే థియేటర్లన్నీ ఒక్కసారిగా వెలవెలబోయాయి. థియేటర్ల ప్రధాన ద్వారాలన్ని బంద్ ప్రకటనలతో దర్శనమిచ్చాయి. థియేటర్ల బంద్ ప్రభావం తెలంగాణ అంతటా కనిపించింది. మల్టీప్లెక్స్‌లతో సహా జంటనగరాల్లోని సినిమా థియేటర్లన్నీ మూతబడ్డాయి. సామాన్యుడి వినోదానికి చిరునామా అయిన వెండితెర బోసిపోవడంతో సినీ ప్రియులు తీవ్రంగా నిరాశచెందుతున్నారు. బంద్ విరమణ విషయంలో కొంత అనిశ్చితి నెలకొనడంతో ట్రేడ్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. అతి త్వరలో చర్చలు సఫలీకృతమై బంద్ విరమణ జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.**



ప్రేక్షకులు లేక బోసిపోయిన ప్రసాద్ మల్టీప్లెక్స్ బాక్సాఫీస్

# బొమ్మ పడలేదు!

• తొలిరోజు బంద్ సంపూర్ణం • దిగిరాని సర్వీస్ ప్రొవైడర్లు • నిరాశచెందిన సినీ ప్రియులు


గోకుల్ థియేటర్ బంద్ దృశ్యం


గేట్‌కు బంద్ నోటీస్‌తో శ్రీరాములు థియేటర్


ఖాళీగా కనిపిస్తున్న ఐమాక్స్ ప్రాంగణం

**ఈ** ఏడాది ఆరంభం నుంచి సరైన విజయాలు లేక సతమతమవుతున్న చిత్ర పరిశ్రమకు తాజా బంద్ శరాఘాతంలా పరిణమించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ మొదలుకొని థియేటర్లపై ఆధారపడి జీవించే చిరు వ్యాపారులపై కూడా ఈ బంద్ ప్రభావం గణనీయం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉభయరాష్ట్రాల్లో ఒక్కరోజులో ఐదుకోట్ల మేర నష్టం వాటిల్లనుందని చెబుతున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో దాదాపు 900లకు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు, 200మల్టీప్లెక్స్ స్క్రీన్‌లు ఉన్నాయి. ఇందులో 95శాతం థియేటర్లు క్యూబ్, యూఎఫ్ఓ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల సేవల్ని వినియోగించుకుంటున్నాయి. దీంతో ఈ రెండు సంస్థల ఏకపక్ష ధోరణుల్ని నిరసిస్తూ ప్రదర్శనదారులందరూ బంద్‌లో పాల్గొంటున్నారు. దక్షిణాది చిత్రసీమ యావత్తు ఈ బంద్‌లో భాగమవుతున్నప్పటికీ కేరళలో సంపూర్ణంగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పాక్షికంగా బంద్ జరిగినట్లు సమాచారం వెలువడింది. థియేటర్ల బంద్‌తో ఆర్థికంగా పెనుభారాన్ని భరించాల్సి వచ్చినప్పటికీ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌పై ఒత్తిడి తీసుకురావాలంటే థియేటర్ల మూసివేత తప్ప మరో మార్గాంతరం లేదని ఎగ్జిబిటర్స్ అంటున్నారు.

**డిమాండ్స్‌కు తలొగ్గేనా..**

శుక్రవారం నుంచి ఆరంభమైన బంద్‌కు ముగింపుపలకాలంటే డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తమ డిమాండ్స్‌పై సానుకూల ప్రకటన చేయాల్సిందేనని దక్షిణాది నిర్మాతల జేఏసీ తేల్చిచెబుతున్నది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ముందు నిర్మాతల జేఏసీ మూడు ప్రధాన డిమాండ్లను పెట్టింది. అందులో వీపీఎఫ్ (వర్చువల్ ప్రింట్ ఫీజు)ను గణనీయంగా తగ్గించాలని, లేదా రద్దు చేయాలన్నది ప్రధానంగా ఉంది. తొలి ఐదేళ్ల వ్యవధి వరకే వీపీఎఫ్ ఫీజును వసూలు చేయాలని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో నిర్మాతలు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే అనేక కారణాలు చూపుతూ దీనిని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఉల్లఘించారు. ప్రస్తుతం వీపీఎఫ్ అంశాన్నే నిర్మాతల జేఏసీ ప్రధానంగా లేవనెత్తుతున్నది. ఇంగ్లీష్ సినిమాలకు లేని వీపీఎఫ్ ఫీజు తెలుగు సినిమాలు ఎందుకని నిర్మాతల జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ప్రతి చిత్ర ప్రదర్శన సమయంలో రెండు సినిమాల ట్రైలర్స్‌ను ఉచితంగా ప్రదర్శించాలని, అనవసరమైన వాణిజ్య ప్రకటనల వ్యవధిని తగ్గించాలన్నవి మరో రెండు కీలక డిమాండ్స్‌గా ఉన్నాయి. ఈ మూడు డిమాండ్లపై సానుకూల స్పందన లభిస్తేనే బంద్ విరమణ గురించి ఆలోచిస్తామని నిర్మాతలంటున్నారు. ముఖ్యంగా వీపీఎఫ్ వివాదం పరిష్కారమైతేనే బంద్ విషయంలో స్పష్టత వస్తుందని తెలుస్తున్నది.


మూతపడ్డ సినీమాక్స్ కౌంటర్



డిజిటల్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న అధిక ఫీజుల కారణంగా ఐదు రాష్ట్రాల్లో సినిమాల ప్రదర్శన నిలిపివేతపై తెలుగు ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలు... టీఎఫ్‌డీసీతో చర్చలు జరిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం తరపున తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ నుంచి చిత్ర పరిశ్రమకు కావాల్సిన సంపూర్ణ మద్దతును అందిస్తామని హామీ ఇస్తున్నాము. డిజిటల్ ప్రొవైడర్స్ దిగిరాకపోతే టీఎఫ్‌డీసీ తరపున తెలంగాణ ఫిలింఛాంబర్, తెలుగు ఫిలిం ఛాంబర్, నిర్మాతల మండలితో సంయుక్తంగా తెలంగాణలోని అన్ని థియేటర్లకు డిజిటల్ సర్వీస్‌ను అందించే సాంకేతికతను ఏర్పాటుచేస్తాం. ప్రస్తుతం ఇతర డిజిటల్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న ఛార్జీలలో యాభై శాతం ఛార్జీలతోనే ఈ సౌకర్యాన్ని కల్పిస్తాం. ఇందుకు నాలుగు నెలల సమయం అవసరమని నిర్మాతలతో చెప్పాం. ఇప్పటికీ ఈ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం.

–పుస్కూర్ రామ్‌మోహన్‌రావు టిఎఫ్‌డీసీ ఛైర్మన్




డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్, నిర్మాతల జేఏసీ మధ్య చర్చలు సఫలమవుతాయయే విశ్వాసంతో ఉన్నాము. వీపీఎఫ్‌ను 25శాతం తగ్గించాలని మేము కోరాం. డిజిటల్ సర్వీస్ వారు 15శాతం తగ్గించడానికి సిద్ధంగా ఉన్నారు. మేము డిమాండ్ చేసినట్లుగా వీపీఎఫ్ తగ్గితే నిర్మాతలు ఊరట చెందుతారు. వారికి ఆర్థికంగా కొంత కలిసి వస్తుంది

– మల్కాపురం శివకుమార్

**బంద్‌కు ఇతర డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ మద్దతు**

దక్షిణాది పరిశ్రమలో క్యూబ్, యూఎఫ్ఓ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఆధిపత్యం ఎక్కువగా ఉంది. దాదాపు 90శాతం థియేటర్లు ఈ సంస్థల చేతిలోనే ఉన్నాయి. ఎరాక్స్, ప్రోవిజ్, కె.సెరాసెరా వంటి ఇతర చిన్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఉన్నప్పటికీ వాటి ప్రభావం అంతగా లేదు. అయితే థియేటర్ల బంద్‌కు ఇతర డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు కూడా మద్దతు ప్రకటించాయి. పరిశ్రమ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తాము కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వారు స్పష్టం చేశారు.



ఓ థియేటర్ గేటుకు బంద్ ప్రకటన

**పెద్ద సినిమాలు సేఫ్...**

ప్రస్తుత సీజన్‌లో పెద్ద సినిమాలేవి విడుదలకు సిద్ధంగా లేవు. ఈ నెలాఖరు నుంచి రంగస్థలం, మహానటి, భరత్ అనే నేను, కాలా, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా వంటి భారీ సినిమాలు వరుస వారాల్లో రాబోతున్నాయి. రాబోవు ఒకటి రెండు రోజుల్లో చర్చలు సఫలమై బంద్ విరమణ జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలంటున్నాయి. దాంతో ఈ బంద్ బారి నుంచి పెద్ద సినిమాలు సేఫ్‌గా బయటపడ్డాయని చెబుతున్నారు.


నిఖిల్, సంయుక్తహెగ్డే

# స్నేహమేరా జీవితం

**ని**ఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కిర్రాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. కన్నడ హిట్ చిత్రం 'కిరిక్ పార్టీ' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జ కథానాయికలుగా నటిస్తున్నారు. సుంకర రామబ్రహ్మం నిర్మాత. ఈ నెల 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ ప్రేమకథ నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. ఇటీవల విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. నిఖిల్ పాత్ర చిత్రణ చాలా కొత్తగా స్టైలిష్‌గా సాగుతుండటంతో ఈ సినిమాపై సర్వత్రా అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో సినిమా వుంటుంది. నిఖిల్‌తో స్వామిరారా, కార్తికేయ వంటి హిట్ చిత్రాల్ని అందించిన సుధీర్‌వర్మ స్క్రీన్‌ప్లే, చందూ మొండేటి మాటలు ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి. కొత్త తరహా చిత్రాల్ని ఇష్టపడే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, ఛాయాగ్రహణం: అద్వైత్ గురుమూర్తి, ఎడిటింగ్ : ఎం.ఆర్.వర్మ, ఆర్ట్: అవినాష్.

**చికెన్ ధరలు** (రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 72.00 |
| రిటైల్ లైవ్ | 94.00 |
| డ్రెస్డ్ | 136.00 |
| స్కిన్‌లెస్ | 155.00 |

**నెక్ (వంద గుడ్లకు)** (రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 345-00 |
| రంగారెడ్డి | 345-00 |
| మెదక్ | 345-00 |
| కరీంనగర్ | 347-00 |
| వరంగల్ | 347-00 |
| రిటైల్ ప్రైస్ | 4-05 |

# నీరవ్ జోలికి వెళ్లొద్దు!



- బకాయిలు వసూలు చేయరాదు
- ఫోన్ చేయడానికి కూడా వీల్లేదు
- రుణదాతలకు అమెరికా కోర్టు స్పష్టీకరణ
- ఫైర్‌స్టార్ దివాలా పిటిషన్‌పై విచారణ

**వాషింగ్టన్, మార్చి 2:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.12 వేల కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి అమెరికా న్యాయస్థానంలో పెద్ద ఊరట లభించింది. ప్రస్తుతానికి రుణదాతలెవరూ ఆయన జోలికి వెళ్లడానికి వీల్లేదని అక్కడి కోర్టు స్పష్టం చేసింది. నీరవ్‌కు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ కొద్ది రోజుల క్రితం దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్‌లోని అమెరికా దివాలా కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. నీరవ్‌కు రుణాలు ఇచ్చిన దాతలు ప్రస్తుతానికి ఆ రుణాలను వసూలు చేయరాదని ఆ కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా రుణాల వసూలు కోసం అతడిపై ఎటువంటి వత్తిడి తీసుకురాకూడదని స్పష్టం చేస్తూ తాత్కాలిక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు రెండు పేజీలతో కూడిన నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం నీరవ్ మోదీకి రుణాలు ఇచ్చిన దాతలు ఇప్పట్లో ఆ సొమ్మును తిరిగి తీసుకోవడం గానీ, ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోడవం గానీ కుదరదు. అలాగే నీరవ్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు రుణదాతలు ఎటువంటి పిటిషన్లు దాఖలు చేయకూడదు. బకాయిలు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేసేందుకు నీరవ్ మోదీకి ఫోన్‌గానీ, ఈ-మెయిల్ గానీ చేయడానికి వీల్లేదు. ఇందుకు సంబంధించి తాము జారీచేసిన ఆదేశాలను ధిక్కరించి నీరవ్ ఆధ్వర్యంలోని ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అమెరికా కోర్టు హెచ్చరించింది. ఈ ఆదేశాలకు సంబంధించిన నివేదికను ఆ కోర్టు నీరవ్‌కు రుణాలిచ్చిన వారికి పంపింది. భారీ కుంభకోణంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నిట్టనిలువునా ముంచేసిన నీరవ్ మోదీ నేతృత్వంలోని ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ గత నెల 26న అమెరికాలోని కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అమెరికాలో కంపెనీల పునర్వ్యవస్థీకరణకు వీలు కల్పించే ఛాప్టర్ 11 నిబంధనల ప్రకారం ఫైర్‌స్టార్ సంస్థ ఈ దివాలా పిటిషన్ వేసింది. వ్యాపారాన్ని నిలబెట్టుకోవడంతో పాటు రుణదాతలకు అప్పులు తిరిగి చెల్లించే వెసులుబాటు కోసం ఒక ప్రణాళికను ప్రకటిస్తూ ఈ తరహా పిటిషన్లు దాఖలు చేస్తారు. ఇదిలావుంటే, అమెరికాలో ఫైర్‌స్టార్ డైమండ్స్ సంస్థను కొనుగోలు చేసేందుకు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తున్నది.

**దివాలా పిటిషన్‌లో పీఎన్‌బీని రుణదాతగా చూపని నీరవ్ సంస్థలు**

ఇదిలావుంటే, నీరవ్‌కు చెందిన మూడు సంస్థలు (ఫైర్‌స్టార్ డైమండ్, ఫాంటసీ, ఏ జెఫ్ఫీ కంపెనీలు) న్యూయార్క్ కోర్టులో దాఖలు చేసిన దివాలా పిటిషన్‌లో పీఎన్‌బీని రుణదాతగా చూపలేదు. అయితే నీరవ్ 'అనధికారికంగా రుణాలు' పొందారన్న ఆరోపణలతో పీఎన్‌బీ క్రిమినల్ కేసులు దాఖలు చేయడం వల్లనే తాము దివాలా పిటిషన్‌ను దాఖలు చేయాల్సి వచ్చిందని ఆయన సంస్థలు ఆ పత్రాల్లో పేర్కొంటూ.. కేవలం హెచ్ఎస్‌బీసీ, ఇజ్రాయిల్ డిస్కౌంట్ బ్యాంక్ (ఐడీబీ)లను మాత్రమే తమ రుణదాతలుగా ప్రస్తావించాయి. నీరవ్ ఆధ్వర్యంలోని రెండు సంస్థలకు ఈ రెండు బ్యాంకులు 20 మిలియన్ డాలర్ల రుణాలు ఇచ్చాయి. వీటిలో రివాల్వింగ్ క్రెడిట్ సదుపాయాన్ని కల్పించిన ఐడీబీఐకి స్వయంగా నీరవ్ మోదీయే గ్యారంటీ ఇచ్చినట్లు దివాలా పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ పిటిషన్ దాఖలు చేసిన మూడు సంస్థలపై ఇప్పుడు అమెరికాలో విచారణ జరుగుతున్నందున ఈ కంపెనీల్లో నీరవ్‌కు చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం పీఎన్‌బీకి అవరోధంగా పరిణమిస్తుంది.

## నీరవ్ మా దేశంలో ఉన్నాడని ధృవీకరించలేం: అమెరికా

పీఎన్‌బీకి పెద్ద కుచ్చుటోపి పెట్టి విదేశాలకు పారిపోయిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ అమెరికాలో తలదాచుకున్నట్లు మీడియాలో వచ్చిన వార్తలపై ఆ దేశం స్పందించింది. అయితే నీరవ్ మోదీ తమ దేశంలో ఉన్నాడో లేదో చెప్పలేమని అమెరికా ప్రభుత్వం స్పష్టంచేసింది. 'నీరవ్ అమెరికాలో ఉన్నట్లు ఈ మధ్య మీడియాలో వార్తలు వచ్చాయి.. వీటిని ధృవీకరించలేం' అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. మరి అతన్ని పట్టుకోవడానికి మీరు భారత ప్రభుత్వానికి సాయం చేస్తున్నారా? అని ప్రశ్నించగా.. ఆ పని న్యాయశాఖ చూసుకుంటుందని చెప్పారు. అయితే ఈ విషయంపై స్పందించడానికి న్యాయశాఖ నిరాకరించింది. నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీ జనవరి మొదటి వారంలోనే భారత్ నుంచి పారిపోయిన విషయం తెలిసిందే.

# బ్యాంకులను ముంచుతున్న ఇంటి దొంగలు

- నానాటికీ పెరుగుతున్న మోసాలు
- మూడేళ్లలో 1,232 కేసులు నమోదు
- పీఎస్‌బీలకు రూ.2,450 కోట్ల నష్టం
- రాశిలో దక్షిణాది రాష్ట్రాలు 'ఘనం'
- వాసిలో ఉత్తరాది రాష్ట్రాలు టాప్
- గణాంకాలతో సహా వెల్లడించిన ఆర్బీఐ





**బెంగళూరు, మార్చి 2:**

బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న కుంభకోణాల్లో సొంత సిబ్బంది ప్రమేయం నానాటికీ పెరుగుతున్నది. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో గత కొన్నేళ్ల నుంచి వెలుగు చూసిన అనేక మోసాలను లోతుగా పరిశీలించి చూస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఇటీవల రూ.12 వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో ఇంటి దొంగల ప్రమేయంతో లక్ష రూపాయల కంటే ఎక్కువ మొత్తంలో జరిగిన మోసాల వివరాలను, వాటి వలన బ్యాంకులకు జరిగిన నష్టాన్ని రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గణాంకాలతో సహా వెల్లడించింది. 2013 ఏప్రిల్ నుంచి 2016 జూన్ వరకు ఇటువంటి 1,232 మోసాల (సిబ్బంది ప్రమేయంతో జరిగిన లక్ష రూపాయల కంటే ఎక్కువ మోసాల) వలన ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొత్తం రూ.2,450 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మొత్తం కేసుల్లో మహారాష్ట్ర సహా దక్షిణాది రాష్ట్రాలు 609 కేసులతో 49 వాటాను కలిగి ఉన్నాయి. అయితే ఇటువంటి కేసుల వలన బ్యాంకులకు జరిగిన మొత్తం నష్టంలో దక్షిణాది రాష్ట్రాల వాటా కేవలం 19 శాతం (రూ.462 కోట్లు) మాత్రమే. రాజస్థాన్‌లో ఇటువంటి మోసాలు కేవలం 3 శాతం (38 కేసులు) మాత్రమే అయినప్పటికీ వాటి వలన బ్యాంకులకు భారీ మొత్తంలో రూ.1,096 కోట్ల (44 శాతం) నష్టం వాటిల్లడం గమనార్హం. బ్యాంకు సిబ్బంది ప్రమేయంతో జరిగిన మోసాల సంఖ్య తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రాజస్థాన్, చండీగఢ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇటువంటి మోసాల వలన బ్యాంకులకు ఎక్కువ నష్టం జరిగింది. పీఎస్‌బీలకు వాటిల్లిన మొత్తం నష్టంలో ఈ మూడు రాష్ట్రాల సమష్టి వాటా 70 శాతం మేరకు ఉన్నట్లు రిజర్వు బ్యాంకు వెల్లడించింది.

**లక్ష రూపాయల కంటే ఎక్కువ మోసాలకు పాల్పడిన సిబ్బంది వలన బ్యాంకులకు జరిగిన నష్టం**

| రాష్ట్రం | కేసుల సంఖ్య | మొత్తం కేసుల్లో | నష్టం రూ. కోట్లలో | మొత్తం నష్టంలో |
|---|---|---|---|---|
| తమిళనాడు | 170 | 14% | 83.09 | 3% |
| ఆంధ్రప్రదేశ్ | 157 | 13% | 148.41 | 6% |
| కర్నాటక | 125 | 10% | 89.34 | 4% |
| మహారాష్ట్ర | 107 | 9% | 110.43 | 4.5% |
| కేరళ | 50 | 4% | 30.53 | 1.2% |
| రాజస్థాన్ | 38 | 3% | 1,096 | 45% |
| చండీగఢ్ | 03 | 0.02% | 253.44 | 10% |
| ఢిల్లీ | 37 | 3% | 188.22 | 8% |
| పశ్చిమ బెంగాల్ | 69 | 6% | 167 | 7% |
| 21 ఇతర రాష్ట్రాల్లో | 467 | 38% | 241.53 | 10% |
| విదేశీ శాఖలో | 09 | 0.7% | 41.6 | 1.7% |
| మొత్తం | 1,232 | 100% | 2,450 | 100% |

## ఆగని కుంభకోణాలు

- యూపీ గ్రామీణ బ్యాంక్‌లో రూ.14 కోట్ల మోసం
- ప్రథమ బ్యాంక్ హసన్‌పూర్ శాఖ మేనేజర్ అరెస్టు
- మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన సీబీఐ

**హసన్‌పూర్, మార్చి 2:** వరుస కుంభకోణాలతో కుదేలవుతున్న దేశీయ బ్యాంకింగ్ రంగంలో తాజాగా మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. హసన్‌పూర్ (ఉత్తరప్రదేశ్)లోని ప్రథమ అనే ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ శాఖలో రూ.14 కోట్ల కుంభకోణం జరిగిందన్న ఆరోపణలు రావడంతో ఆ శాఖ మేనేజర్‌ను అరెస్టు చేసి అతనితో పాటు ఎనిమిది మంది ఇతర ఉద్యోగులపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. తమ శాఖలో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని గుర్తించిన ప్రథమ గ్రామీణ బ్యాంక్ చేసిన ఫిర్యాదు మేరకు సీబీఐ ఈ కేసు నమోదు చేసింది. మోసాన్ని గుర్తించిన వెంటనే ఆ బ్యాంక్ తన యూజర్ ఐడీని, పాస్‌వర్డ్‌ను సస్పెండ్ చేసింది. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రథమ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ విపిన్ కుమార్, ఇతర ఉద్యోగులు తొలుత ఆ సొమ్మును ఆ బ్యాంకులోని పలు కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాల్లో జమచేసి ఆ తర్వాత ఆ మొత్తాన్ని ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలకు, ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలుస్తున్నది. దేశీయ బ్యాంకుల్లో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్న తరుణంలోనే ఈ కుంభకోణం కూడా బట్టబయలు కావడం గమనార్హం. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.12 వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో ఆ బ్యాంకు దర్యాప్తు సంస్థలను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# జెట్‌ఎయిర్‌వేస్‌కు ఎతిహాద్ గుడ్‌బై!

**24 శాతం వాటా విక్రయించే యోచనలో సంస్థ**





**న్యూఢిల్లీ, మార్చి 2:** దేశంలో రెండో అతి పెద్ద విమానయాన సంస్థయైన జెట్ ఎయిర్‌వేస్‌తో కుదుర్చుకున్న ఎతిహాద్ ఎయిర్‌లైన్స్ వాటా ఒప్పందం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోనున్నదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇదే నిజమేననిపిస్తున్నది. దేశీయ విమానయాన రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అబుదాబికి చెందిన ఈ ఎయిర్‌లైన్స్..జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటాను గతంలో కొనుగోలు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి ఈ వాటాను విక్రయించనున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. సిడ్నీకి చెందిన ప్రముఖ కన్సల్టెన్సీ సర్వీసెస్ విధుల నిర్వహణ సంస్థ కాపా-సెంటర్ ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. ఇది తప్పుడు వార్తని, వీటిని కొట్టిపారేస్తున్నట్లు ఎతిహాద్ వెంటనే ప్రకటించింది. జెట్ ఎయిర్‌వేస్ విలువైన భాగస్వామని, దీంట్లో వాటాను విక్రయించే అవకాశాలు లేవని ఎతిహాద్ వర్గాలు స్పష్టంచేశారు. దీనిపై జెట్ ఎయిర్‌వేస్ ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు. గడిచిన ఏడాది కాలంగా వస్తున్న ఈ పుకార్లను జెట్ చైర్మన్ నరేశ్ గోయల్, ఇతర ఉన్నతాధికారులు ఇప్పటికే కొట్టిపారేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మరో భాగస్వామికోసం వేచి చూడటం లేదని గోయల్ పేర్కొన్నప్పటికీ జెట్‌లో డెల్టా ఎయిర్‌లైన్స్ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తున్నది. గతేడాది నవంబర్‌లో ఎయిర్ ఫ్రాన్స్-కేఎల్ఎం చైర్మన్ జీన్-మార్క్ జనైల్లాక్ ఈ పెట్టుబడులను కొట్టిపారేయకపోవడం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది.


# సంక్షోభం దిశగా అమెరికా: బిల్‌గేట్స్



**న్యూయార్క్, మార్చి 2:** అగ్రరాజ్యం అమెరికాను మరోసారి ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టనున్నదా? అవుననే అంటున్నాయి పారిశ్రామిక వర్గాలు. 2008లో వచ్చిన సంక్షోభం లాంటిదే మళ్లీ తలెత్తే అవకాశాలున్నాయని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ తెలిపారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో నన్నేమైనా అడగండి..సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన బిల్‌గేట్స్‌కు..2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం లాంటిది సమీప భవిష్యత్తులో తలెత్తే అవకాశం ఉన్నదా? అని వినియోగదారుడు ప్రశ్నించగా..'అవును' అని చెప్పడం కష్టమే అయినప్పటికీ సంక్షోభం తలెత్తడం తథ్యమని బిల్‌గేట్స్ చెప్పారు. ఈ వ్యాఖ్యలను ప్రముఖ పెట్టుబడిదారు వారెన్ బఫెట్ కొట్టిపారేశారు. జోస్యం చెప్పడం కష్టతరమైనప్పటికీ ఇన్నోవేషన్, క్యాపిటలిజం మరింత మెరుగైతేనే ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుందన్నారు. 2008లో వచ్చిన సంక్షోభంతో 88 లక్షల మంది అమెరికన్లు తమ ఉపాధి కోల్పోయారు. దీంతోపాటు 19 లక్షల కోట్ల డాలర్ల సంపద నష్టపోగా, గృహాలు లేనివారి సంఖ్య గణనీయంగా పెరిగారు. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని తగ్గించడానికి బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## మలేషియా కుబేరుడికి 45 వేల కోట్ల నష్టం

- ఎయిర్‌సెల్ దెబ్బకు కుదేలైన ఆనంద కృష్ణన్



**న్యూఢిల్లీ, మార్చి 2:** దూరపు కొండలు నునుపు అన్న సామెత మలేషియా కుబేరుడైన టీ ఆనంద కృష్ణన్‌కు సరిగ్గా సరిపోతుంది. ఏదో సాధించాలనే ఉద్దేశంతో పుష్కరకాలం క్రితం దేశీయ టెలికం రంగంలోకి ప్రవేశించిన ఆయనకు నష్టాలే స్వాగతం చెప్పాయి. ఇప్పటి వరకు టెలికం రంగం ద్వారా నష్టపోయింది అక్షరాల 700 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.45 వేల కోట్లకు పైమాటే. ఒక విదేశీ పెట్టుబడిదారుడికి ఇంతటి స్థాయిలో నష్టపోవడం దేశీయ చరిత్రలో ఇదే తొలిసారి. ప్రపంచంలో వేగవంతంగా దూసుకుపోతున్న టెలికం రంగంలో బోలేడన్ని అవకాశాలు ఉంటాయనే ఉద్దేశంతో 2006లో ఎయిర్‌సెల్ పేరుతో దేశవ్యాప్తంగా టెలికం సేవలు ఆరంభించారు. వందకోట్లకు పైగా జనాభా ఉన్న భారత్‌లో టెలికం రంగంలో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకొని 79 ఏండ్ల వయస్సు కలిగిన కృష్ణన్.. 2006లో ఎయిర్‌సెల్‌లో పది శాతం కంటే తక్కువ వాటాను కొనుగోలు చేయడానికి 800 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాతి క్రమంలో ఈ వాటాను 45 శాతానికి పెంచుకున్నారు. ఇందుకోసం ఆయన 340 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టారు. ఆ తర్వాత టెలికం రంగంలో వచ్చిన మార్పులు ఎయిర్‌సెల్‌ను ఆర్థికంగా కుంగదీశాయి. ముఖ్యంగా 2016లో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో అడుగుపెట్టిన నాటి నుంచైతే ఈ పరిస్థితి మరి దారుణంగా తయారైంది. దీంతో రోజు రోజుకు పెరుగుతున్న అప్పులు, మరోవైపు ఇతర టెలికం సంస్థల నుంచి పోటీ తీవ్రతరంకావడంతో గతేడాది జనవరిలోనే ఎయిర్‌సెల్‌ను అమ్మకానికి పెట్టింది. అప్పట్లో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆసక్తి చూపినప్పటికీ రెగ్యులేటరీలు అనుమతించకపోవడంతో ఎయిర్‌సెల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. దీంతో చేసేదేమి లేక ఈవారంలో దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత మార్కెట్ చాలా భిన్నంగా ఉంటుందని, ముఖ్యంగా వంద కోట్లకు పైగా ఉన్న జనాభాను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పుణెకు చెందిన బజాజ్ అలైంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈవో సంపత్ రెడ్డి తెలిపారు. భారత్‌లో వ్యాపారం చేయాలనుకునేవారికి ఎయిర్‌సెల్ ఎపిసోడ్ ఒక పాఠంగా మారిందన్నారు.

## టీజీవో మహిళా దినోత్సవ పోస్టర్ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ పోస్టర్‌ను గెజిటెడ్ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాసగౌడ్ శుక్రవారం విడుదల చేశారు. మహిళా ఉద్యోగులకు ఈ నెల 6, 7 తేదీల్లో గెజిటెడ్ భవన్‌లో ఆటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు టీజీవో అధ్యక్షురాలు మమత తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, ఓంప్రకాశ్, సుజాత, సబిత, డాక్టర్ సునితాజోషి, స్వరూపరాణి, అన్నపూర్ణ, స్వర్ణలత, దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో మహమూద్ అలీకి కేకు తినిపిస్తున్న హోంమంత్రి నాయిని. చిత్రంలో హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్, టీఎంఎఫ్‌సీ చైర్మన్ అక్బర్ హుస్సేన్



భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన విభాగం నేతలు గోవర్ధనం ప్రవీణ్‌కుమార్ తదితరులు

# ఘనంగా జన్మదిన వేడుకలు

**డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు వెల్లువెత్తిన శుభాకాంక్షలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, భువనగిరి లోక్‌సభ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వారి పుట్టినరోజును పురస్కరించుకొని టీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తమ కార్యాలయం అధికారులతో డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ లేఖతోపాటు పుష్పగుచ్ఛాలను మహమూద్ అలీ నివాసానికి పంపించారు. అనంతరం మహమూద్ అలీ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం కడియం, మంత్రులు టీ హరీశ్‌రావు, తలసాని, చందూలాల్, ఎంపీ కల్వకుంట్ల కవిత, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్ తదితరులు మహమూద్ అలీకి ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్‌లోని డిప్యూటీ సీఎం నివాసానికి హోంమంత్రి నాయిని, ఎంపీ బీబీ పాటిల్, మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి తదితరులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని నివాసంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కేక్‌కోసి వేడుకలు జరుపుకొన్నారు.

# ఎన్నికల్లో మోదీకి సత్తా చూపిస్తాం

- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌ల అడ్రస్ లేకుండా చేస్తాం
- మిగిలేది టీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలే
- మజ్లిస్ పార్టీ పునరుజ్జీవ దినోత్సవంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- కేసీఆర్ బాగా పనిచేస్తున్నారంటూ కితాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముందస్తు ఎన్నికలకు వెళ్లినా భయపడేది లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి తమ సత్తా చూపిస్తామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను అంతం చేస్తామని, ఆ రెండు పార్టీలు తెలంగాణలో అడ్రస్ లేకుండా పోతాయని ఆయన అన్నారు. తెలంగాణలో టీఆర్‌ఎస్,



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్. చిత్రంలో మజ్లిస్ ఎల్పీ నేత అక్బరుద్దీన్

మజ్లిస్ పార్టీలే మిగులుతాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బాగా పనిచేస్తున్నారంటూ కితాబిచ్చారు. ఎంఐఎం పార్టీ పునరుజ్జీవ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి మజ్లిస్ జెండా ఎగురవేశారు. అనంతరం బహిరంగసభలో అసదుద్దీన్ మాట్లాడుతూ 'నేను తినను.. మరొకరిని తిననివ్వను' అని ప్రచారం చేసుకొనే మోదీకి అవినీతి మరకలు అంటాయని ఆరోపించారు. సామాన్యులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగితే చెప్పులు అరిగిపోతాయి, వాయిదాలు చెల్లించకపోతే రౌడీలు వస్తారు. దేశంలోని బడాబాబులు రూ.వేల కోట్లు బ్యాంకులకు టోకరా వేసి విదేశాలకు పారిపోతున్నా మోదీ మౌనంగా ఉండటం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. 'మీరు బస్సు యాత్రలు చేసినా, ఇంకేం చేసినా.. మీ టైర్లు పంక్చర్ కావడం ఖాయం' అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.

## ఐరోపాకు రాష్ట్ర విత్తనాల ఎగుమతి!

- యూరోపియన్ ఈక్వలెన్స్ ధ్రువీకరణ సాధిస్తాం: పార్థసారథి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం నుంచి త్వరలో ఐరోపాకు విత్తనాలు ఎగుమతి చేస్తామని వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి చెప్పారు. యూరోపియన్ ఈక్వలెన్స్ ధ్రువీకరణను త్వరలో సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. గతేడాది 1,700 టన్నుల విత్తనాలు ఈజిప్టు, సుడాన్, ఫిలిప్పీన్స్‌కు ఎగుమతిచేసినట్టు వివరించారు. శుక్రవారం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ కార్యాలయంలో జర్మనీ విత్తన శాస్త్రవేత్తలు, నిపుణులతో పార్థసారథి సమావేశమయ్యారు. రాష్ట్రం నుంచి విత్తన ఎగుమతులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, యూరోపియన్ దేశాలకు తెలంగాణ రాష్ట్ర విత్తనాలు ఎగుమతి చేయడంపై చర్చించారు. జర్మనీలో వ్యవసాయ పరిస్థితులు, నాణ్యమైన విత్తన ధ్రువీకరణకు అవలంబిస్తున్న పద్ధతులను హోహెన్‌హియమ్ వర్సిటీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైకేల్ క్రూస్ వివరించారు. జర్మనీలో విత్తన ధ్రువీకరణ తప్పనిసరి చేయడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండి మేలు జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ముందు రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న ఇస్టా ల్యాబరేటరీని సందర్శించి, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తుండటంపై సంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశంలో రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ కే కేశవులు, నేషనల్ సీడ్ ఏజెన్సీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఏఎస్‌ఎన్ రెడ్డి పాల్గొన్నారు.




శాస్త్రవేత్త మైకేల్ క్రూస్‌కు జ్ఞాపిక అందిస్తున్న పార్థసారథి

## ఏప్రిల్‌లో హర్యానాలో టీటీడీ దేవాలయం

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దేశవ్యాప్తంగా దేవాలయాలను నిర్మించేందుకు ముందుకు సాగుతున్నదని ఆలయ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. ఇందులో భాగంగా హర్యానా, తమిళనాడు రాష్ట్రాల్లో నిర్మాణాలు పూర్తిచేసుకున్న దేవాలయాలను ఏప్రిల్, మే నెలల్లో ప్రారంభిస్తామన్నారు. దేవస్థానాల నిర్మాణాల పురోగతిని శుక్రవారం పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. హర్యానాలోని కురుక్షేత్రలో రూ.34.60 కోట్లతో నిర్మించిన ఆలయాన్ని ఏప్రిల్‌లో, రూ.22.60 కోట్లతో తమిళనాడులోని కన్యాకుమారిలో నిర్మించిన శ్రీవారి దేవాలయాన్ని మే నెలలో ప్రారంభించనున్నట్టు చెప్పారు. కన్యాకుమారిలోని దేవాలయానికి వివేకానంద ట్రస్టు స్థలాన్ని కేటాయించిందన్నారు. త్వరలో చెన్నైలో రూ.7 కోట్లతో పద్మావతి అమ్మవారి దేవాలయం, ఒడిశాలోని భువనేశ్వర్‌లో రూ.6.70 కోట్లతో శ్రీవారి దేవాలయాల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేపట్టనున్నట్టు సింఘాల్ వెల్లడించారు.

## కంట్రీ క్లబ్ పేరిట అక్రమ వసూళ్లు

- నిందితుడికి మూడేండ్ల జైలు, జరిమానా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కంట్రీక్లబ్ (ఇండియా) పేరిట తప్పుడు ఈమెయిల్స్ పంపుతూ అక్రమంగా డబ్బు వసూలు చేసిన ఓ వ్యక్తికి నాంపల్లి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ.1.10 లక్షల జరిమానా విధించింది. శుక్రవారం సీఐడీ అడిషనల్ డీజీ గోవింద్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ ముంబైకి చెందిన సర్వేశ్‌నిగం అలియాస్ సందేశ్ అలియాస్ మోహిత్ కొన్నేండ్లుగా హైదరాబాద్ బేగంపేటలోని కంట్రీక్లబ్ (ఇండియా) లిమిటెడ్ పేరిట దేశవ్యాప్తంగా పలువురికి నకిలీ ఈ-మెయిల్స్ పంపుతూ మోసాలకు పాల్పడుతున్నాడు. కంట్రీక్లబ్‌లో ప్లాటినం, గోల్డ్, సిల్వర్ సభ్యత్వ కార్డులు ఇస్తామంటూ పలు కంపెనీల ఉద్యోగులు, ఎన్నారైల నుంచి డబ్బు వసూలు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. సీఐడీలోని సైబర్‌క్రైం విభాగానికి అప్పగించారు. సైబర్‌క్రైం డీఎస్పీ బీ రవికుమార్‌రెడ్డి నేతృత్వంలోని దర్యాప్తు బృందం నిందితుడి బ్యాంకు ఖాతా ఆధారంగా కేసును ఛేదించింది.

## శ్రీనివాస్‌రెడ్డిని కస్టడీకి తీసుకున్న ఏసీబీ

**మాదన్నపేట:** ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తం బినామీ, ఆయన బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం తిరిగి జైలుకు తరలించారు. శ్రీనివాస్‌రెడ్డికి గురువారం ఏసీబీ కోర్టు ఐదురోజుల కస్టడీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## నిధుల గోల్‌మాల్‌లో అధికారికి ఐదేండ్ల జైలు

- రూ.10 లక్షల జరిమానా విధించిన ఏసీబీ కోర్టు
- 2004లో ఉన్నత విద్యాశాఖలో రూ. కోటి నిధులు గల్లంతు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖలో జరిగిన నిధుల గోల్‌మాల్ కేసులో ఓ అధికారికి న్యాయస్థానం ఐదేండ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించినట్టు సీఐడీ అదనపు డీజీపీ గోవింద్‌సింగ్ శుక్రవారం చెప్పారు. ఉన్నత విద్యాశాఖలోని నేషనల్ సేవింగ్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) నిధులు గోల్‌మాల్ అయ్యాయి. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పనిచేసిన కే పుల్లారెడ్డి (రిటైర్డ్), మరో ఇద్దరు శంకరయ్య, మహ్మద్ ఖలీముల్లా సాయంతో ఫోర్జరీ సంతకాల ద్వారా బ్యాంకుల నుంచి దశలవారీగా రూ.91,76,794లు డ్రా చేసినట్టు శాఖాపరమైన విచారణలో తేలింది. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఫిర్యాదుమేరకు 2004 అక్టోబర్ 15న సీఐడీలో కేసు నమోదైంది. దర్యాప్తు పూర్తిచేసిన అధికారులు.. ఉద్యోగుల అవినీతిపై ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు పుల్లారెడ్డికి ఐదేండ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించింది. మిగతా ఇద్దరిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా ప్రకటించింది. పుల్లారెడ్డిని చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించినట్టు అదనపు డీజీపీ గోవింద్‌సింగ్ తెలిపారు.

## రాజీనామా చేసినా ప్రయోజనం ఉండదు: జేసీ

**హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ:** ఎంపీలు రాజీనామా చేసినా ఆంధ్రప్రదేశ్‌కు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ పార్లమెంటరీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చినా ఏదో భిక్షం వేసినట్టు ఇస్తారే తప్ప ఒరిగేదేమి ఉండదని, ఉపరాష్ట్రపతి పెద్దదిక్కుగా చొరువ తీసుకొంటే ఫలితం ఉండొచ్చన్నారు. ఏప్రిల్‌లో రాజీనామాలు చేసినా ఉప ఎన్నికలు రావని తెలిసే ప్రతిపక్ష నేత జగన్ నాటకం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు.

## ఔటర్‌పై కారు బోల్తా.. ఒకరు మృతి

**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల ఔటర్‌రింగ్ రోడ్డుపై టీసీఎస్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తుక్కుగూడ నుంచి బొంగుళూరుకు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

## హోమిబాబా ఒలింపియాడ్‌లో సత్తాచాటిన నారాయణ

**హైదరాబాద్:** హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ రెండోదశ ఫలితాల్లో తెలుగురాష్ట్రాల నుంచి స్కూల్‌స్థాయిలో తమ స్కూల్ విద్యార్థి వీవీ సాయికీర్తన ఒక్కరే ఎంపిక కావడం గర్వకారణమని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ సింధూర నారాయణ తెలిపారు. ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ రెండోదశ ఫలితాల్లో తమ విద్యార్థులు సీ యశ్వంత్‌రెడ్డి, జీ సింధుజ, సీహెచ్ తనూజ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో టాప్‌మార్కులు సాధించారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ నేషనల్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లోనూ వీ సాయితేజ, ఎం ఆదర్శ్‌రెడ్డి ఉత్తమ మార్కులు సాధించారని వెల్లడించారు. వీరు ముంబైలో జరిగే ఓరియంటేషన్, ఎంపిక శిబిరానికి హాజరవుతారని వివరించారు. విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఫలితాలు వెల్లడించొద్దు

- టీఎస్‌పీఎస్సీకి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీశాఖలో బీట్ అధికారుల (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్) నియామక పరీక్ష ఫలితాలను ఎనిమిదివారాలపాటు నిలిపివేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)కు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పోస్టుల భర్తీలో మాజీ సైనికోద్యోగులకు రెండుశాతం రిజర్వేషన్ కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ.. దాఖలైన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని న్యాయస్థానం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర సబార్డినేట్ పోస్టుల భర్తీలో నిబంధనల ప్రకారం రిజర్వేషన్ కల్పించకపోవడంపై వివరణ ఇవ్వాలని హోంశాఖ, అటవీశాఖ, టీఎస్‌పీఎస్సీలకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకోసం గత ఏడాది అక్టోబర్‌లో పరీక్షలను నిర్వహించారు.

## టీఆర్‌ఎస్‌తోనే టీడీపీ పొత్తు పెట్టుకోవాలి

- పదవి ఉన్నా లేకున్నా చంద్రబాబు తమ్ముడినే
- టీటీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో టీఆర్‌ఎస్‌తోనే టీడీపీ పొత్తు పెట్టుకోవాలని టీటీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే కార్యకర్తలకు మనోధైర్యం వస్తుందన్నారు. శుక్రవారం బేగంపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశీర్వాదం పొందిన నేతలంతా టీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని, టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే ఎన్టీఆర్‌కు సరైన గౌరవం దక్కుతుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రాన్ని మోసం చేశాయని విమర్శించారు. తెలంగాణలో పార్టీ ఇబ్బందుల్లో ఉంది.. సరైన నేత సారథ్యంలో ప్రజల ముందుకు వెళ్లాల్సి ఉందని నొక్కిచెప్పారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన రేవంత్‌రెడ్డి టీడీపీని నిండా ముంచారని, పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు మచ్చతెచ్చారని మోత్కుపల్లి అన్నారు. టీడీపీ తెలంగాణలో భ్రష్టుపట్టిపోయిందన్నారు. నాయకత్వలేమితో పార్టీ కునారిల్లిపోయిందని, కార్యకర్తలకు దిక్కుమొక్కు లేక ఇతర పార్టీల్లోకి వలసపోతున్నారని పేర్కొన్నారు. తనకు తెలియకుండా ట్రస్టు భవన్‌లో టీడీపీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం బాధించిందని అన్నారు. తాను వేరే ఏ పార్టీ నేతలను సంప్రదించలేదని, తనను కూడా ఏపార్టీ నేతలు సంప్రదించలేదని తెలిపారు. తాను ఏ పార్టీలోకి వెళ్లనని మోత్కుపల్లి స్పష్టంచేశారు.

## ఇక కేంద్రంపై పోరు ఉద్ధృతం

- టీడీపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో నిర్ణయం


**హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ:** ప్రజలు, పార్టీ క్యాడర్ మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఎంపీలు పట్టుబట్టడంతో కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో మరింత ఉద్ధృతంగా పోరాటంచేయాలని టీడీపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకున్నది. అమరావతిలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం పార్లమెంటరీ బోర్డు సమావేశమైంది. ఈ నెల 5 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించింది. విభజనచట్టం హామీలు, కేంద్రం ఇచ్చిన నిధులు, ప్యాకేజీల గురించి వివరిస్తూ దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు లేఖలు రాయాలని తీర్మానించింది. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌పై సమావేశంలో చంద్రబాబు మండిపడ్డారు. వేరే రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఎలా కొనసాగిస్తున్నారని కేంద్రాన్ని నిలదీశారు.

**చంద్రబాబుకు అమిత్‌షా ఫోన్.. ఢిల్లీకి రావాలని పిలుపు**

విభజన హామీలపై చర్చించేందుకు ఢిల్లీ రావాలని ఏపీ సీఎం చంద్రబాబుకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా శుక్రవారం రాత్రి ఫోన్ చేశారు. ఈ నెల 5న చర్చిద్దామని అమిత్‌షా చెప్పినట్టు పార్టీవర్గాల సమాచారం. కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, కుటుంబరావును చర్చలకు పంపుతామని చంద్రబాబు ఆయనతో చెప్పారు.

# నవ్‌జ్యోత్ కొత్త చరిత్ర

## ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం



**బిష్కెక్:** భారత స్టార్ రెజ్లర్ నవ్‌జ్యోత్ కౌర్.. ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. శుక్రవారం జరిగిన మహిళల 65 కేజీల ఫైనల్లో కౌర్ 9-1తో మియా ఇమాయ్(జపాన్)పై గెలిచి 'పసిడి' కాంతులు పూయించింది. దీంతో ఈ టోర్నీలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా రికార్డులకెక్కింది. బౌట్ ఆరంభం నుంచే ఆధిపత్యం చూపెట్టిన 28 ఏండ్ల కౌర్.. ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదు. బ్రేక్ సమయానికి 5-0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. చివరకు బౌట్‌ను ఏకపక్షంగా ముగిస్తూ చాంపియన్‌గా నిలిచింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో కౌర్ 2-1తో ఎన్సీ బాయర్ (మంగోలియా)పై గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్ (2013), కామన్వెల్త్ గేమ్స్ (2014)లో రజత, కాంస్య పతకాలు సాధించిన కౌర్.. అదే జోరును ఇక్కడా పునరావృతం చేసింది. 62 కేజీల కేటగిరీలో రియో చాంపియన్ సాక్షి మాలిక్ 10-7తో అయులామ్ కసామోవా (కజకిస్థాన్)ను ఓడించి కాంస్యంతో మెరిసింది. అంతకుముందు జరిగిన 50 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో వినేశ్ పోగట్ 2-3తో చున్ లీ (చైనా) చేతిలో ఓడి రజతంతో సంతృప్తిపడింది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ ఆరు పతకాలను సొంతం చేసుకుంది. ఇందులో ఓ స్వర్ణం, ఓ రజతం, నాలుగు కాంస్యాలున్నాయి.

# అనుష్కను చూసి భయపడ్డా!






**ముంబై:** టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన భార్య అనుష్క శర్మను చూసి భయపడ్డాడట. ఈ విషయాన్ని కోహ్లీయే స్వయంగా ట్వీట్ చేశాడు. పెండ్లై పట్టుమని మూడు నెలలు కూడా కాలేదు అప్పుడే భార్యను చూసి భయపడిపోతున్నాడా..? అని కంగారుపడకండి. కోహ్లీ తన భార్య అనుష్కను వెండితెరపై చూసి దడుచుకున్నాడంట. ఈ బాలీవుడ్ ముద్దుగుమ్మ నటించిన హారర్ సినిమా పరీ గురువారం (మార్చి 2) విడుదలైన సంగతి తెలిసిందే. శ్రీలంకతో జరుగనున్న ముక్కోణపు సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకున్న కోహ్లీ..అనుష్కశర్మ కుటుంబ సభ్యులతో కలిసి సినిమాను వీక్షించాడు. అనంతరం సినిమాపై తన అనుభూతిని ట్విట్టర్‌లో తెలిపాడు. " గత రాత్రి పరీ సినిమా చూశాను. నా భార్య నటన అద్భుతంగా ఉన్నది. చాలా రోజుల తర్వాత నేను చూసిన మంచి సినిమా ఇదే. అనుష్కను చూసి కొంత భయపడినా, ఆమె నటను చూసి గర్వంగా అనిపించింది" అని కోహ్లీ ట్వీట్ చేశాడు. అనుష్క కూడా స్పందించి కామెంట్‌లో ఒక స్మైలీని పోస్ట్ చేసింది. దీనికి నెటిజన్ల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది.


# ధోనీ అనుభవాన్ని కొనలేం.. అమ్మలేం




**న్యూఢిల్లీ:** మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి.. చీఫ్ కోచ్ రవిశాస్త్రి మరోసారి బాసటగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో మహీకి ఉన్న అనుభవాన్ని వెలకట్టలేమన్నాడు. దానిని మార్కెట్‌లో కొనడానికి, అమ్మడానికి సాధ్యంకాదన్నాడు. 'అనుభవానికి ప్రత్యామ్నాయం లేదు. 2004లో వన్డే క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పట్నించీ ధోనీ ఎంతో సాధించాడు. అతనో అత్యుత్తమ ఫినిషర్. పరిమిత ఓవర్లలో ప్రపంచ స్థాయి ఆటగాడు అతను. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం అతని స్వభావం. మహీ ఫిట్‌నెస్ లెవల్స్ సూపర్బ్. స్లాగ్ ఓవర్లలో ధోనీలా ఆడేవారు కొందరు మాత్రమే ఉంటారు. చివరి ఓవర్లలో ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను ఫినిష్ చేయడమంటే మాటలు కాదు. క్రికెట్ చరిత్రలో ఇలాంటి గేమ్ విన్నర్స్ చాలా అరుదుగా ఉంటారు' అని శాస్త్రి పేర్కొన్నాడు. వన్డేల్లో 5, 6, 7 స్థానాల్లో బ్యాటింగ్ చేయడమంటే కత్తిమీద సామేనని చెప్పాడు. కానీ ఈ మూడు స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగి చాలాసార్లు మ్యాచ్‌లను అలవోకగా ముగించాడని ధోనీపై ప్రశంసలు కురిపించాడు. ఓవరాల్‌గా ఈ జార్ఖండ్ డైనమెట్ అనుభవం చాలా విలువైందన్న శాస్త్రి.. అది జట్టుకు ఎప్పుడూ తోడ్పడుతుందని కితాబిచ్చాడు.

## ధోనీ నుంచి నేర్చుకుంటా

### ఒత్తిడిని అధిగమించడం..


మార్క్‌వుడ్

**చెన్నై:** ఐపీఎల్-11వ సీజన్‌లో తాను మ్యాచ్ విన్నర్‌గా మారాలని ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ భారీ ఆశలు పెట్టుకున్నాడు. ఒత్తిడిని ఎలా అధిగమించాలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ, విండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రేవో నుంచి నేర్చుకుంటానన్నాడు. 'ధోనీతో కలిసి పని చేసేందుకు చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ధోనీ కెప్టెనే కాదు మ్యాచ్ విన్నర్ కూడా. బ్రేవో నుంచి బౌలింగ్ మెలకువలు నేర్చుకుంటా. ఈ ఇద్దరి సహచర్యంతో నేను చాలా నేర్చుకోవాలని భావిస్తున్నా. చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఆడుతున్నందుకు చాలా గర్వంగా ఉంది' అని వుడ్ పేర్కొన్నాడు. ఐపీఎల్ అంటే పోటీ ఒక్కటే కాదు.. మేటి జట్లతో కలిసే ఆడే గొప్ప అవకాశాన్ని ఇస్తుందన్నాడు. నిలకడగా 140 కేఎంపీహెచ్ వేగంతో బంతులు వేసే వుడ్‌పై సీఎస్‌కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా అంచనాలు భారీగా పెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికా తాజా సంచలనం ఎంగిడి, శార్దూల్ ఠాకూర్‌ల బృందం రాణించడంపైనే తమ జట్టు విజయవకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయని సీఎస్‌కే సీఈవో కేఎస్ విశ్వనాథన్ అన్నారు.


## విండీస్ 115 ఆలౌట్



**హరారే:** క్రికెట్ ప్రపంచకప్ అర్హత టోర్నీ సన్నాహక మ్యాచ్‌లో వెస్టిండీస్ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. శుక్రవారం పసికూన యూఏఈతో జరిగిన వామప్ మ్యాచ్‌లో విండీస్ 33.4 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. మణికట్టు స్పిన్నర్ ఇమ్రాన్ హైదర్(4/16) విజృంభణకు తోడు రోహన్ ముస్తఫా(2/10), నవీద్(2/27), అహ్మద్ రెజా(2/14) ధాటికి విండీస్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్ వెళ్లేందుకు పోటీపడ్డారు. హార్డ్‌హిట్టర్లు క్రిస్ గేల్(16), శామ్యూల్స్(15), ఎవిన్ లెవిస్ బ్యాట్లు ఝులిపించలేకపోయారు. క్రీజులోకి వచ్చిన బ్యాట్స్‌మెన్ వచ్చినట్లు వికెట్లు సమర్పించుకున్నారు. ఆదిలో మెరుగ్గా కనిపించిన విండీస్..ఆఖర్లో వెంటవెంటనే వికెట్లు సమర్పించుకుంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యూఏఈ 29 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌటైంది. నికితా మిల్లర్(5/20), కీమర్ రోచ్(3/15) యూఏఈ పతనాన్ని శాసించారు. వీరి వీరవిహారంతో కెప్టెన్ రోహన్ ముస్తఫా(12), షైమన్ అన్వర్(12), రమీజ్ షెహజాద్(11) మినహా జట్టులో ఎవరూ రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. ఇంగ్లండ్ వేదికగా 2019లో జరిగే ప్రపంచకప్ కోసం ఈనెల 4 నుంచి అర్హత టోర్నీ మొదలుకానుంది. ఇందులో 10 జట్లు రెండు బెర్తుల కోసం పోటీపడనున్నాయి.

## స్టార్క్ దెబ్బకు సఫారీల విలవిల

### దక్షిణాఫ్రికా 162 ఆలౌట్




**డర్బన్:** ఆతిథ్య దక్షిణాఫ్రికాకు తొలి టెస్టులోనే ఆస్ట్రేలియా చుక్కలు చూపిస్తున్నది. మిచెల్ స్టార్క్ (5/34) అద్భుతమైన బౌలింగ్‌తో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. డివిలీయర్స్ (71 నాటౌట్) ఒక్కడే చివరిదాకా పోరాడాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 189 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకు ముందు 225/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 110.4 ఓవర్లలో 351 పరుగులకు ఆలౌట్ అయింది. మిచెల్ మార్ష్ (96) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మహరాజ్ 5 వికెట్లు పడగొట్టాడు. కంగారూలను ఆలౌట్ చేసిన ఆనందం సఫారీలకు ఎంతోసేపు మిగల్లేదు. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికాను ఆసీస్ పేసర్ స్టార్క్, స్పిన్నర్ లియాన్ కుప్పకూల్చారు. ఓపెనర్ ఎల్గర్ (7), ఆమ్లా (0) వికెట్లు తీసి లియాన్ ఆదిలోనే దెబ్బతీయగా..ఆ తర్వాత స్టార్క్ రెచ్చిపోయాడు. డుప్లెసిస్ (15), బ్రుయాన్ (6)తో పాటు టెయిలెండర్ల వికెట్లు పడగొట్టాడు. ఈ ఎడమచేతి పేసర్ దెబ్బకు దక్షిణాఫ్రికా 16 పరుగుల తేడాలో 5 వికెట్లు కోల్పోయింది. లియాన్‌కు 3, హాజెల్‌వుడ్, కమిన్స్‌కు చెరో వికెట్ దక్కింది.

# ఒలింపిక్ పతకమే లక్ష్యం

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో జిమ్నాస్ట్ అరుణారెడ్డి

ప్రపంచకప్ కాంస్య విజేతకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం

నేడు ఎల్బీ స్టేడియంలో సన్మానం





శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరుణకు స్వాగతం పలికిన సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి. చిత్రంలో అరుణ అక్క పావనిరెడ్డి, బావ జనార్దన్‌రెడ్డి

జిమ్నాస్టిక్స్..అత్యంత కఠినమైన క్రీడ.. శరీరంలో ఎముకలు లేవనిపించేలా..రబ్బరు మాదిరిగా సాగుతూ..అమాంతం విల్లులా మారుతూ.. భూ ఆకర్షణ శక్తిని సవాల్ చేస్తూ గాలిలో చేసే విన్యాసాలు..ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లోనే ప్రమాదకరమైన ప్రొడునోవా విన్యాసం. ఒకటా రెండా.. ప్రతి విన్యాసం ప్రమాదభరితమే..ప్రతి పల్టీ ప్రాణాంతకమే.. ఈ క్రీడను ఎంచుకున్న హైదరాబాదీ అరుణారెడ్డి గొప్ప సాహసం చేసింది.. జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో భారత్‌కు తొలి పతకం అందించి మన రాష్ర్టానికి గర్వ కారణంగా నిలిచింది.. పట్టుదలకు మారుపేరుగా నిలిచి ప్రపంచకప్‌లో కాంస్యం సాధించినా ఇది ఆరంభం మాత్రమే అంటున్నది..14 ఏండ్ల కెరీర్..ప్రాక్టీస్ చేసేందుకు వసతుల లేమి..ప్రమాణాలకు దూరంగా సౌకర్యాలు..పదేండ్ల వయసులో తండ్రి దూరమయ్యాడు..అయినా తట్టుకుంది..ఎల్బీ స్టేడియంలో ప్రాక్టీస్..లోయర్ ట్యాంక్‌బండ్‌లో చదువు..ఇదే జీవితం..కష్టాలను తట్టుకుంది.. కన్నీళ్లను అధిగమించి..సబ్‌జూనియర్.. జూనియర్ స్థాయిలో 200 పతకాలతో తిరుగులేని రీతిలో కెరీర్ ఉజ్వలంగా మార్చుకుంది.

హైదరాబాద్,
నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి..

జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో దేశానికి తొలి పతకం అందించిన తెలంగాణ బిడ్డ బుడ్డా అరుణారెడ్డికి సొంతరాష్ట్రంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం శంషాబాద్‌లో విమానాశ్రయంలో అరుణారెడ్డి అడుగుపెట్టింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ముగిసిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్య పతకం సొంతం చేసుకుని తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందింది. అరుణను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. విమానాశ్రయం నుంచి అత్తాపూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రపంచకప్‌లో కాంస్య పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందని చెప్పింది. కుటుంబసభ్యుల సహకారంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ పతకం సాధించానని వినమ్రత చాటింది. తన కెరీర్‌లో లభించిన అతిపెద్ద విజయంతో ఆత్మవిశ్వాసం పెరిగిందని..భవిష్యత్‌లో స్వర్ణపతకంతో దేశానికి, మన రాష్ర్టానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తానని పేర్కొంది.

**తొలుత కామన్వెల్త్..తర్వాత ఒలింపిక్స్ ..స్వర్ణమే లక్ష్యం..**
**నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధితో అరుణారెడ్డి**

**ప్రపంచకప్ పతకం సాధించారు. ఇక భవిష్యత్‌లో మీ లక్ష్యమేమిటి.. ఈ పతకం సాధించగలరని ముందుగా ఊహించారా?**

కోచ్‌ల శిక్షణ.. మా నాన్న ఆశయం ఇవన్నీ నన్ను లక్ష్యం దిశగా ముందుకు తీసుకెళ్లాయి. ప్రపంచకప్‌లో మెరుగ్గా రాణించగలను అని అనుకున్నాను. పతకం సాధించడంతో ఎంతో సంతోషంగా ఉంది. కామన్వెల్త్ క్రీడలు కూడా ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరుగనుండడం నాకు కలిసి వస్తుందని ఆశిస్తున్నా. కామన్వెల్త్‌లో పతకం సాధిస్తానని అనుకుంటున్నాను. అది స్వర్ణ పతకం కావాలని కోరుకుంటున్నాను. 14 ఏండ్ల కష్టానికి తగిన ప్రతిఫలం స్వర్ణ పతకమే. తద్వారా రాష్ర్టానికి, దేశానికి పేరు ప్రతిష్ఠలు వస్తాయి. ఆసియా క్రీడలతో పాటు ఒలింపిక్స్‌లోనూ మన దేశానికి పతకం సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాను.

**మీ ప్రాక్టీస్ ఎలా సాగింది.. మీ విజయం వెనుక ఎవరు ఉన్నారు**

ఈ విషయంలో ముందుగా మా కుటుంబం.. మా అక్క పావని రెడ్డి, బావ బొమ్మిరెడ్డి జనార్దనరెడ్డికి ధన్యవాదాలు చెప్పాలి. మా నాన్న ఆశయం కోసం నేను కెరియర్‌లో రాణించేలా వీళ్లు నన్ను ప్రోత్సహించారు. మా నాన్న మరణంతో పూర్తిగా కుంగుబాటుకు లోనైన సమయంలో నాకు నా కుటుంబం అండగా నిలిచింది. నన్ను నా లక్ష్యం వైపు నడిపించేలా నాకు అన్నీ అందించారు. పతకం సాధించిన సమయంలో నాన్నను గుర్తు చేసుకున్నాను. ఇంటికి ఫోన్ చేసిన సమయంలో మా అక్కతో మాట్లాడుతూ అమ్మ ఎలా ఉంది. సంతోషంగా ఉందా అని అడిగాను. తను భావోద్వేగంతో నాన్నను గుర్తు చేసుకుంటుందని నాకు తెలుసు.. పతకం సాధించడంతో నాపై బాధ్యత మరింతగా పెరిగింది. మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధనతో ఈ క్రీడవైపు మరింతమందిని తీసుకురాగలిగేలా వారికి ప్రేరణ ఇవ్వగలనని భావిస్తున్నా.

**దీపా కర్మాకర్ గురించి చెప్పండి..**

ఢిల్లీలోని సాయ్ కేంద్రంలో ఇద్దరమూ ఒకే రూంలో ఉండేవారం.. తాను ఒలింపిక్స్‌లో నాలుగోస్థానంలో నిలువడంతో దేశమంతా జిమ్నాస్టిక్స్ వైపు దృష్టిసారించింది. తను సాధించిన ఘనతతోనే నేను కూడా ప్రేరణ పొందాను. ఇప్పుడు నేను ప్రపంచకప్‌లో పతకంతో జిమ్నాస్టిక్స్‌కు మరింత ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నా. భవిష్యత్‌లో దీప మరిన్ని విజయాలు సాధిస్తుంది. 2020 ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో మన దేశానికి పతకం రావడం ఖాయమని భావిస్తున్నా.

**హైదరాబాద్‌లో ప్రాక్టీస్ సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. మీ ప్రాక్టీస్ ఎలా సాగింది.**

ఎల్బీస్టేడియంలో ప్రాక్టీస్.. ఇక్కడి కోచ్‌ల సహాయంతోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగాను. ఇక్కడ ఒక విషయం తప్పకుండా చెప్పాలి.. మన దగ్గర ఉన్న ప్రాక్టీస్ ఎక్విప్‌మెంట్ పదిహేనేండ్ల పాతది.. అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోదు.. స్థానిక టోర్నీల ప్రాక్టీస్‌కు సరిపోతుంది.. అంతర్జాతీయ ప్రమాణాలతో సరికొత్త ఎక్విప్‌మెంట్ ఇక్కడకు తీసుకురాగలిగితే మన గడ్డ నుంచి మరింతమంది జిమ్నాస్ట్‌లు అంతర్జాతీయస్థాయికి రాగలుగుతారు. కామన్వెల్త్ క్రీడల కోసం నేను ఈ నెలంతా ఢిల్లీలో ప్రాక్టీస్ చేయాల్సి ఉంది. ఇక్కడే ఆస్థాయి సౌకర్యాలు ఉంటే ప్రాక్టీస్ చేసుకునే దాన్ని.. కానీ ఇప్పుడు ఢిల్లీ లేదంటే విదేశాలకు వెళ్లాల్సిందే.



"నా కూతురు సాధించిన ఘనతతో నాకు మాటలు రావడం లేదు. ప్రమాదకరమైన జిమ్నాస్టిక్స్ ఎంచుకున్న సమయంలో నేను కాస్త భయపడ్డాను. కానీ నా బిడ్డ పట్టుదల కలిగినది.. అనుకున్నది సాధిస్తుంది. ఎన్నోసార్లు టోర్నీలకు వెళ్లేందుకు డబ్బులు సమకూర్చడం కష్టంగా మారిన సమయంలో స్పాన్సర్ల దగ్గరకు వెళ్లే విషయంలోనూ తన మాటే మన్నించాల్సి వచ్చేది. మనం పతకం సాధిస్తే డబ్బులు ఇచ్చేందుకు వారే వస్తారంటూ నా బిడ్డ ఎప్పుడూ చెప్పేది. వారి చుట్టూ తిరిగితే ప్రాక్టీస్‌కు ఆటంకం అని చెప్పేది. నా అల్లుడు, పెద్ద బిడ్డ తనకు ఏం కావాలో ఇస్తున్నారు. ఈ పతకం సాధించిన సమయంలో వాళ్ల నాన్న ఉండుంటే ఎంతో ఆనందించేవారు. అరుణతోపాటు వాళ్ల నాన్న చాలా కష్టపడ్డారు. దేశానికి, మన రాష్ర్టానికి పేరు తెచ్చేలా పతకం తెచ్చిన నా బిడ్డ మరిన్ని విజయాలు సాధిస్తుంది. **-సుభద్రమ్మ, అరుణ తల్లి**

నాన్నకు ప్రేమతో..


చిన్నతనంలో తండ్రి నారాయణరెడ్డితో అరుణ

## నేడు అరుణకు ఘన సన్మానం

జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్య పతకంతో మెరిసిన బుడ్డా అరుణారెడ్డిని శనివారం ఘనంగా సన్మానించనున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా మంత్రి పద్మారావుతో పాటు సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, సాట్స్ ఎండీ దినకర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.


దీపక్

# హుడా అరంగేట్రం చేసేనా..?

**ముంబై:** మేరా నంబర్ కబ్ ఆయేగా..అంటూ ముక్కోణపు సిరీస్‌కు ఎంపికైన భారత యువ ఆటగాళ్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వీరిలో బరోడా ఆల్‌రౌండర్ దీపక్ హుడా ముందు వరుసలో ఉన్నాడు. గతేడాది భారత్‌లో శ్రీలంకతో జరిగిన ద్వైపాక్షిక టీ20 సిరీస్‌కు హుడా ఎంపికైనప్పటికీ తుది జట్టులో స్థానం దక్కలేదు. తాజాగా శ్రీలంక, బంగ్లాదేశ్‌తో జరుగనున్న ముక్కోణపు టోర్నీకి ఇతడిని ఎంపిక చేయడంతో ఎగిరి గంతేశాడు. ఈసారి తుది జట్టులో స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. " ఇది ముఖ్యమైన సిరీస్. గతంలో జట్టుకు ఎంపికైనా ఆడే అవకాశం రాలేదు. కానీ ఈసారి కచ్చితంగా తుది జట్టులో చోటు దొరకుతుందని అనుకుంటున్నా. అవకాశం వస్తే నేను 110 శాతం ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా" అని హుడా మీడియాకు తెలిపాడు. గతంలో టీమ్‌ఇండియా డ్రెస్సింగ్‌రూమ్‌లో సీనియర్లతో కలిసి ఉండటం కొంత లాభించే అంశమన్నాడు. ధోనీ నుంచి బ్యాటింగ్ మెళకువలు నేర్చుకున్నాని హుడా చెప్పాడు. కోహ్లీ, ధోనీ, పాండ్య విశ్రాంతి తీసుకోవడంతో ముక్కోణపు టోర్నీలో యువ క్రికెటర్లకు ఆడే అవకాశం దక్కనుంది. ముఖ్యంగా పాండ్య స్థానంలో ఆల్‌రౌండర్ కోటాలో దీపక్ హుడాకు తుదిజట్టులో చోటు ఖాయమని చెప్పొచ్చు. హార్డ్ హిట్టర్‌గా, ఆఫ్ స్పిన్నర్‌గా ఇప్పటికే సత్తా చాటిన హుడాకు మరో యువ ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్ నుంచి పోటీ ఉంటుంది. ఇప్పటి వరకు 31 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన హుడా 2208 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో గతంలో రాజస్థాన్ రాయల్స్‌కు, 2017 ఎడిషన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడాడు.

## వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా..

**న్యూఢిల్లీ:** అండర్-19 ప్రపంచకప్ గెలిచి నెల కూడా తిరుగకముందే... జూనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేశాడు. దాదాపు 30 నెలలుగా ఈ పదవిలో కొనసాగుతున్న అతను వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. దీనికి తోడు వెంకీ..'పరస్పర విరుద్ధ ప్రయోజనాల' అంశాన్ని కూడా రాజీనామాకు ముడిపెట్టడం గమనార్హం. 'రాజీనామా ఎందుకు చేశాడన్న దానిపై స్పష్టత లేదు. కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను తెర మీదకు ఎందుకు తీసుకొచ్చాడో తెలియదు. రాజీనామా వద్దని చాలా వారించాం. కానీ అప్పటికే అతను స్పష్టమైన నిర్ణయానికి వచ్చేశాడు.' అని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు అన్నారు.

# అర్జెంటీనాను నిలువరిస్తారా?

### భారత కుర్రాళ్లకు అద్భుత అవకాశం

### నేటి నుంచి అజ్లాన్ షా హాకీ టోర్నీ


సర్దార్‌సింగ్

**ఇపో (మలేసియా):** ప్రతిష్ఠాత్మక అజ్లాన్ షా హాకీ టోర్నీని సానుకూల దృక్పథంలో మొదలుపెట్టేందుకు భారత్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. శనివారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాను ఎలాగైనా నిలువరించాలని భావిస్తున్నది. గురువారం జరిగిన వామప్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఆసీస్ చేతిలో ఓడినా.. కొన్ని సానుకూలాంశాలు బహిర్గతమయ్యాయి. వైస్‌కెప్టెన్ రమణ్‌దీప్ గోల్ చేయడం.. మూడు క్వార్టర్స్‌ల్లో కంగారూలను బాగా కట్టడి చేయడంతో చీఫ్‌కోచ్ మారీన్ జట్టుపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. దీనికితోడు సర్దార్‌సింగ్ మళ్లీ జట్టు పగ్గాలు అప్పగించారు. ఇంతవరకు అతని నాయకత్వంలో ఆడిన ప్రతిసారి భారత్ ఏదో ఓ పతకాన్ని సాధించింది. 2008లో రజతం, 2015లో కాంస్యం, 2016లో రజతం గెలుచుకుంది. అయితే ఈసారి ఫార్వర్డ్ లైన్‌లో కీలక ఆటగాళ్లు ఆకాశ్‌దీప్ సింగ్, సునీల్, మన్‌దీప్‌సింగ్, మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్‌సింగ్, గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్, డ్రాగ్‌ఫ్లికర్ రూపిందర్, హర్మన్‌ప్రీత్ సింగ్ ఈ టోర్నీకి అందుబాటులో లేకపోవడం కాస్త లోటుగా మారింది.

**'డబుల్' చేయాలని..**2008లో ఒకే ఒక్కసారి టైటిల్ సాధించిన అర్జెంటీనా దానిని డబుల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో ఈ టోర్నీకి పకడ్బందిగా సిద్ధమై వచ్చింది. అయితే చీఫ్ కోచ్ కార్లోస్ రెటెగు తన పదవికి రాజీనామా చేయడంతో అతని స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో కోచ్ లేకుండా అర్జెంటీనా ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.



## పిడిగుద్దులాట

**బోధన్ రూరల్:** హోలీ పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హున్సా గ్రామంలో శుక్రవారం యథావిధిగా పిడిగుద్దులాట ఆచారం కొనసాగింది. సాయంత్రం 6గంటలకు హనుమాన్ మందిరం వద్ద గ్రామస్తులు రెండుగా విడిపోయి అడ్డంగా కట్టిన పెద్ద తాడుకు రెండువైపులా మోహరించి పరస్పరం ముఖాలు, వీపులపై పిడిగుద్దులు గుద్దుకున్నారు. పది నిమిషాల పాటు ఈ ఆట సాగింది. 450ఏండ్లుగా ఈ ఆచారం గ్రామంలో నడుస్తున్నది. ఈ ఉత్సవం నిర్వహిస్తే, గ్రామానికి కీడు జరగదని గ్రామస్తుల నమ్మకం. అంతకు ముందు గ్రామ శివారులో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ వేడుకను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్ర కోనేరులో స్వామి వారి తెప్పోత్సవం

## ఉగ్ర నరసింహుడి తెప్పోత్సవం

**ధర్మపురి టౌన్:** జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లోఉగ్ర లక్ష్మీ నరసింహ స్వామి తెప్ప, డోలోత్సవం కన్నుల పండువలా సాగింది. సాయంత్రం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను పల్లకిపై కోనేరుకు తెచ్చారు. హంసవాహనంపై ఐదు ప్రదక్షిణల అనంతరం డోలోత్సవం నిర్వహించారు.



## కల్యాణ రాముడు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం సీతారామ చంద్రస్వామి బ్రహోత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. 26న సీతారాముల కల్యాణం, 27న పట్టాభిషేకం జరుగనున్న నేపథ్యంలో కల్యాణ మహోత్సవానికి సంబంధించి పనులకు గురువారం అంకురార్పరణ జరుగగా, శుక్రవారం భద్రాద్రి రామయ్యను కల్యాణ రాముడిగా ముస్తాబు చేశారు. మహా కుంభ ప్రోక్షణ జరిపి రామయ్యపై వసంతాలు జల్లారు. అత్యంత అంగరంగవైభవంగా నిర్వహించిన ఈ కల్యాణ తలంబ్రాలు కలుపు వేడుకలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో భద్రాద్రి రామాలయం కళకళలాడింది.





శుక్రవారం మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న కొత్తపల్లి గ్రామస్థులు

## విధివంచితుడికి మంత్రి కేటీఆర్ ఆపన్నహస్తం

- వైద్యానికి రూ.5.60 లక్షలు మంజూరు
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు

**గంభీరావుపేట:** అనారోగ్యంతో బాధపడుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యోగా సాధకుడు పెరిమల్ల దేవయ్యకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ఆపన్నహస్తం అందించారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన దేవయ్య కొద్దిరోజుల నుంచి పేగు సంబంధిత వ్యాధితో అనారోగ్యం బారినపడ్డారు. వైద్యం కోసం హైదరాబాద్ యశోద వైద్యులను సంప్రదించగా శస్త్రచికిత్సకు సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ ఉప సర్పంచ్ రవి, దేవయ్య స్నేహితులు పలువురు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావును కలిశారు. వారు శుక్రవారం హైదారాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి దేవయ్య అనారోగ్య పరిస్థితులు, వైద్య ఖర్చుల గురించి తెలుపడంతో మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆయన వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చులు ప్రభుత్వం తరపున చెల్లిస్తామని హామీనివ్వడంతో వైద్యులు చికిత్స ప్రారంభించారు. దేవయ్యకు ఆపన్నహస్తం అందించిన మంత్రి కేటీఆర్‌కు యోగా క్రీడాసాధకులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# తుది దశకు..

### ప్రారంభానికి సిద్ధంగా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

**అన్ని హంగులతో జీ+1 నిర్మాణం.. పార్కింగ్, గ్రీనరీకి ప్రాధాన్యం.. త్వరలో ప్రారంభం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్మిస్తున్న క్యాంపు కార్యాలయాల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ భవనాల నిర్మాణాల్లో పరకాల క్యాంపు కార్యాలయ భవనాన్ని రికార్డు సమయంలో పూర్తి చేసి ప్రారంభించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే నివాస, కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సర్వ హంగులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్నది. భవనం కింది భాగంలో విశాలమైన మీటింగ్ హాల్, మొదటి అంతస్తులో డబుల్ బెడ్‌రూంతోపాటు విశాలమైన హాల్, డైనింగ్, కిచెన్, డ్రాయింగ్‌రూం ఏర్పాటు చేశారు. భవనం ఆవరణలో పార్కింగ్ సౌకర్యం, గ్రీనరీకి ప్రాధాన్యతనిస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో దీన్ని అధికారికంగా ప్రారంభించే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు భిన్నంగా గజ్వేల్ నియోజకవర్గ కార్యాలయాన్ని నిర్మించారు.

**విశాలమైన మీటింగ్ హాళ్లు..**

ప్రజలకు అందుబాటులో ఉండేలా విశాలంగా, సకల సౌకర్యాలతో నిర్మించారు. మొదటి అంతస్తుతోపాటు గ్రౌండ్‌ఫ్లోర్‌లో కూడా విశాలమైన మీటింగ్‌హాళ్లను నిర్మించారు. ఏకకాలంలో వివిధ అంశాలపై సమావేశాలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. అధికారులతో సమావేశాలు, రాజకీయ సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక సమస్యలపై విన్నవించేందుకు వచ్చే ప్రజలు కూర్చుండేందుకు సౌకర్యాలు కల్పించారు. వారికి సంబంధించి టాయిలెట్లు, విశ్రాంతి గదులు కూడా ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయ భవనం 2,525 గజాల్లో నిర్మించారు. ఇందులో భవననిర్మాణం ఏరియా జీ+1తో ఒక్కో ఫ్లోర్ 2,513 చదరపు అడుగుల చొప్పున నిర్మాణాలు పూర్తయ్యాయి. 2,525 గజాల స్థలం మొత్తానికి బౌండరీ ఏర్పాటు చేసి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. భవనంలో సీఎం కాన్వాయ్‌కి సంబంధించిన వాహనాలతోపాటు మరో 10 వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుంటుంది. సీఎం వెంట వచ్చే ప్రధాన వాహనాలకు లోపల పార్కింగ్ చేసుకునే విధంగా 20 వాహనాలకు సౌకర్యం కల్పించారు. మిగతా వాహనాల పార్కింగ్‌కు బయట స్థలాన్ని కేటాయించారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తుది దశకు చేరుకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ఇన్‌సెట్‌లో) కార్యాలయ ఆవరణలో గ్రీనరీ

**104 నియోజకవర్గాల్లో పనులు..**

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు చేపట్టిన ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయ భవనాల్లో 31 వరకు పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో గజ్వేల్ కార్యాలయాన్ని నాలుగైదు రోజుల్లో ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం చేస్తున్నట్టు స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. కాగా రాష్ట్రంలోని 104 నియోజకవర్గాల్లో చేపట్టిన ఈ భవన నిర్మాణాల్లో జూన్, జూలై నాటికి 24 భవనాలు పూర్తి కానున్నాయి. వచ్చే దసరా పండుగనాటికి మరో 16 భవనాలు పూర్తి అవుతాయని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి తెలిపారు. ఇంకో 13 నియోజవర్గాలలో వివిధ కారణాల వల్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని చెప్పారు.



ప్రారంభానికి సిద్ధమైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

## 5న హన్మకొండకు మంత్రి కేటీఆర్

**హన్మకొండ, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు ఈ నెల 5న హన్మకొండకు రానున్నారు. బాలసముద్రంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో ప్రారంభించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.కోటితో క్యాంపు కార్యాలయం సిద్ధమైందని, 5న మంత్రి కేటీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, అజ్మీరా చందూలాల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. సమావేశంలో కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, టీఆర్‌ఎస్ నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, జకార్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసిన వేగం

### సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**బస్సును ఢీకొన్న కారు.. ఐదుగురి దుర్మరణం.. పలువురికి గాయాలు**



సంగారెడ్డి జిల్లా కంది సమీపంలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



మృతులు.. బాశెట్టి మహేశ్, వెంకట్‌రాంరెడ్డి, న్యాత నాగరాజు, ఎల్లుగారి వెంకటేశ్వర్‌రెడ్డి, బందారం నరేందర్‌చారి (ఫైల్)

**సంగారెడ్డి అర్బన్, నమస్తే తెలంగాణ:** మితిమీరిన వేగం, ఐదు నిండు ప్రాణాలను బలిగొన్నది. సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ క్యాంపస్ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు రోడ్డుకు అవతలి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి పట్టణంలో ఫ్లెక్సీ ప్రిం టింగ్ నడిపే బాశెట్టి మహేశ్(28), అతని వద్ద పనిచేసే తునికి వెంకట్ రాంరెడ్డి(24), పుల్కల్ మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన న్యాత నాగరాజు(21)తోపాటు పట్టణానికి చెందిన ఎల్లుగారి వెంకటేశ్వర్‌రెడ్డి(28), శాంతినగర్‌కు చెందిన బందారం నరేందర్‌చారి(30) కారు(టీఎస్ 15ఈ 8699)లో రుద్రారం వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని, మధ్యాహ్న సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారి 65పై అతి వేగంగా వస్తున్న వీరి కారు.. సంగారెడ్డి సమీపంలోని కందిఐఐటీ ప్రాంగణాన్ని దాటుతుండగా, నియంత్రణ కోల్పోయి ఒక్కసారిగా డివైడర్‌ను దాటుకొని, అవతలి వైపు జహీరాబాద్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్, నాగరాజు, నరేందర్ అక్కడికక్కడే మృతి చెందగా, దవాఖానకు తరలిస్తుండగా నరేంద్రచారి, రాంరెడ్డి మరణించారు. బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. ముగ్గురి మృతదేహాలు కారులో ఇరుక్కుపోగా అతికష్టం మీద పోలీసులు బయటికి తీశారు. వీరంతా ఇంటికొక్కరే కొడుకులు కావడంతో ఆయా కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచేసింది. మృతదేహాలను సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి. బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఓదార్చారు.

## హోంగార్డు ఆత్మహత్యాయత్నం



హోంగార్డును దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

**కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎస్సై ఇంట్లో వెట్టి చాకిరి చేయిస్తూ, తనను ఇంటికి పంపకుండా మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ హోంగార్డు భయన్న శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించి ఓ పత్రికా విలేకరి అతనిని అడ్డుకొని, సీఐ శ్రీరాం సైదాబాబు, ఎస్సై వెంకటసత్యనారాయణకు సమాచారం అందించాడు. భయన్నను దవాఖానకు తరలించారు. కాగా, వైద్యులు భయన్నను వివరాలు అడుగగా, తాను మందు తాగలేదని, తాగే ప్రయత్నం చేస్తుండగా, కింద పడిపోయిందని చెప్పాడు. దీంతో అతనిని ఠాణాకు తరలించారు.

## పరీక్షల భయంతో విద్యార్థిని ఆత్మహత్య



గిరామ్ సాగరిక(ఫైల్)

**కాల్వశ్రీరాంపూర్:** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లెకు చెందిన గిరామ్ సాగరిక(17) అనే ఇంటర్ విద్యార్థిని పరీక్షల భయంతో శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆరెపల్లెకు చెందిన గిరామ్ ప్రభాకర్-రాధ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. చిన్న కూతురు సాగరిక మల్యాల మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాసినప్పటి నుంచి మనస్తాపానికి గురై, గురువారం రాత్రి సమీపంలో వ్యవసాయ బావిలో దూకింది. ఇంటర్ పరీక్షలు బాగా రాయలేదనే బెంగతో కూతురు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తండ్రి ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఖమ్మం జిల్లా యడవల్లిలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎంపీ పొంగులేటి



రంగారెడ్డి జిల్లా సాతంరాయిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

## టీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని యడవల్లిలో శుక్రవారం రాత్రి సీపీఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 175 కుటుంబాల వారు టీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం సాతంరాయి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

## దంపతుల ఆత్మహత్యాయత్నం

**జనగామ రూరల్ /జనగామ టౌన్:** కుటుంబ కలహాలతో జనగామ జిల్లా గోపరాజుపల్లికి చెందిన కుర్మ శ్రీనివాస్-చంద్రకళ దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాల్లోకి వెళితే.. గోపరాజుపల్లికి చెందిన శ్రీనివాస్‌కు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగపురికి చెందిన చంద్రకళతో పదేళ్ల క్రితం వివాహ కాగా, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. శ్రీనివాస్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం నాగపురికి వెళ్లిన వీరు, తిరిగి శుక్రవారం గోపరాజుపల్లికి వెళ్లేందుకు ఆటోలో బయల్దేరారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీనివాస్, చంద్రకళ మార్గమధ్యలో గొడవపడి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని జనగామ దవాఖానకు తరలించారు.

## పోటీ పరీక్షల్లో సత్తాచాటాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం త్వరలో నిర్వహించే పోటీ పరీక్షల్లో సత్తాచాటాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ఎస్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వం పోటీ పరీక్షల కోసం అభ్యర్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మంత్రి సందర్శించారు. శిక్షణ కేంద్రంలో నిపుణులు చెప్పే ప్రతి విషయాన్ని మీరు తర్ఫీదు పొంది, ఆయా అంశాలపై పట్టుసాధించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు.



మహబూబూనగర్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేస్తున్న ఎంపీ జితేందర్‌రెడ్డి

## అవకాశాలను అందుకోవాలి

### ఎంపీ జితేందర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ విద్యావిభాగం:** విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని, ముందుకు సాగాలని ఎంపీ జితేందర్‌రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 22 వేల మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉపయోగపడే కోర్సుల్లో చేరేందుకు ఆయా విద్యా సంస్థల వివరాలు, ప్రభుత్వ శిక్షణా సంస్థలు, గురుకులాలు, ప్రవేశాలకు సంబంధించిన వివరాలతో కెన్‌ఫిన్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను తయారు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ గైడెన్స్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు.

## సాగు సంక్షోభానికి కాంగ్రెస్, బీజేపీలే కారణం

- రైతును రాజుగా చూడాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయం
- మంత్రులు పోచారం, తుమ్మల
- ఖమ్మంలో 750 సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ



ఖమ్మంలో లబ్ధిదారుకు సబ్సిడీ ట్రాక్టర్ తాళం చెవి అందజేస్తున్న మంత్రులు పోచారం, తుమ్మల. చిత్రంలో ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యేలు

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోవటానికి కాంగ్రెస్, బీజేపీలే ప్రధాన కారణమని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సబ్సిడీపై 750 ట్రాక్టర్లు, 16 హార్వెస్టర్లు, 24 మినీ ట్రాక్టర్లను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి పోచారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పోచారం మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి, వాటిని కొనుగోలు చేయాల్సిన కేంద్ర పాలకులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా స్పందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్రంలో రైతును రాజుగా చూడాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమన్నారు. ఇందుకోసమే వ్యవసాయ అభివృద్ధికి అనేక పథకాలకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 550 మండలాల్లో ఒక్కో మండలానికి 10 చొప్పున 5,500 నాట్లువేసే యంత్రాలను ఈ ఏడాది పంపిణీచేస్తున్నామని పేర్కొన్నారు. వీటికోసం ప్రభుత్వం రూ.600 కోట్లను సబ్సిడీగా అందిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయాన్ని పండుగలా మార్చాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 2,638 మంది విస్తరణాధికారులను తమ ప్రభుత్వం నియమించిందన్నారు. మరో 851 మందిని నియమించేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, బాణోత్ మదన్‌లాల్, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో మహిళ ప్రసవం



108లో వైద్య సేవలు అందిస్తూ, తల్లీబిడ్డల్ని దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

**వరంగల్ చౌరస్తా:** వరంగల్ బస్టాండ్‌లో శుక్రవారం మహిళ ప్రసవించింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్‌రూరల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన బట్టు శైలజ నెలలు నిండడంతో దవాఖానలో చేరడానికి బస్సులో ఒంటిగంట ప్రాంతంలో వరంగల్‌కు చేరుకుంది. బస్సు దిగి ప్లాట్‌ఫాంపైకి వెళ్తున్న క్రమంలోనే నొప్పులు ఎక్కువై, అక్కడే పండంటి పాపకు జన్మనిచ్చింది. అక్కడే ఉన్న మహిళలు ఆమెను ప్లాట్‌ఫాంపై చేర్చి, 108 సహాయంతో వరంగల్ సీకేఎంకు తరలించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

## సెల్‌పాయింట్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**రామడుగు:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని నాలుగు సెల్ పాయింట్లపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. యువకులు, విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని, వారి మొబైల్ ఫోన్లల్లో నీలిచిత్రాలు, పైరసీ సినిమాలు వేస్తున్నారన్న సమాచారం మేరకు సోదాలు చేసి, నీలి చిత్రాలు, పైరసీ సినిమాలున్న నాలుగు కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు పోలీసులకు అప్పగించారు.





దేశవ్యాప్తంగా హోలీ సంబురాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాజస్థాన్‌లోని పుష్కర్‌లో జరిగిన సామూహిక కార్యక్రమంలో గులాల్ చల్లుకుంటున్న ప్రజలు.. (ఇన్‌సెట్లో) చెన్నైలో రంగుల కేళిలో ఓ యువతి

## గౌరీ లంకేశ్ హత్య కేసు.. పోలీసుల అదుపులో ఒకరు



**బెంగళూరు, మార్చి 2:** సీనియర్ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో ఓ వ్యక్తిని ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నది. 'మరో కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న టి.నవీన్ కుమార్ అలియాస్ హోట్టె మాంజాను ప్రశ్నించేందుకు అదుపులోకి తీసుకున్నాం. ఐదు బుల్లెట్లు కలిగి వున్నాడన్న ఆరోపణలపై ఈనెల 19 న నవీన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నాం ' అని దర్యాప్తు అధికారి కూడా అయిన బెంగళూరు వెస్ట్ డీసీపీ ఎంఎన్ అనుచేత్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 5 న తన ఇంటి వద్దే గుర్తుతెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో గౌరీ లంకేశ్ దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే.

## భార్య ఆలస్యంగా నిద్రలేస్తున్నదని విడాకులు కోరిన భర్త!

**పిటిషన్‌ను తోసిపుచ్చిన బాంబే హైకోర్టు**



**ముంబై, మార్చి 2:** భార్య ఆలస్యంగా నిద్రలేస్తున్నదని, ఆమెకు వంట సరిగాచేయడం రాదని ఆరోపిస్తూ విడాకుల కోసం భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. ముంబైలోని శాంతాక్రజ్ ప్రాంతానికి చెందిన పిటిషనర్ తన భార్య విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని పేర్కొన్నాడు. పొద్దున్నే లేవాలని చెప్తే తనను, తన తల్లిదండ్రులను ఆమె తిడుతున్నదని, తనతో చాలాసేపు గడుపడం లేదని, తను పనికి వెళ్లి ఇంటికి వచ్చాక మంచినీళ్లు కూడా ఇవ్వదని ఆరోపించాడు. భార్య ఆ ఆరోపణలను ఖండించింది. కాగా పిటిషనర్ చేసిన ఆరోపణలు క్రూరత్వం కిందికి రావని, కాబట్టి చట్ట ప్రకారం ఈ కారణాలపై విడాకులు మంజూరు చేయలేమని జస్టిస్‌లు కేకే టాటెడ్, సారంగ్ కొత్వాల్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. లోగడ ఈ మేరకు ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. పిటిషనర్ భార్య ఒక కార్మికురాలు. బయట పనులకు వెళ్లి కుటుంబం కోసం నాలుగు డబ్బులు సంపాదిస్తున్నది. అయినా ఇటు ఇంటికి అవసరమైన సరుకులు తనే కొనుక్కొని వచ్చి అత్తమామలకు వంట చేసి పెడుతున్నది. ఇంటిపనులు కూడా చేస్తున్నది. అటువంటిది ఆమె భార్యగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు సరికావని ధర్మాసనం అభిప్రాయపడింది.

## రామేశ్వరంలో నేడు శ్రీదేవి అస్థికల నిమజ్జనం

**చెన్నై, మార్చి 2:** ఇటీవల మరణించిన బాలీవుడ్ కథానాయిక శ్రీదేవి అస్థికలను శనివారం తమిళనాడులోని రామేశ్వరం వద్ద సముద్రంలో నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు శ్రీదేవి భర్త బోనీ కపూర్ శుక్రవారం అస్థికలతో చెన్నై చేరుకున్నారు. శనివారం ప్రత్యేక విమానంలో రామేశ్వరానికి చేరుకుంటారు. గత నెల 24న దుబాయిలోని ఒక హోటల్‌లో మరణించిన శ్రీదేవి అంత్య క్రియలు బుధవారం జరిగిన సంగతి తెలిసిందే.

## నెతన్యాహును ఎనిమిదోసారి ప్రశ్నించిన పోలీసులు!



**జెరూసలేం, మార్చి 2:** మోసం, ముడుపుల కేసులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పోలీసులు శుక్రవారం ప్రశ్నించారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ అంశంపై ఆయనను పోలీసులు ప్రశ్నించడం ఇది ఎనిమిదో సారని పేర్కొన్నాయి. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో జెరూసలేంలోని నెతన్యాహు అధికారిక నివాసానికి కొందరు పోలీసులు వచ్చినట్లు తెలుస్తున్నది. అయితే దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు. ఇదిలా ఉంటే టెలీ అవీవ్‌కు సమీపంలోని నేషనల్ ఫ్రాడ్ స్క్వాడ్ ప్రధాన కార్యాలయంలో నెతన్యాహు భార్య సారా నుంచి వాంగ్మూలం సేకరించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఈ కేసులో నెతన్యాహు మాజీ అనుచరుడు, ఒక అగ్రశ్రేణి వ్యాపారవేత్త ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారు. వ్యాపారవేత్తల నుంచి నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులు 2.85 లక్షల డాలర్ల విలువైన వస్తువులు పొందారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# యూరప్‌లో ఎమ్మార్జెన్సీ!

### సైబీరియన్ చలిగాలులతో కలిసి మంచుతుఫాన్ బీభత్సం

- వణుకుతున్న పలుదేశాలు.. ఇప్పటివరకు 55మంది మృతి
- నాలుగువేల విమానాలు రద్దు
- బ్రిటన్‌లో పలుచోట్ల స్తంభించిన రాకపోకలు
- మంచులో 17 గంటలుగా చిక్కుకుపోయిన వాహనదారులు



స్విట్జర్లాండ్‌లోని జెనీవా విమానాశ్రయంలో పేరుకుపోయిన మంచును తొలిగిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

**యూ**రప్‌లో మంచుతుఫాన్ 'ఎమ్మా' బీభత్సం సృష్టిస్తున్నది. అనేక దేశాలు గజగజా వణికిపోతున్నాయి. భారీగా పతనమైన ఉష్ణోగ్రతల కారణంగా ఇప్పటివరకు 55మంది ప్రాణాలు కోల్పోయారు. భారీగా కురుస్తున్న మంచు, బలంగా వీస్తున్న గాలులతో రోడ్లపై మంచు పేరుకుపోయింది. ఫలితంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ఐరోపా వ్యాప్తంగా నాలుగువేల విమానాలు రద్దయ్యాయి. బ్రిటన్, ఐర్లాండ్‌లలో రైళ్లు, విమాన రాకపోకలు రద్దయ్యాయి. స్విట్జర్లాండ్‌లోని జెనీవా అంతర్జాతీయ విమానాశ్రయాన్నీ మూసివేశారు. సైబీరియానుంచి వీస్తున్న తుఫాన్ గాలులతో ఐరోపా అంతటా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చలిగాలులను 'బీస్ట్ ఫ్రం ది ఈస్ట్', 'సైబీరియన్ బియర్'గా వ్యవహరిస్తుండగా, అవి మంచుతుఫాన్ ఎమ్మాతో కలువడంతో వాతావరణం భీకరంగా మారింది.

**బ్రిటన్‌లో 17గంటలపాటు ట్రాఫిక్ జామ్.. రంగంలోకి సైన్యం**

మంచుతుఫాన్ ప్రభావం బ్రిటన్‌పై తీవ్రంగా ఉంది. చలిగాలుల తీవ్రత, హిమపాతం మరింత పెరిగే ప్రమాదమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమర్‌సెట్ నుంచి విల్ట్‌షైర్ వరకు



బ్రిటన్‌లో మంచుకారణంగా నిలిచిపోయిన వాహనాలు

ఏ303 రహదారిపై మంచు కారణంగా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. సుమారు 100వాహనాలు మంచులో కూరుకుపోగా, 17గంటలపాటు డ్రైవర్లు అక్కడే చిక్కుకుపోయారు. 'బ్రిటన్ అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ముందుముందు మంచుతుఫాన్ తీవ్రత మరింత పెరుగనుంది. ఇకపై మంచుతో కూడిన వర్షం పడవచ్చు' అని వాతావరణశాఖ ప్రతినిధి స్టీవెన్ కీట్స్ వెల్లడించారు. 'పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ట్రాఫిక్ స్తంభించిన మార్గాల్లో సైన్యాన్ని రంగంలోకి దించాం. లింకన్‌షైర్‌లోని ప్రజలను రాయల్ ఎయిర్‌ఫోర్స్ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది' అని ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం వరకు అన్ని రైళ్లను, విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యాసంస్థలన్నింటికీ వారంరోజులపాటు సెలవులు ప్రకటించారు. మంచుతుఫాన్ కారణంగా ఇప్పటివరకు 10మంది మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. గురువారం కార్న్‌వాల్‌లో ఓ కారు రోడ్డుపై జారి పక్కన ఉన్న ఇంటిని ఢీకొనడంతో ఓ ఏడేండ్ల చిన్నారి మృతిచెందింది. లీడ్స్‌లో మంచుతో కూరుకుపోయిన రోడ్డుపై వృద్ధురాలి(75) మృతదేహం లభ్యమైంది. వెల్లింగ్‌లోని ఓ సరస్సు వద్ద ఓ వృద్ధుడు శవమై కనిపించారు.

- నేషనల్ డెస్క్




# ఐజీసీఏఆర్‌లో 300 ట్రేడ్ అప్రెంటిస్‌లు

**కల్పకం (తమిళనాడు)లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ ఎనర్జీ (ఐజీసీఏఆర్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు:**

**ఐజీసీఏఆర్ అనేది డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తున్న సంస్థ.**

- మొత్తం ఖాళీల సంఖ్య: 300
- **విభాగాలు:** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ (జీ అండ్ ఈ), ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్), మెకానిక్ (రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ), కార్పెంటర్, పాసా (ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్), గార్డెనర్, హార్టికల్చర్ అసిస్టెంట్
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతితోపాటు ఐటీఐ ఉత్తీర్ణత లేదా ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ నుంచి జారీచేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి.
- **శిక్షణ ఇచ్చే ప్రదేశం:** ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ ఎనర్జీ (కల్పకం)-తమిళనాడు
- **వయస్సు:** 2018, మార్చి 15 నాటికి 14 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **శిక్షణ:** షెడ్యూల్-1లోని 1991 అప్రెంటిస్ యాక్ట్ ప్రకారం శిక్షణ ఇస్తారు.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు+ఇంటర్వ్యూ
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో. అర్హులైన అభ్యర్థులు మొదట www.apprenticeship.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. దీనిద్వారా యూనిక్ రిజిస్ట్రేషన్ నంబర్ జనరేట్ అవుతుంది. ఆ తర్వాత ఐజీసీఏఆర్ వెబ్‌సైట్‌లో అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్‌కు రిజిస్టర్ చేసుకోవాలి. ఆన్‌లైన్ హార్డ్‌కాపీని ప్రింట్ తీసుకొని, అవసరమైన సెల్ఫ్ అటెస్టెడ్ సర్టిఫికెట్లను జతచేసి ఇంటర్వ్యూ రోజున పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి
- **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 13, 14, 15
- **చిరునామా:** Department of Atomic Energy (DAE) Guest House, DAE Guest House, DAE Township, Kancheepuram District, Kalpakkam, Tamil Nadu-603102
- **చివరితేదీ:** మార్చి 15, మధ్యాహ్నం 3 గంటల వరకు
- **వెబ్‌సైట్:** www.igcar.gov.in



- పదోతరగతి, ఐటీఐలో ఉత్తీర్ణత
- అకడమిక్ మార్కులు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- నిబంధనల ప్రకారం స్టయిఫండ్

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఎన్‌ఐఆర్‌డీ & పీఆర్‌లో

**హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీరాజ్ రిసెర్చ్ అసోసియేట్స్, సైంటిస్టు తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

**వివరాలు:**

**ఎన్‌ఐఆర్‌డీ & పీఆర్‌లోని సెంటర్ ఫర్ జియోఇన్ఫర్మాటిక్స్ అప్లికేషన్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ (సీజీఏఆర్‌డీ)లో ప్రస్తుత ఖాళీలు ఉన్నాయి.**

- ఎస్ఆర్ఎఫ్/సీనియర్ రిసెర్చ్ అసోసియేట్ - 4
- **అర్హత:** ఎంటెక్/ఎమ్మెస్సీలో జియో ఇన్ఫర్మాటిక్స్/జీఐఎస్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత.
- జేఆర్ఎఫ్/ సీనియర్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ - 6
- **అర్హతలు:** ఎంటెక్/ఎమ్మెస్సీ జియో ఇన్ఫర్మాటిక్స్ స్పాటియల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా జీఐఎస్.
- జూనియర్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ - 10 ఖాళీలు
- **అర్హతలు:** ఎంటెక్/ఎమ్మెస్సీ లేదా బీఎస్సీలో జియో ఇన్ఫర్మాటిక్స్ లేదా జీఐఎస్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ - 5



- **అర్హతలు:** బీటెక్/బీఈలో జియో ఇన్ఫర్మాటిక్స్ లేదా సీఎస్ఈ/ఈసీఈ లేదా సివిల్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- ప్రాజెక్టు స్కానింగ్ అసిస్టెంట్/అటెండెంట్ - 2
- **ఎంపిక:** రాతపరీక్ష/ట్రేడ్‌టెస్ట్ లేదా వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 18
- **వెబ్‌సైట్:** http://www.nird.org.in

## పీజీ డిప్లొమా కోర్సులు

**కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**

**ఎన్ఐఈఎల్ఐటీ భారత ప్రభుత్వ పరిధిలోని స్వతంత్ర సంస్థ. ఇది ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది.**

పీజీ డిప్లొమా కోర్సులు: 24 వారాలు

- క్లౌడ్ కంప్యూటింగ్
- ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ

అడ్వాన్స్‌డ్ డిప్లొమా:12 వారాలు

- ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ (లెవల్ -1)
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- బిగ్‌డాటా అనలిటిక్స్ (16 వారాలు)
- **కోర్సు ప్రారంభ తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.nielt.gov.in/calicut

## మెట్రోరైల్‌లో మేనేజర్లు

**బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**

**బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది భారత ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వ సంయుక్త ప్రాజెక్టు.**



- జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) - 1, జనరల్ మేనేజర్ (సిగ్నలింగ్ & టెలికం) -1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీ వే) - 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ట్రాక్షన్) -1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఏ) - 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్) - 1, మేనేజర్ (ఆపరేషన్స్/ఓసీసీ) -3, మేనేజర్ (పీ వే) - 2, అసిస్టెంట్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఏ) - 4, అసిస్టెంట్ మేనేజర్ (హెచ్ఆర్) - 4, మేనేజర్ (ఐటీ) - 2, అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ) - 2, సెక్షన్ ఇంజినీర్స్ (నెట్‌వర్కింగ్) - 3, జూనియర్ ఇంజినీర్ (ఐటీ) - 7 ఖాళీలు ఉన్నాయి.
- **కన్సాలిడేటెడ్ పే:** జనరల్ మేనేజర్ - రూ. 13,77,90/-, డిప్యూటీ జనరల్ మేనేజర్ - రూ. 74,760, మేనేజర్ - రూ. 63,960/-, అసిస్టెంట్ మేనేజర్ - రూ. 52,920/-, సెక్షన్ ఇంజినీర్ - రూ. 41,100/-, జూనియర్ ఇంజినీర్ - రూ. 35,960/-
- **కాంట్రాక్ట్ పీరియడ్:** ఏడాది నుంచి మూడేండ్ల వరకు
- **ఎంపిక:** కమిటీ షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చిరునామా:** General Manager (HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor,BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore
- **చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** www.bmrc.co.in

## ఐబీబీఐలో అసిస్టెంట్ మేనేజర్లు

**ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా గ్రేడ్‌ఏ విభాగంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు:**

- మొత్తం పోస్టుల సంఖ్య: 18 (జనరల్-11, ఓబీసీ-4, ఎస్సీ-2, ఎస్టీ-1)
- **పోస్టు పేరు:** అసిస్టెంట్ మేనేజర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సీఏ, సీఎస్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ(ఫైనాన్స్), మాస్టర్ డిగ్రీ (ఎకనామిక్స్/కామర్స్)లో ఉత్తీర్ణత. లిమిటెడ్ ఇన్‌సాల్వెన్సీ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **వయస్సు:** 2018 మార్చి 1 నాటికి 28 ఏండ్లకు మించరాదు. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 28,150-55,600/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్‌పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ
- రాతపరీక్ష 150 మార్కులు. సమయం 120 నిమిషాలు
- ఈ ఆబ్జెక్టివ్ ఆన్‌లైన్ రాతపరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఎకనామి/ఫైనాన్షియల్ సెక్టార్ అవేర్‌నెస్, ఇన్‌సాల్వెన్సీ అండ్ సంబంధిత లా అంశాల్లో ప్రశ్నలను ఇస్తారు.
- ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కులను తగ్గిస్తారు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా 18 ఎగ్జామినేషన్ సెంటర్లలో నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 14
- **వెబ్‌సైట్:** www.ibbi.gov.in

## ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్

**ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు**

- మొత్తం పోస్టులు: 35

**పోస్టుల వారీగా ఖాళీలు.**

- డిప్యూటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్- 1, చీఫ్ ఆఫ్ ఐటీ- 1, సింథటిక్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్- 2
- ట్రెయినీ క్యాబిన్ క్రూ- 16, స్టేషన్ మేనేజర్- 14, ఇన్‌స్ట్రక్టర్ (టెక్నికల్)- 1
- **అర్హతలు:** పోస్టులను బట్టి వేర్వేరు అర్హతలు ఉన్నాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తును పూర్తిగా నింపి, అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి సంబంధిత అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 23
- **వెబ్‌సైట్:** www.airindia.in

## జూనియర్ అసిస్టెంట్లు

**హర్యానాలోని వ్యాప్కోస్ లిమిటెడ్ జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**

**వ్యాప్కోస్ లిమిటెడ్ భారత ప్రభుత్వ రంగ సంస్థ.**

- **పోస్టు:** జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్)-8
- **పేస్కేల్:** రూ. 19,000 - 66,000/-
- **అర్హత:** బీకాం లేదా తత్సమాన డిగ్రీలో ఉత్తీర్ణత.
- సిస్టమ్ ఆఫీసర్ - 1
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌లో ఐటీ/సీఎస్ఈ లేదా ఈ అండ్ సీ లేదా ఎంసీఏ చేసి కనీసం ఏడేండ్లు అనుభవం ఉండాలి.
- సీనియర్ సిస్టమ్ ఆఫీసర్ - 1 పోస్టు
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (ఐటీ/సీఎస్ఈ) ఎంసీఏ.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో సీవీని పంపాలి.
- **చివరితేదీ:** మార్చి 9
- **వెబ్‌సైట్:** www.wapcos.co.in